

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 31-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 302 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 1.59 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం తె. 4.14 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ.12.33-2.03; దుర్ముహూర్తం: ఉ.9.06-9.51, మ.12.51-1.36; అమృతఘడియలు: రా.9.31-11.00; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.06 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda |Nizamabad and Bengaluru

వీసా గడువు ముగిసినా

అమెరికాలోనే..

- 7 వేల మంది భారతీయులది ఇదే పరిస్థితి
- వీరిలో 2 వేల మంది విద్యార్థులు
- అమెరికా కాంగ్రెస్‌కు 'సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్' డైరెక్టర్ వాఘన్ నివేదిక
- నేర చరిత్ర ఉన్న అక్రమ వలసదారులను గ్వాంటనామో బేకి తరలిస్తాం: ట్రంప్

2

అమెరికాలో ఘోర ప్రమాదం

విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీ

67 మంది మృతి?.. 28 మృతదేహాల వెలికితీత



దుర్ఘటన జరిగిన పాటోమ్యాక్ నదిలో కొనసాగుతున్న గాలింపు చర్యలు

- వాషింగ్టన్ సమీపంలోని రొనాల్డ్ రీగన్ విమానాశ్రయంలో దిగబోతున్న విమానాన్ని ఢీకొట్టిన హెలికాప్టర్
- పోటోమ్యాక్ నదిలో కూలిన విమానం, హెలికాప్టర్
- విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది
- హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు.. అందరూ మృతి చెందినట్లు వార్తలు.. వైట్‌హౌస్‌కి 3 మైళ్ల దూరంలో ఘటన
- ప్రమాదంపై అధికారుల్ని నిలదీసిన అధ్యక్షుడు ట్రంప్

2

నయా ఉస్మానియాకు నేడు సీఎం శంకుస్థాపన



ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం నమూనా చిత్రం

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనానికి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం గోషామహల్ స్టేడియంలో శంకుస్థాపన చేయనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే భవనంలో 30 విభాగాలు 2 వేల పడకలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి విభాగంలో ఒక్కో ఆపరేషన్ థియేటర్, ఆధునిక సదుపాయాలతో ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ ఆస్పత్రి భవనం నమూనా చిత్రాన్ని గురువారం విడుదల చేశారు.

ఎఫ్ఆర్‌బీఎంను మించి.. **50 వేల కోట్ల**

అప్పు కావాలి!




మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో బాపూఘాట్ వద్ద నివాళులర్పించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు తుమ్మల, పొంగులేటి, పొన్నం

- బడ్జెటేతర రుణాల కోసం సర్కారు యత్నాలు.. ప్రపంచ బ్యాంకు, జైకా, ఏడీబీతో సంప్రదింపులు
- ఇందిరమ్మ ఇళ్లు, గురుకులాలు, ఆర్ఆర్ఆర్, మూసీ.. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల అమలుకు అప్పులే దిక్కు!
- ఇప్పటికే టీజీఐఐసీ ద్వారా రూ.10 వేల కోట్లు, హడ్కో నుంచి రూ.2 వేల కోట్ల సేకరణ
- భూములు తాకట్టు పెట్టి అప్పునకు యోచన.. గురుకులాల 25 ఎకరాలూ తనఖా పెట్టాల్సిందే!

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల మేరకు 'గ్యారెంటీ'లను పక్కాగా అమలు చేయాల్సి ఉండగా.. నెలవారీ వస్తున్న రాబడులేమో ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, రాయితీలకే సరిపోతున్నాయి! మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుమతించినదానికంటే ఒక్క పైసా రుణం ఎక్కువగా తీసుకోవడానికి వీల్లేని పరిస్థితి! ఈ నేపథ్యంలో 'ఆర్థిక బాధ్యత, ద్రవ్య నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం)' పరిధిలోకి రాకుండా, బడ్జెట్‌కు ఆవల రుణాలు తీసుకోవాలన్నది సర్కారు సరికొత్త ఆలోచన!! రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. భూములను తాకట్టు పెట్టి, బయటి ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు సేకరించే పనిలో పడింది. తక్కువ వడ్డీతో ఎక్కడ రుణం లభిస్తే అక్కడ తీసుకోవడానికి సిద్ధపడుతోంది. ఆయా ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. ప్రపంచ బ్యాంకు, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఏజెన్సీ(జైకా), ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), నాబార్డు, హడ్కో వంటి సహకార బ్యాంకులు, దేశీయ వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో చర్చలు జరుపుతోంది. ఇప్పటికే 'తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ)' ద్వారా భూమిని

మిగతా 13వ పేజీలో...



పంచాయతీ పోరుకు సై!

- ఫిబ్రవరి రెండోవారంలో నోటిఫికేషన్?
- ఏర్పాట్ల దిశగా ఈసీ చకచకా అడుగులు
- ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్
- వివిధ కారణాలతో మిగిలిపోయిన 64 పంచాయతీల్లో జాబితాకు ఏర్పాట్లు
- అన్ని గ్రామాల తుదిజాబితా 7న సిద్ధం
- తుది ఎంపీటీసీ పరిధి జాబితా 3న వెల్లడి
- 7న సమావేశం కానున్న అసెంబ్లీ?

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు కాంగ్రెస్ సర్కారు సై అంటోంది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు కసరత్తు చేస్తూనే, ఎన్నికలకు వెళ్లేందుకు కార్యాచరణ రూపొందించుకుంటోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఓకే చెబితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. పరిణామాలను బట్టి ఫిబ్రవరి రెండో వారంలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటరు

మిగతా 13వ పేజీలో...

బంగారు పంటలు..

బేజారు ధరలు





నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మార్కెట్‌లో వేరుశనగ రాశులు; పెద్దపల్లిలో ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

- కందుల దిగుబడి బాగున్నా దెబ్బకొట్టిన ధర
- సీజన్ మొదట్లో కన్నా క్వింటాకు 2,500 తగ్గుదల
- వచ్చే నెలలో మార్కెట్లోకి మరింతగా కందులు
- ధరలు ఇంకా తగ్గుతాయన్న ఆందోళనలో రైతులు
- మార్కెట్లకు పోటెత్తిన మిర్చి.. తప్పని నష్టాల ఘాటు
- ఒకదశలో వండర్ హాట్ రకం క్వింటాకు 28,500
- ప్రస్తుతం ఏకంగా రూ.14 వేల మేర పడిన ధర
- ధరల్లేక కోల్డ్‌స్టోరేజీల్లోనే 50లక్షలకు పైగా బస్తాలు
- పత్తికీ మద్దతు కరువు.. పెద్దపల్లిలో రోడ్డెక్కిన రైతు
- ఎమ్మెస్పీ రూ.7,500.. ఇస్తోంది రూ.5,800
- ఎన్నికల హామీ క్వింటాకు రూ.475 ఏది?
- వేరుశనగ రైతూ కుదేలు.. మద్దతు ధర రూ.6,783
- మెజారిటీ మార్కెట్లో రూ.4వేలలోపే చెల్లింపు

మహబూబ్‌నగర్, పెద్దపల్లి టౌన్, వికారాబాద్, ఖమ్మం మార్కెట్, వరంగల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాగలి కట్టి.. కాడెడ్లను అదిల్చి.. దుక్కి దున్ని.. విత్తనాల సాగుకు నడుంకట్టింది మొదలు రైతుల మదిలో ఒకటే ఆలోచన! చక్కని దిగుబడులు రావాలి.. ఆ పంటలకు మంచి ధరలు దక్కాలి అని! అయితే మనసులో ఏ మూలనో వారు భయపడిందే జరిగింది. చేతికొచ్చిన పంటలను గంపెడాశతో మార్కెట్లోకి తీసుకెళితే వారిని ధర వెక్కిరిస్తోంది. కందులు, మిర్చి, పత్తి, వేరుశనగ రూపంలో ప్రధాన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ఫలితంగా రైతన్నలు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులూ చేతికివచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలంటూ రోడ్డెక్కి.. ఆందోళనలు చేస్తున్నారు. ఈసారి విరగకాసి.. చక్కని దిగుబడులు రాల్చి మురిపించిన కందులు, ధర దగ్గరకొచ్చేసరికి రైతన్నలను ఏడిపిస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.10,737 వరకు ధర పలికినా ఇప్పుడు ధర దారుణంగా పడిపోయింది. గురువారం నాణ్యమైన

మిగతా 14వ పేజీలో...

శీతాకాల సభల్లో సెగలే!

- నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు
- వాడీవేడిగా అఖిలపక్ష భేటీ
- కుంభమేళాలో తొక్కిసలాట, వక్ఫ్ బిల్లులో దూకుడుపై విపక్షం ఫైర్
- జమిలి ఎన్నికలపై తొందరపడొద్దన్న ఎన్డీఏ మిత్రపక్షం జనతాదళ్ (యూ)
- ప్రత్యేక ప్యాకేజీ కావాలన్న ఎల్జేపీ
- వైసీపీ పక్కన మాకు సీట్లా?: టీడీపీ
- స్పీకర్‌కు వక్ఫ్ బిల్లు నివేదిక సమర్పణ
- బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ బిల్లు

నేడు పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే



స్పీకర్ ఓం బిర్లాకు వక్ఫ్ బిల్లు నివేదిక అందజేత

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శీతాకాల పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈసారి మరింత సెగలు కక్కే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల ముంగిట్లోనే చోటుచేసుకున్న మహా కుంభమేళా విషాదంలో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వక్ఫ్ బిల్లును విపక్షాల నుంచి వచ్చిన ఒక్క సిఫారసునూ పరిగణించకుండానే కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసేసింది. ఆ బిల్లును

మిగతా 10వ పేజీలో...



త్రిశంకుస్వర్గంలోకి ఆర్థిక వ్యవస్థ

- ప్రజలు, చిరువ్యాపారులపై పన్నులు
- కార్పొరేట్లకు భారీ మినహాయింపులు
- ఇతర దేశాలతో పోటీ పడలేని అసమానతల వ్యవస్థగా భారత్
- లబ్ధప్రతిష్ఠ ప్రభుత్వ సంస్థలను మోదీ ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది
- కాంగ్రెస్ విమర్శ.. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఆర్థికరంగంపై నివేదిక

మధ్యతరగతిని ఆదుకోండి

- చిన్న వ్యాపారాల్ని ప్రోత్సహించండి
- కేంద్రానికి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 30: దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. త్రిశంకుస్వర్గంలోకి నెడుతోందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఆరోపించింది. దీని ఫలితంగా భారతదేశం ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడలేని విధంగా, తగిన స్థాయిలో ఉత్పాదకత జరపలేని దేశంగా, అసమానతల వ్యవస్థగా తయారవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. 'వృద్ధికి ఏమైంది' అనే పేరుతో కాంగ్రెస్ ఒక నివేదికను గురువారం విడుదల చేసింది. ఏఐసీసీ పరిశోధన విభాగం చెయిర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎంవీ రాజీవ్ గౌడ సారథ్యంలో రూపొందిన ఈ నివేదికను ఏఐసీసీ కార్యాలయంలో కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరం విడుదల చేశారు. 2024-25లో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.4% ఉంటుందని అంచనా వేస్తున్నామని, ఇది సంతోషించాల్సిన

మిగతా 2వ పేజీలో...



కేరళ లిక్కర్ స్కామ్‌లో..

కవిత!

- ఒయాసిస్ కంపెనీకి లైసెన్స్ జారీలో ఆమె పాత్ర
- కేరళ ప్రభుత్వ పెద్దలతో కవిత సంప్రదింపులు
- పినరయి విజయన్ ఏకపక్ష నిర్ణయం
- విపక్ష నేత సతీశన్ ఆరోపణ.. ఖండించిన కవిత

మలప్పురం, జనవరి 30: ఢిల్లీ మాదిరిగా కేరళలోనూ లిక్కర్ స్కామ్ జరిగిందని.. దీని వెనక తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక పాత్ర పోషించారని అసెంబ్లీలో విపక్ష కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ ఆరోపించారు. గురువారం ఆయన మలప్పురంలోని ఎడవన్నలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. 2023లో ఈ కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. "అప్పట్లో పాలక్కడ్‌లోని ఎలపల్లి పంచాయతీలో ఒయాసిస్ కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరిట భూములను కొనుగోలు చేశారు. అనూహ్యంగా ఆ తర్వాత మద్యం విధానంలో సవరణలు చేసి, ఆ కంపెనీకి మద్యం తయారీ లైసెన్స్ ఇచ్చారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఎక్సైజ్ మంత్రి ఎంబీ రాజేశ్ ఏ శాఖను సంప్రదించకుండా ఏకపక్షంగా అనుమతులిచ్చారు. ఈ వ్యవహారాన్ని నడిపించింది కల్వకుంట్ల కవిత. ఆమె కేరళకు వచ్చి, ప్రభుత్వ పెద్దలతో మంతనాలు జరిపారు" అని ఆయన వివరించారు. తమ ఆరోపణలకు క్యాబినెట్ నోటే ఆధారమని చెప్పారు. తాము మీడియాకు విడుదల చేసిన కేబినెట్ నోట్ నకిలీది అని మంత్రి ఖండించలేదని గుర్తు చేశారు. ఒయాసిస్ కోసం మద్యం పాలసీని

మిగతా 14వ పేజీలో...



పోలీసులు స్వాధీనం చేసుకున్న కంటైనర్

కంటైనర్‌లో జూమ్ కార్లు

- అద్దె పేరుతో హైదరాబాద్‌లో అపహరణ
- కంటైనర్‌లో చెన్నైకు తరలింపు
- జీపీఎస్‌తో గుర్తించి ఏపీలోని బిట్రగుంట వద్ద పోలీసుల స్వాధీనం

13

సహోద్యోగిని ఫిర్యాదు..

టెకీ ఆత్మహత్య

- కంపెనీ హెచ్‌ఆర్‌కు తనపై ఫిర్యాదు చేసిందని ఆందోళన
- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య.. యాదాద్రి జిల్లాలో ఘటన

3



3

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు బెయిల్

- భుజంగరావు, రాధాకిషన్‌రావులకు షరతులతో మంజూరు చేసిన హైకోర్టు

కుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

- 15 గుడారాలు దగ్ధం.. తప్పిన ప్రాణనష్టం
- బుధవారం నాటి తొక్కిసలాట నేపథ్యంలో వాహనాల రాకపోకలపై నిషేధం
- వీవీఐపీ పాస్‌లు రద్దు చేసిన యోగి సర్కారు
- 3న వసంత పంచమి అమృత స్నానాల ఏర్పాట్ల పర్యవేక్షణకు సీఎస్, డీజీపీకి సీఎం ఆదేశం

2



కుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

15 గుడారాలు దగ్ధం.. తప్పిన ప్రాణనష్టం

మహాకుంభ్ నగర్, జనవరి 30: ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సెక్టార్-22 వెలుపల చమన్‌గంజ్ చౌకీ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు 15 గుడారాలు ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఆ సమయంలో టెంట్ల లోపల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. కుంభమేళా ప్రారంభమైన తర్వాత జరిగిన మూడో అగ్నిప్రమాదం ఇది. జనవరి 25న జరిగిన ప్రమాదంలో రెండు వాహనాలు దగ్ధం కాగా, అదే నెల 19న గ్యాస్ సిలిండరు పేలడంతో 18 టెంట్లు కాలిపోయాయి. ఇదిలాఉండగా, మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో యూపీ సర్కారు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్'గా ప్రకటించడంతోపాటు కఠిన భద్రతా చర్యలను అమల్లోకి తెచ్చింది. రద్దీని నివారించడానికి 30పాంటూన్ బ్రిడ్జిలను వన్‌వేగా మార్చారు. బుధవారం అర్ధరాత్రి అధికారులతో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సమావేశమయ్యారు. వసంత పంచమి (ఫిబ్రవరి 3) రోజున అమృత స్నానాలు ఉన్నందున ఏర్పాట్లను పరిశీలించాలని సీఎస్, డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రయాగ్‌రాజ్ పొరుగు జిల్లాల నుంచి వచ్చే వాహనాలు జిల్లా సరిహద్దుల్లోనే నిలిపివేయాలని, ఫిబ్రవరి 4వరకూ నగరంలోకి నాలుగు చక్రాల వాహనాల ప్రవేశంపై పూర్తిగా నిషేధం విధించారు.పాస్‌ల జారీ నిలిపివేయడంతోపాటు వాహనాల రాకపోకలపై నిషేధం అమలు చేయాలని ఆదేశించారు.



మహా కుంభమేళాలో పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు

కాగా, కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై యూపీ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. విశ్రాంత న్యాయమూర్తి హర్ష్‌కుమార్ నేతృత్వంలోని కమిషన్ నెలలోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించనుంది. మాజీ డీజీపీ వీకే గుప్తా, విశ్రాంత ఐఏఎస్ డీకే సింగ్ సభ్యులుగా ఉంటారు.

కిక్కిరిసిన రైళ్లలో నరకం

కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేసేందుకు తరలివెళ్తున్న యాత్రికులతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన నగరాల నుంచి 13వేల రైళ్లతో పాటు మరో 3వేల ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినా.. అవి ఏ మూలకూ సరిపోవడం లేదు. నిలబడటానికీ స్థలం లేక ప్రయాణికులు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. బోగీల తలుపులు మూసేస్తుండటంతో స్టేషన్లలో ఎక్కాల్సినవారు ఆగ్రహంతో రైళ్లపైకి రాళ్లు రువ్వుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

లోకం తీరు



బీజేపీ అభ్యర్థికి మోదీ పాదాభివందనం

» ఢిల్లీ బహిరంగ సభలో సన్నివేశం



న్యూఢిల్లీ, జనవరి 30: ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థికి పాదాభివందనం చేయడం ఆకట్టుకొంది. గురువారం ఘోండాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఈ సన్నివేశం చోటు చేసుకుంది. సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రధానికి పరిచయం చేశారు. వారంతా ఆయనకు పాదాభివందనం చేశారు. ప్రతాప్‌గంజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రవీందర్ సింగ్ నేగి (45)ని పరిచయం చేయబోగా ఆయన కూడా పాదాభివందనం చేశారు. కానీ మోదీ తిరిగి మూడుసార్లు అయనకు పాదాభివందనం చేశారు. నేగి ప్రస్తుతం బీజేపీ కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వివాదాస్పదుడన్న పేరుంది.

బంగళాల్లోని పని మనుషులకు 7 గ్యారెంటీలు

» కేజ్రీవాల్ ఎన్నికల హామీలు

న్యూఢిల్లీ, జనవరి 30: మంత్రులు, ఎంపీలు, అధికారులకు కేటాయించిన అధికారిక నివాసాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఏడు గ్యారెంటీలను ప్రకటించారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారికి ప్రత్యేకంగా సర్వెంట్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు, ఉద్యోగం పొందేవరకు ఉండడానికి ప్రత్యేకంగా హాస్టళ్ల నిర్మాణం, ఆరోగ్యం కోసం సంచార వైద్యశాలల ఏర్పాటు, జీతాలు, పనివేళల నిర్ధారణకు చట్టానికి రూపకల్పన, రూ.10లక్షల జీవిత బీమా సౌకర్యం, కుమార్తెల వివాహానికి రూ.లక్ష ఆర్థిక సాయం, పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యం కల్పిస్తామన్న గ్యారెంటీలు ఇచ్చారు.

యమునలో విషం కలిపిన ఆధారాలు ఇవ్వండి

» కేజ్రీవాల్ ఆరోపణలపై ఈసీ ఆదేశాలు

న్యూఢిల్లీ, జనవరి30: యమునా నదిలో బీజేపీ విషం కలిపిందంటూ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఈసీ మరోమారు కన్నెర్ర చేసింది. హరియాణా బీజేపీ ప్రభుత్వం యమునా నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలను వదులుతూఢిల్లీ ప్రజలను హతమార్చాలని చూస్తోందన్న ఆరోపణలపై తగిన సాక్ష్యాధారాలను చూపించాలని ఆదేశించింది. ఈరోజు(శుక్రవారం) ఉదయం 11 గంటల్లోపు తగిన సాక్ష్యాధారాలు ఢిల్లీ జల్ బోర్డ్‌కు చూపించలేని పక్షంలో తగినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మరోవైపు ప్రజారోగ్య సంక్షోభంపై చర్చించాల్సిన బాధ్యతలో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేసినట్లు కేజ్రీవాల్ ఇప్పటికే ఈసీకి వివరణ ఇచ్చారు. అయితే వాటితో సంతృప్తి చెందని ఈసీ సాక్ష్యాధారాలు అందజేయాలని ఆదేశించింది. కాగా, ఎన్నికల సంఘం తమను లక్ష్యంగా చేసుకుని పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. రిటైర్‌మెంట్ తర్వాత పొందబోయే ప్రయోజనాల కోసమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇలా చేస్తున్నారని ఆరోపించారు.

అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్టు

సీతాపూర్ (యూపీ), జనవరి 30: అత్యాచారం కేసులో సీతాపూర్ ఎంపీ రాకేష్ రాథోడ్ (కాంగ్రెస్)ను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే పోలీసులు వచ్చి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వివాహం చేసుకుంటానని ఆశ చూపి గత నాలుగేళ్లుగా తనపై అత్యాచారం చేస్తున్నట్టు ఓ మహిళ ఈ నెల 17న ఫిర్యాదు చేసింది. దీనిపై ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్ నిరాకరించడంతో పోలీసులు వచ్చి అరెస్టు చేశారు. ఈ కేసులో రాజీకి రావాలంటూ ఒత్తిడి తెస్తున్నారంటూ ఆమె భర్తఈ నెల 22న ఎంపీ రాథోడ్, ఆయన కుమారుడు, మరో ముగ్గురిపై ఫిర్యాదు చేశాడు.

తరగతి గదిలోనే విద్యార్థిని పెళ్లాడిన ప్రొఫెసర్

» అదొక నాటకమంటూ వివరణ

కోల్‌కతా, జనవరి 30: తరగతి గదిలోనే మొదటి సంవత్సరం విద్యార్థిని ఓ మహిళా ప్రొఫెసర్ వివాహం చేసుకున్న సంఘటన పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. నదియాలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (మకుట్)లో అప్లయిడ్ సైకాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పాయల్ బెనర్జీ తన వద్ద చదివే విద్యార్థిని పెళ్లి చేసుకున్నారు. తరగతి గదిలోనే దండలు మార్చుకున్నారు. అంతకుముందు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో 'ఈ-ఆహ్వానం' పంపారు. జనవరి 9న హల్దీ, 14న సంగీత్ ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని నియమిస్తూ వైస్‌ఛాన్సలర్ తపస్ చక్రబర్తి ఆదేశాలు జారీ చేశారు. ఆమెను సెలవుపై పంపించారు. అయితే దీన్ని ఆమె ఖండించారు. తాము నాటకం వేశామని, సహోద్యోగులు కొందరు వీడియోను వైరల్ చేశారని ఆరోపించారు.

అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 30: దిగ్గజ సంస్థ అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగుల తొలగింపు మొదలయింది. వ్యయాల తగ్గింపు, నిర్వహణను గాడిలో పెట్టడం, అధికారుల స్థాయిలో ఉన్న యంత్రాంగాన్ని కుదించడం, ఉద్యోగుల సామర్థ్యం పెంపు తదితర లక్ష్యాలతో యాజమాన్యం నిర్ణయం తీసుకొంది. ఇందులో భాగంగా తొలుత కొన్ని చోట్ల పరిమితంగా లేఆఫ్‌లు ప్రకటిస్తోంది. 2021లో సీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆండీ జాస్సీ ఉద్యోగుల సంఖ్య తగ్గింపుపై దృష్టి పెట్టారు. 2022 నుంచి ఇంతవరకు 27వేల మంది ఉద్యోగులను తొలగించారు. త్వరత్వరగా నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా పరిపాలనలో ఉన్న పలురకాల స్థాయిలను తగ్గించాలని నిర్ణయించారు. అందులో భాగంగా రానున్న మార్చిలోగా వివిధ యూనిట్లను పునర్వ్యవస్థీకరించనున్నారు.

డీప్ సీక్‌తో మేధో చౌర్యం ముప్పు!

» చైనా ఏఐపై అమెరికా సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్, జనవరి 30: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో ప్రకంపనలు సృష్టిస్తున్న చైనాకు చెందిన ఏఐ స్టార్టప్ డీప్‌సీక్‌పై అమెరికా సంచలన వ్యాఖ్యలు చేసింది. డీప్ సీక్ వల్ల మేధోసంపత్తి చౌర్యం జరిగే ముప్పు పొంచి ఉందని వైట్‌హౌస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారు డేవిడ్ సాక్స్ అన్నారు. ఏఐలో ఉండే డిస్టిలేషన్ అనే విధానం ద్వారా ఈ చౌర్యం సాధ్యమని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాక్స్ పేర్కొన్నారు. డిస్టిలేషన్ ముప్పును నివారించేందుకు దిగ్గజ సంస్థలు అతి త్వరలోనే చర్యలు తీసుకుంటాయని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ భారతీయ సర్వర్ల నుంచే డీప్ సీక్‌ను హోస్ట్ చేస్తామని ప్రకటించారు. డేటా గోప్యతపై ఆందోళనలకుఇదే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. కాగా, కాపీ రైట్స్ ఉల్లంఘనకు సంబంధించి భారతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ సహా పలు సంస్థలు ఓపెన్ ఏఐపై దాఖలు చేసిన కేసుకు సంబంధించి ఓపెన్ ఏఈ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ఫిబ్రవరి 5న భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత ప్రభుత్వ ఉన్నతాధికారులతోనూ ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది.

అమెరికా వినువీధుల్లో ఘోర ప్రమాదం

విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీ

67 మంది మృతి చెందినట్లు సందేహాలు.. 28 మృతదేహాల వెలికితీత

వాషింగ్టన్ సమీపంలో ఘటన

వాషింగ్టన్, జనవరి 30: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని వాషింగ్టన్ డీసీ సమీపంలోని రొనాల్డ్ రీగన్ విమానాశ్రయంలో దిగేందుకు వస్తున్న ప్రయాణికుల విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీకొన్నాయి. విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉండగా.. హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. విమానం, హెలికాప్టర్ ఢీకొన్న తర్వాత సమీపంలోని పోటామ్యాక్ నదిలో కూలిపోయాయి. విమానం ముక్కలై నదిలో పడిపోగా.. హెలికాప్టర్ కూడా తలకిందులుగా కూలిపోయింది. ఈ ప్రమాదం కేవలం 30 సెకన్లలో జరిగిపోయిందని అధికారులు చెబుతున్నారు. 28 మృతదేహాలు వెలికితీసినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే పోటోమ్యాక్ నదిలో ఉష్ణోగ్రతలు మైనస్ 1, 2 డిగ్రీలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం 5342.. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరింది. రొనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. 2004లో తయారైన రెండు ఇంజన్ల సీఆర్‌జే-701 విమానానికి 70 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలిగే సామర్థ్యం ఉంది. విమాన ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు, సహాయక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల కోసం నదిలో గాలింపు కొనసాగుతోంది. ఈ ప్రమాదంలో విమానంలోని 64 మందీ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని అగ్నిమాపక శాఖ చీఫ్ వెల్లడించారు. ఇప్పటి వరకు 28 మృతదేహాలను నదిలో నుంచి వెలికి తీసినట్లు తెలిపారు. గత 24 ఏళ్లలో అమెరికాలో ఇదే అతి పెద్ద ప్రమాదమన్నారు. విమానం తలకిందులుగా నది అడుగుభాగంలో కూరుకుపోయిందని, అక్కడికి దగ్గర్లోనే హెలికాప్టర్ శకలాలను కూడా గుర్తించామని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జాన్ డొన్నెలీ తెలిపారు.


వాషింగ్టన్ సమీపంలోని నదిలో సహాయక చర్యలు చేపట్టిన సిబ్బంది

ప్రమాద కారణాలపై స్పష్టత లేదు

ఈ ప్రమాదం ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కాన్సాస్ నుంచి వచ్చిన ప్రయాణికుల విమానాన్ని రీగన్ ఎయిర్‌పోర్టులోని రన్‌వే 33పై ల్యాండ్ చేసేందుకు ఏటీసీ అనుమతి ఇచ్చింది. సరిగ్గా అదే సమయానికి ఓ మిలిటరీ హెలికాప్టర్ ఆ మార్గంలోకి వచ్చింది. అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్.. హెలికాప్టర్‌కు సమాచారమిచ్చారు. కానీ, కేవలం 30 సెకన్లలోపే ఆ రెండూ ఢీకొన్నాయి. రన్‌వేకు 2400 అడుగుల దూరంలో విమానం నుంచి రేడియో ట్రాన్స్‌పాండర్ డేటా ఆగిపోయింది. కాగా, విమానాన్ని ఢీకొన్న హెలికాప్టర్‌ను శిక్షణకు ఉపయోగిస్తున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.

అధ్యక్షుడు ట్రంప్ అసహనం

ఈ ప్రమాదంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. "విమానాశ్రయానికి వెళ్లే దారిలో విమానం సరైన దిశలో ఉంది. కానీ, హెలికాప్టర్ చాలాసేపు నేరుగా విమానం వైపు వెళ్లింది. ఆకాశం నిర్మలంగా ఉంది. విమానం లైట్లన్నీ వెలుగుతున్నాయి. హెలికాప్టర్ ఎందుకు పక్కకు వెళ్లలేదు? విమానాన్ని చూశారా అని అడిగే బదులు ఏం చేయాలో కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది ఎందుకు చెప్పలేదు? ఇది పూర్తిగా నివారించదగ్గ ప్రమాదం. ఇలా జరగడం ఏమాత్రం సరి కాదు" అని ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు.

మోదీ, షాకు పన్నూన్ బెదిరింపులు

» రాజ్‌నాథ్, అజిత్ దోభాల్‌లకు కూడా..

» యూఏపీఏ ట్రైబ్యునల్‌కు కేంద్రం వెల్లడి

» 'సిక్స్ ఫర్ జస్టిస్'పై ఐదేళ్ల పాటు నిషేధ పొడిగింపునకు ట్రైబ్యునల్ సమర్థన

న్యూఢిల్లీ, జనవరి 30: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ స్థాపించిన 'సిక్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జే) సంస్థపై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లపాటు పొడిగించడాన్ని ఢిల్లీ హైకోర్టుకు చెందిన యూఏపీఏ ట్రైబ్యునల్ సమర్థించింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని పేర్కొంటూ కేంద్ర హోంశాఖ ఎస్ఎఫ్‌జేపై గత ఏడాది జూలై 10న చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధాన్ని పొడిగించింది. ఎస్ఎఫ్‌జేను చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటించడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయా?అనేదానిపై తీర్పునిచ్చేందుకు జస్టిస్ అనుప్‌కుమార్ నేతృత్వంలో ఢిల్లీ హైకోర్టు ట్రైబ్యునల్ ఆగస్టు 2న ఏర్పాటైంది. ఈ మేరకు ట్రైబ్యునల్ ఈ నెల 3న జారీచేసిన ఉత్తర్వులు తాజాగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని మోదీ సహా హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌లకు ఎస్ఎఫ్‌జే నుంచి బెదిరింపులు వచ్చాయని కేంద్రం తెలిపింది. పార్లమెంట్, ఎర్రకోటలపై బాంబు దాడి చేస్తామంటూ గత ఏడాది జూలై 22న వాయిస్ సందేశం పంపిందని పేర్కొంది. భారత్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాల్లో ఎస్ఎఫ్‌జే హస్తం ఉందని వెల్లడించింది. ప్రత్యేక ఖలిస్థానీ దేశం పేరుతో పంజాబ్‌లో వేర్పాటు భావజాలానికి మద్దతిస్తూనే ఉందని తెలిపింది. భారత దళాలపై పోరాడాలని ఆందోళనలు చేస్తున్న రైతులను పన్నూన్ రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని కేంద్రం వెల్లడించింది.

'పినాక' కోసం భారీ డీల్!

» 10 వేల కోట్ల ఒప్పందానికి సీసీఎస్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 30: భారత సైన్యం కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ వ్యవస్థను మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) రూ.10 వేల కోట్ల విలువైన రాకెట్లు, మందుగుండు సామగ్రి కొనుగోలు కోసం అతిపెద్ద దేశీయ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. వీటి కొనుగోళ్లకు అవసరమైన అనుమతులు ఇచ్చామని సంబంధిత అధికారులు వెల్లడించారు. చైనాతో ఉత్తర సరిహద్దు వెంబడి భారత్ తన సైనిక శక్తిని బలోపేతం చేస్తున్న నేపథ్యంలో మరో ఆరు పినాక రెజిమెంట్ల కోసం.. మందుగుండు సామగ్రిని ఈ డీల్ ద్వారా సేకరించనున్నారు. భారత సైన్యం వద్ద ఇప్పటికే నాలుగు రెజిమెంట్ల పినాక రాకెట్ వ్యవస్థలు ఉన్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా స్వదేశీ కంపెనీల నుంచి పినాక రాకెట్లు, మందుగుండును కొనుగోలు చేయనున్నారు. కాగా, శత్రు స్థావరాలను, లక్ష్యాలను సెకన్ల వ్యవధిలో ధ్వంసం చేయగల సత్తా పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ (ఎంబీఆర్ఎల్) వ్యవస్థ సొంతం. సోవియెట్ కాలంనాటి గ్రాడ్ బీఎం-21 రాకెట్ లాంచర్ స్థానంలో పినాక ఎంబీఆర్ఎల్‌ను రూపొందించారు. కార్గిల్ యుద్ధంలో మొదటిసారిగా దీన్ని మోహరించారు. డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ) అభివృద్ధి చేసిన పినాకాలో 60 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే ఫ్రీ ఫ్లయిట్ ఆర్టిలరీ రాకెట్ ఉంది. 12 రాకెట్లను త్వరితగతిన ప్రయోగించగల మల్టీ ట్యూబ్ లాంచర్లు దీనిలో ఉన్నాయి.

వీసా గడువు ముగిసినా అమెరికాలోనే

7 వేల మంది భారతీయులది ఇదే పరిస్థితి.. వీరిలో 2 వేల మంది విద్యార్థులు

» అమెరికా కాంగ్రెస్‌కు 'సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్' డైరెక్టర్ వాఘన్ నివేదిక

వాషింగ్టన్, జనవరి 30: వీసా గడువు ముగిసినా.. ఏడు వేల మంది భారతీయులు ఇంకా అమెరికాలోనే ఉన్నారని అమెరికా కాంగ్రెస్ ఏర్పాటు చేసిన కమిటీ దృష్టికి సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ డైరెక్టర్ జెస్సికా.ఎం.వాఘన్ తీసుకువెళ్లారు. వీరంతా స్టూడెంట్(ఎఫ్-1, ఎం-1) వీసాలు, ఎక్స్‌చేంజ్ విజిటర్ వీసా(జే వీసా)లపై అమెరికాకు వచ్చారని, 2023లో వీరి వీసాల గడువు ముగిసిందని స్పష్టం చేశారు. ఈ 7 వేల మందిలో 2 వేల మంది విద్యార్థులున్నట్లు చెప్పారు. బ్రెజిల్, చైనా, కొలంబియా, భారత్ నుంచి రెండేసి వేల మందికి పైగా విద్యార్థులు గడువు ముగిసినా.. అమెరికాలోనే నివసిస్తున్నట్లు కాంగ్రెస్ దృష్టికి తీసుకువచ్చారు. "32 దేశాలకు చెందిన విద్యార్థులు, ఎక్స్‌చేంజ్ విజిటర్లలో 20 శాతానికి పైగా వీసా గడువు దాటినా.. అమెరికాలోనే ఉంటున్నారు. ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు తీసుకున్నవారే ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు" అని వాఘన్ పేర్కొన్నారు. కాగా.. హెచ్-1 వీసాలను అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఫుల్‌టైమ్ కోర్సులు చేసేవారు, స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునేవారికి జారీ చేస్తారు. వృత్తివిద్య, నాన్-అకడమిక్ ప్రోగాములు చదివేవారికి ఎం1 వీసాలను అందజేస్తారు. వీసాల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో వ్యవస్థలో, చట్టాల్లో ప్రక్షాళన అవసరమని వాఘన్ అభిప్రాయపడ్డారు. "ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేయాలి. వీసా గడువు ముగిశాక మారుమూల ప్రాంతాల్లో ఉంటున్న వారిని కూడా గుర్తించి, వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం కాంగ్రెస్ చట్టసవరణ చేయాలి. ప్రతి విద్యార్థి చదువు పూర్తవ్వగానే వారి సొంత దేశాలకు వెళ్లేందుకు సిద్ధపడాలి" అని సూచించారు. అమెరికాలో వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాల జారీని కఠినతరం చేయాలని వాఘన్ అభిప్రాయపడ్డారు. "రీసెర్చ్, నాన్ ప్రాఫిట్ వంటి వీసాలు అపరిమితంగా ఉండకూడదు. వాటి సంఖ్యను 75 వేల లోపునకు కుదించాలి. ఒకవేళ వీసా సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే.. అధికంగా వేతనాలు చెల్లించే సంస్థలకు ప్రాధాన్యమివ్వాలి. హెచ్-1బీ గడువును రెండేళ్లకు నిర్ణయించాలి. అవసరాన్ని బట్టి మాత్రమే నాలుగేళ్లకు పొడిగించే వెసులుబాటు ఉండాలి. గ్రీన్ కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే.. ఆటోమేటిక్‌గా హెచ్-1బీ పొడిగింపు విధానాన్ని రద్దుచేయాలి" అని వ్యాఖ్యానించారు. స్టెమ్ కోర్సులు చేసిన అమెరికన్లలో ఆరింట ఒకవంతు మంది (20లక్షల మంది)ఎలాంటి ఉద్యోగాలు చేయడం లేదని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను వినియోగించుకునేందుకు వీసా విధానాలను ప్రక్షాళన చేయాలని సూచించారు. కాగా.. నేర చరిత్ర ఉన్న అక్రమ వలసదారులను 'గ్వాంటానామో బే'కి తరలిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. బుధవారం ఆ మేరకు ప్రెసిడెన్షియల్ మెమోరండంపై సంతకం చేశారు. 30 వేల మంది సామర్థ్యమున్న గ్వాంటానామో బేలో ఇప్పటి వరకు ఉగ్రవాదులను నిర్బంధించేవారు. అక్రమ వలసదారులను ఆయా దేశాలు కట్టడి చేస్తాయనే నమ్మకం లేకే.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పారు.



మధ్య తరగతిని ఆదుకోండి

» బడ్జెట్‌లో పన్నుభారాలు తగ్గించండి

» కేంద్రానికి ఆర్‌ఎస్ఎస్ అనుబంధ కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాల సూచన

న్యూఢిల్లీ, జనవరి 30 : కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో మధ్యతరగతికి ఊరట కలిగించే చర్యలనూ, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించే కార్యక్రమాలను ప్రతిపాదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు కోరాయి. ముఖ్యంగా.. మధ్యతరగతి చైనా ఉత్పత్తుల్లో ఎక్కువగా వినియోగించే గొడుగులు, పాదరక్షలు వంటివాటిపై వసూలు చేస్తున్న టారిఫ్‌ను తగ్గించాలని సూచించాయి. ఉత్పాదకతతో ముడిపడిన ప్రోత్సాహకాలను కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించడం ద్వారా సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ఊతం ఇవ్వాలని కోరాయి. సంపన్నవర్గాలకు మేలు చేసే సంస్కరణలూ, రెవెన్యూను పెంచే చర్యలను కొనసాగిస్తూనే, మధ్యతరగతినీ, స్థానిక వ్యాపారులను ఆదుకునే చర్యలూ అవసరమని ఆర్ఎస్ఎస్ భావిస్తుంది. వీటిని తన ప్రాధాన్యాలుగా కేంద్ర ప్రభుత్వం ఎదుట ఉంచింది. ఇందులోభాగంగా.. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు అయిన లఘు ఉద్యోగ్ భారతి (ఎల్‌యూబీ), అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎమ్)లకు చెందిన ప్రతినిధి బృందం గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసింది. శుక్రవారం నుంచి శీతాకాల పార్లమెంటు సమావేశాలు మొదలవుతున్నాయి. ఆ మరునాడే కేంద్ర బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం ఉభయ సభల్లో ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో ఈ సంస్థలన్నీ కలిసి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా.. బడ్జెట్ విషయంలో ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యాలను మంత్రికి ఆ సంస్థలు నివేదించాయి. 'మధ్యతరగతిపై జీవన వ్యయాల భారం తగ్గించాలి. పన్నుల విధింపులో ఉదాసీనంగా ఉండాలి. విద్య, వైద్యం వంటి అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్న మధ్యతరగతి జీవులకు బడ్జెట్‌లో ఊరట ఇవ్వాలి. ఆర్థిక మాంద్యాన్ని నియంత్రించాలి" అని కోరాయి. "స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలి. బహుళ జాతి కంపెనీలపై ఆధారపడి మాత్రమే మనుగడ సాగించే పరిస్థితిని తప్పించాలి. తేలిగ్గా రుణం దొరికి, సరుకు కొనుగోలు ఖర్చులు తగ్గి, రాయితీలు ఇతర ప్రోత్సాహకాలు ఇతోధికంగా లభించేలా చర్యలు తీసుకోవాలి. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేసేందుకు ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాలి.కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహకాలను చిన్న పరిశ్రమలకూ వర్తింపజేయాలి" అని విజ్ఞప్తి చేశాయి.

విద్యకు గట్టి ప్రోత్సాహం...

జాతీయ విద్యా విధానానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయా సంఘాలు మంత్రిని కోరాయి. "భారతీయ విలువలు, చరిత్ర, ప్రాచీన జ్ఞాన సిద్ధాంతాలకు పాఠ్య ప్రణాళికలో చోటు కల్పించాలి. రాష్ట్రాల పరిధిలో ఉన్నత విద్యాసంస్థలు, గ్రామీణ పాఠశాలలు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన సంస్థలపై ఎక్కువగా ఖర్చు పెట్టాలి. విద్యాసంబంధ నిర్ణయాలు, పాఠ్య ప్రణాళిక రూపకల్పనలో విదేశీ ప్రభావాన్ని బాగా కుదించి, సాంస్కృతిక వారసత్వాన్ని చాటే అంశాలకు పెద్దపీట వేయాలి" అని కోరాయి. నిర్మలా సీతారామన్‌ను కలిసిన బృందంలో లఘు ఉద్యోగ్ భారతి జాతీయ ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాశ్ గుప్తా, స్వదేశీ జాగరణ్ మంచ్ కో కన్వీనర్, ఆర్థిక వేత్త అశ్వినీ మహాజన్ ఉన్నారు.

త్రిశంకు స్వర్గంలోకి ఆర్థిక వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)



విషయం కాదని.. యువ జనాభా అధికంగా ఉన్న మన దేశం వాస్తవానికి 8% వృద్ధిరేటును స్థిరంగా సాధించాలని ఈ నివేదికలో పేర్కొన్నారు. 'శీఘ్రగతిన జరుగుతున్న సాంకేతిక మార్పులతో ఉద్యోగరంగంలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో 6% వృద్ధిరేటుతో యువతకు తగినన్ని ఉద్యోగాలు లభించవు. ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో తీవ్రమైన అసమానతలు కొనసాగుతాయి. దేశ జనాభాలో 2/3 వంతు మంది ప్రభుత్వం అందించే ఉచిత రేషన్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. మరోవైపు, ప్రధాన మంత్రి సన్నిహితులైన అతికొద్దిమంది కార్పొరేట్ సంపన్నులు మాత్రం తమ సంపద గుట్టలను వేగంగా పెంచుకుంటున్నారు. 2019లో కార్పొరేట్ కంపెనీలకు మోదీ ప్రభుత్వం భారీ ఎత్తున పన్ను మినహాయింపులు ఇచ్చింది. దానికి ప్రతిగా కార్పొరేట్ రంగం పెట్టుబడులను పెంచి ఉద్యోగాలను సృష్టించే ప్రయత్నమే చేయలేదు. సాధారణ ప్రజలు, చిన్న వ్యాపారులను మాత్రం పెట్రోల్, డీజిల్ మీద భారీ పన్నులతో, జీఎస్టీతో ప్రభుత్వం బాదుతోంది. తద్వారా దేశ ఆర్థికవ్యవస్థను మోదీ ప్రభుత్వం త్రిశంకు స్వర్గం వంటి మధ్య ఆదాయ ఉచ్చులోకి నెడుతోంది' అని వివరించింది.

లాక్‌డౌన్‌తో ఛిన్నాభిన్నం

కొవిడ్ సమయంలో మోదీ ఒక ప్రణాళిక అంటూ లేకుండా అకస్మాత్తుగా విధించిన లాక్‌డౌన్‌తో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, ఆ తర్వాత కొంత పుంజుకున్నా అది ఏమాత్రమూ సరిపోదని తెలిపింది. ఈ వాస్తవాలను గుర్తించటానికి ప్రభుత్వం నిరాకరిస్తోందని.. దేశ సౌభాగ్యం, సమ్మిళిత అభివృద్ధి కోసమే తాము ఈ నిర్మాణాత్మక విమర్శ చేస్తున్నామని పేర్కొంది. పారదర్శకతతో, పనితీరుతో ఎంతో గౌరవాన్ని సాధించుకున్న ప్రభుత్వ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం భ్రష్టుపట్టిస్తోందని.. ఆర్బీఐ పనితీరులోనూ జోక్యం చేసుకుంటోందని ఆరోపించింది. పలు కార్పొరేట్ కంపెనీల మీద ఈడీతో దాడులు జరిపించి, ఆ కంపెనీల నుంచి బీజేపీకి విరాళాలు తీసుకుందని విమర్శించింది. ఎలక్టోరల్ బాండ్ల వివరాల ద్వారా ఇది వెల్లడైందని గుర్తు చేసింది. తనకు అనుకూలంగా లేవన్న కారణంతో వివరాలను, గణాంకాలను మోదీ ప్రభుత్వం తొక్కిపెడుతోందని పేర్కొంది. 2021లో జరగాల్సిన జనగణన.. కొవిడ్ కారణంగా వాయిదా పడినప్పటికీ, నేటికీ నిర్వహించలేదని కాంగ్రెస్ నివేదిక గుర్తు చేసింది. కేంద్రం శుక్రవారం ఆర్థికసర్వేను, శనివారం బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది.

సర్కారీ పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు

- విద్యార్థుల సంఖ్యలో 12శాతం తగ్గుదల
- 8వ తరగతి విద్యార్థుల్లో సగం మందికి తీసివేతలు రావు
- కొందరు 2వ తరగతి పుస్తకాలు చదవలేని వైనం
- డిజిటల్ అక్షరాస్యతలో మాత్రం రాష్ట్రం ముందంజ
- ప్రథమ్ ఫౌండేషన్ వార్షిక విద్యా నివేదిక-24 వెల్లడి



హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాలు, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా వేల కోట్లు వెచ్చిస్తున్నా.. విద్యలో నాణ్యత మాత్రం పెరగడం లేదు. రెండేళ్లతో పోలిస్తే ఈ సారి విద్యార్థుల సంఖ్య 12శాతం వరకు తగ్గింది. ఇప్పటికీ వేలాది మంది చిన్నారులు బడికి దూరంగా ఉన్నారు. ప్రథమ్ ఫౌండేషన్ వార్షిక విద్యా నివేదిక (అసర్)-2024లో ఈ మేరకు వెల్లడించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యా పరిస్థితులపై ఈ సంస్థ అధ్యయనం చేసింది. తెలంగాణలో ఈ సంస్థ అధ్యయనంలో తేలిన వివరాలిలా ఉన్నాయి. బడులకు వెళ్లే వయస్సు రాష్ట్రంలో మూడేళ్లకే ప్రారంభమవుతుండగా.. ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఎక్కువ మంది పలక, బలపం పడుతున్నారు. 2022తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తఅడ్మిషన్లతోపాటు విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. 2022లో 1-5వ తరగతి వరకు చదువుతున్న మొత్తం విద్యార్థు(బాలురు)ల్లో 63.8శాతం సర్కారు బడుల్లో ఉండగా.. ఈ ఏడాది అది 53శాతానికి తగ్గింది. బాలికల సంఖ్య 70నుంచి 60 శాతానికి క్షీణించింది. అలాగే 6-8 తరగతుల్లో బాలుర ప్రవేశాలు 75.8 నుంచి 63.6శాతానికి.. బాలికల ప్రవేశాలు 76.6 నుంచి 68శాతానికి తగ్గాయి. రాష్ట్రంలో 6-14 ఏళ్ల మధ్య చిన్నారుల్లో 60శాతం మంది ప్రభుత్వ బడుల్లో చదవుతుండగా.. 39.2 శాతం ప్రైవేటు బడులకు వెళ్తున్నారు. 0.5 శాతం విద్యార్థులు బడులకు దూరంగా ఉంటున్నారు. ఉన్నత పాఠశాల విద్యకు సంబంధించి 67.9 శాతం మంది ప్రభుత్వ బడులకు వెళ్తుండగా.. 28.9 శాతం ప్రైవేటుకు వెళ్తున్నారు. 2.5 శాతం బడులకు దూరంగా ఉంటున్నారు. గతంతో పోలిస్తే విద్యా సామర్థ్యాలు పెద్దగా మెరుగుపడలేదు. 8వ తరగతి విద్యార్థుల్లో 56.4శాతం మంది కనీసం 2వ తరగతి పుస్తకాలు చదవలేకపోతున్నారు. 22.7 శాతం మంది ఒకటో తరగతి పుస్తకాలు చదవడంలో విఫలమవుతున్నారు. 19.6శాతం మంది వంద వరకు అంకెలు కూడా చదవలేని స్థితిలో ఉన్నారు. 38శాతం మందికి తీసివేతలు, భాగాహారాలు చేసే సామర్థ్యం లేదు. పాఠ్య పుస్తకాల చదువుల్లో విద్యార్థులు వెనుకంజలో ఉన్నా.. డిజిటల్ అక్షరాస్యతలో మాత్రం మెరుగ్గా ఉన్నారు. 14-16 ఏళ్ల విద్యార్థుల్లో గూగుల్ శోధనలో 85శాతం మంది, యూట్యూబ్ వీడియోల శోధనలో 98శాతం మంది అత్యంత క్రియాశీలకంగా ఉన్నారు. 15.8శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. 31.1శాతం బడుల్లో ఉన్నా వినియోగంలో లేవు. 53.2 శాతం పాఠశాలల్లోనే మరుగుదొడ్లు ఉన్నాయి. 13.9శాతం బడుల్లో గ్రంథాలయాలు లేవు. 29.3శాతం బడుల్లో ఉన్నా వినియోగించడం లేదు. 91.1శాతం పాఠశాలల్లో కంప్యూటర్లు లేవు. రాష్ట్రంలోని 83.7శాతం బడులకు మైదానాలు ఉన్నాయి.



అంబోతుకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

అనారోగ్యంతో 10 కి.మీ నడిచి ఆసుపత్రికి వచ్చిన అంబోతు!

- పశువైద్యులకు సమాచారం ఇచ్చిన 108 సిబ్బంది.. ప్రథమ చికిత్స చేసిన పశువైద్యులు
- ఖమ్మం జిల్లా పెనుబల్లిలో ఘటన

సత్తుపల్లి/పెనుబల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడిన ఓ అంబోతు దానంతట అదే ఏరియా ఆస్పత్రికి వచ్చింది! ఆస్పత్రి ఆవరణలోనే కదలకుండా ఉంటున్న దానిని 108 సిబ్బంది గమనించి పశువైద్యులకు సమాచారమిచ్చారు. దాంతో పశువైద్యులు వచ్చి దానికి ప్రథమ చికిత్స చేశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కారాయిగూడెం గ్రామస్థులు రెండు అంబోతులను సంరక్షిస్తున్నారు. వాటిలో 14 ఏళ్ల వయసున్న ఓ అంబోతు బుధవారం 10 కి.మీల దూరంలో ఉన్న పెనుబల్లిలోని ఏరియా ఆస్పత్రి వద్దకు వచ్చి ఆవరణలోనే పడుకుంది. ఆస్పత్రికి వచ్చి వెళ్లే వారు దానిని ఆహారం అందించారు. బుధవారం నుంచి అంబోతు అక్కడే పడుకుని ఉండడం గమనించిన 108 సిబ్బంది పశు వైద్యులకు సమాచారం అందించారు. దాంతో గురువారం ఉదయం పశువైద్యులు డాక్టర్ సృజన, పి.సురేష్, ఆఫీస్ సబార్డినేట్ జమీల్‌లు అక్కడికి వచ్చి అంబోతును పరీక్షించి అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తించారు. ప్రథమ చికిత్స చేసి ఇంజక్షన్లు ఇచ్చి సెలైన్ ఎక్కించారు. గురువారం మధ్యాహ్నానికి అంబోతు కోలుకోగా కారాయిగూడెం గ్రామస్థులు ఆసుపత్రి వద్దకు వచ్చి దానిని వాహనంలో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, చెత్తాచెదారం తినడం వల్ల అంబోతుకు గ్యాస్టిక్ సమస్య వచ్చి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అంబోతు ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

కౌన్సిల్ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులు బయటకు

జీహెచ్‌ఎంసీ చరిత్రలో మొదటిసారి.. మేయర్ పోడియం ఆ పార్టీ సభ్యుల వద్ద నిరసన

- బయటకు తీసుకెళ్లాలని మార్షల్స్‌కు మేయర్ ఆదేశం
- ఆపై అరెస్టు.. బడ్జెట్ ఆమోదం



బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను తీసుకెళ్తున్న మార్షల్స్

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నిరసనలు, వాయిదాలతో గందరగోళం మధ్య జీహెచ్‌ఎంసీ బడ్జెట్ కౌన్సిల్ సమావేశం ముగిసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా బీఆర్‌ఎస్‌కు చెందిన సభ్యులందరినీ కౌన్సిల్ నుంచి బయట కు పంపించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశాలతో మార్షల్స్ కార్పొరేటర్లను బయటకు తీసుకెళ్లగా పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జీహెచ్‌ఎంసీ చరిత్రలో ఓ పార్టీ సభ్యులందరినీ కౌన్సిల్ నుంచి బయటకు పంపడం ఇదే తొలిసారి అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. గురువారం ఉదయం 10.36 గంటలకు మొదలైన ప్రత్యేక సమావేశంలో మొదట మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, రతన్ టాటాకు మౌనం పాటించి సభ్యులు నివాళులర్పించారు. అనంతరం 2025-26ఆర్థిక సంవత్సరానికి రూ.8440 కోట్ల ముసాయిదా పద్దును మేయర్ సమావేశంలో చర్చకు పెడుతున్నట్లు ప్రకటించారు. అయితే తొలుత.. ప్రశ్నోత్తరాలపై చర్చించాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పట్టుబట్టారు. షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై చర్చించిన అనంతరం.. సాధారణ సమావేశం ఉంటుందని విజయలక్ష్మి పేర్కొన్నారు. అంగీకరించని బీఆర్‌ఎస్ సభ్యులు మేయర్ పోడియం వద్దకు వెళ్లారు. ఆరు గ్యారంటీలు, రైతు భరోసావంటి పథకాలు అమలు కావడం లేదని, నగరంలో సమస్యల పరిష్కారం జరగడం లేదని రాసి ఉన్న పేపర్లను బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ప్రదర్శించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట వాగ్వాదం జరిగింది. మార్షల్స్‌ను పిలిచిన మేయర్ గొడవ చేస్తున్న వారిని బయటకు తీసుకెళ్లాలని ఆదేశిస్తూ సమావేశం వాయిదా వేశారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి, విజయశాంతిరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డిలను మార్షల్స్ బయటకు తీసుకెళ్లగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. తిరిగి సమావేశం ప్రారంభమయ్యాక ముసాయిదా బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. దీనిపై బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. గందరగోళం నెలకొనడంతో విరామం ప్రకటించారు. అనంతరం ప్రశ్నోత్తరాలపై చర్చించేందుకు సాధారణ సమావేశం మొదలైంది. అరెస్టుచేసిన కార్పొరేటర్లను కౌన్సిల్‌కు అనుమతించాలంటూ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తిరిగి మేయర్ పోడియం వద్దకు వెళ్లారు. స్పందించిన మేయర్ ఆ నలుగురిని తీసుకురావాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అయినా ఆ నలుగురు సభ్యులు కౌన్సిల్‌లోకి వచ్చేందుకు నిరాకరించారు. అయితే, బీఆర్‌ఎస్ సభ్యులు మాత్రం వారిని కౌన్సిల్‌కు అనుమతించాలని పట్టుబట్టారు. వారు రావడం లేదని మేయర్ పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో మేయ ర్ ఆదేశాలతో మార్షల్స్ ఆ కార్పొరేటర్లను బయటకు తీసుకెళ్లారు. ఎక్స్‌అఫిషియో సభ్యులు (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) స్వయంగా వెళ్లిపోయారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లను రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం :కేటీఆర్

కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లను, పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలని గురువారం ఎక్స్‌లో డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ సమాధానం చెప్పాలి: పొన్నం

జీహెచ్‌ఎంసీ బడ్జెట్ సమావేశాలు జరుగుతుంటే బీఆర్‌ఎస్ అడ్డుకోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బడ్జెట్ సమావేశాలు అడ్డుకోవడంపై బీఆర్‌ఎస్ నాయకత్వం జవాబు చెప్పాలన్నారు. అవిశ్వాసం పెట్టుకునే హక్కు అందరికీ ఉందని, అవిశ్వాసం ఎదుర్కోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ ఏర్పడ్డాక గత పదేళ్లలో జరగని అభివృద్ధి ఇప్పుడు జరుగుతోందని, ఈర్ష్యతోనే అభివృద్ధిని నిరోధించే ప్రయత్నం బీఆర్‌ఎస్ చేస్తోందని మండిపడ్డారు.

కీలక మునిసిపాలిటీలు 'సీడీఎంఏ' చేతిలోకి!

- జిల్లా కలెక్టర్లను కాదని ప్రత్యేకాధికారులుగా నియామకం
- కొందరికి రెండు, మూడింటి బాధ్యతల అప్పగింత

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాలకవర్గాల గడువు ముగిసిన మునిసిపాలిటీలకు ప్రత్యేకాధికారులుగా పురపాలక సంచాలకుల కార్యాలయం (సీడీఎంఏ) అధికారులను నియమించడం, ఒక్కొక్కరికి రెండు, మూడు మునిసిపాలిటీల బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశమైంది. సాధారణంగా కలెక్టర్లను ప్రత్యేకాధికారులుగా నియమిస్తుంటారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు, కీలక పనుల్లో జాప్యం లేకుండా నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే హైదరాబాద్ నగరానికి ఆనుకుని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని సుమారు 14 మునిసిపాలిటీలకు సీడీఎంఏ కార్యాలయ అధికారులనే ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఒక్కో అధికారిని రెండు, మూడు మునిసిపాలిటీలకు ఇన్‌చార్జిగా నియమించడంపై అంత ప్రత్యేకత ఎందుకనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకాధికారులు సీడీఎంఏ కార్యాలయం నుంచే పాలన చేయాలనుకుంటే ఇబ్బందులు తప్పవని పురపాలక శాఖ సీనియర్ అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకాధికారి స్థానికంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలి. అప్పుడే ప్రతి వారం జరిగే ప్రజావాణిలో ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటిని వెంటనే కలెక్టర్ నేతృత్వంలో పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే వారు పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోగలరా సందేహాలను కొంత మంది వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఏదైనా పనిమీద ప్రత్యేకాధికారిని కలవాలంటే సీడీఎంఏ కార్యాలయానికి రావడం కష్టమవుతుందని వారు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్, బండ్లగూడ జాగీర్, జల్‌పల్లి, నార్సింగ్, శంషాబాద్, శంకరపల్లి, తుక్కుగూడ, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్, జవహర్‌నగర్, తూముకుంట మునిసిపాలిటీలు సీడీఎంఏ అధికారుల చేతిలో ఉన్నాయి. కాగా, సీడీఎంఏలోనే పని ఒత్తిడి అధికం ఉంటుందని, అమృత్, ఎల్‌ఆర్‌ఎస్ వంటి పథకాలపై సమీక్షలు నిర్వహిస్తుండాలని, అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నాని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.



'ఏక్ స్టెప్ ఫౌండేషన్'ను సందర్శించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు

పాఠశాల విద్యలో 'కృత్రిమ మేధ'

- నాణ్యమైన విద్యకు ఆధునిక పరిజ్ఞానం
- ప్రాథమిక విద్యలో అభ్యసన నైపుణ్యాల పెంపునకు 'ఏక్ స్టెప్ ఫౌండేషన్' సహకారంతో కార్యక్రమాలు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి పాఠశాల విద్యలో నాణ్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కరసత్తులు చేస్తోంది. ఇప్పటికే ఈ దిశగా కేరళలో అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలను పరిశీలించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు.. గురువారం బెంగళూరులోని 'ఏక్ స్టెప్ ఫౌండేషన్'ను సందర్శించారు. దీనికి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని చైర్మన్‌గా ఉన్నారు. పాఠశాల విద్యలో కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి విద్యలో నాణ్యతను పెంచేందుకు ఈ ఫౌండేషన్ ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, ఒడిసా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తోంది. కేరళ ప్రభుత్వం కూడా ఈ సంస్థతో కలిసి ఇప్పటికే విద్యలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చింది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఏఐ ఆధారిత టూల్స్ అమలు చేస్తోంది. ఇదే విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే కేరళ వెళ్లి వచ్చారు. ఈ టెక్నాలజీని రాష్ట్ర ప్రభుత్వాలకు ఏక్ స్టెప్ ఫౌండేషన్ అందిస్తోంది. తెలంగాణలోనూ అమలు చేయాలన్న లక్ష్యంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం బెంగళూరులోని ఫౌండేషన్ కార్యాలయాన్ని సందర్శించింది. బృందంలో ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ ఉన్నారు. తెలంగాణ విద్యా శాఖలో అమలు చేయనున్న అంశాలపై ప్రతినిధులు ఫౌండేషన్‌తో చర్చించారు. డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. ఏక్ స్టెప్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏఐ ఆధారిత విద్యను ప్రవేశపెట్టడానికి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ మృతదేహం లభ్యం

- పనిఒత్తిడి తట్టుకోలేక సాగర్ కాల్వలో దూకి బలవన్మరణం
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానంటూ అదృశ్యమైన మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఘటన విషాదాంతమైంది. సాగర్ కాల్వలో దూకి ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం వేములపల్లి సాగర్ కాల్వ కట్టపై నిలిపి ఉంచిన అతడి స్కూటీని గుర్తించిన పోలీసులు.. గురువారం దొండవారిగూడెం వద్ద సాగర్ ఎడవ కాల్వలో అతడి మృతదేహాన్ని కనుగొన్నారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం బెజ్జికల్‌కు చెందిన నూనె రాములు, నిర్మల దంపతుల రెండో కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా గత డిసెంబరు నుంచి పనిచేస్తున్నారు. ఆయనకు పై అధికారులు సంక్షేమ పథకాల అర్హుల జాబితా తయారీ కోసం క్షేత్రస్థాయి సర్వే, దరఖాస్తుల ఆన్‌లైన్ బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలోనే గంటల తరబడి పనిచేయాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఈనెల 28న రాత్రి తన తల్లి నిర్మలకు ఫోన్‌చేసి 'అమ్మా.. ఈఉద్యోగం నా వల్ల కాదు.. సెలవు పెట్టి గ్రూప్స్ ప్రిపరేషన్‌కు వెళ్తాన'ని చెప్పారు. ఓపికతో వచ్చిన ఉద్యోగం చేయమంటూ తల్లి సర్ది చెప్పింది. దీంతో ప్రవీణ్ బుధవారం వేములపల్లిలోని సాగర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

సహోద్యోగిని ఫిర్యాదు.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

- హెచ్‌ఆర్‌కు తనపై ఫిర్యాదు చేసిందని ఆందోళన
- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న యువకుడు
- చెల్లెలికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చి బలవన్మరణం



వినీత్ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా తనతో స్నేహంగా ఉంటున్న సహోద్యోగిని తాము పని చేసే కంపెనీలో తనపై ఫిర్యాదు చేసిందనే ఆందోళనతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో జగిత్యాలకు చెందిన పిప్పరి వినీత్(26) మరణించాడు. జగిత్యాలకు చెందిన పిప్పరి వినీత్(26), అతని చెల్లెలు సంయుక్త హైదరాబాద్ ఈస్ట్‌మారేడుపల్లిలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అన్నాచెల్లెళ్లు ఇద్దరూ బేగంపేటలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. అదే సంస్థలో పని చేసే మరో యువతితో వినీత్‌కు ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. అయితే, ఇటీవల ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సదరు యువతి తాము పని చేసే సంస్థ హెచ్‌ఆర్‌కు వినీత్‌పై ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసి ఆందోళన చెందిన వినీత్ బుధవారం విధులు పూర్తి చేసిన తర్వాత తన ద్విచక్రవాహనంపై దండుమల్కాపురం శివారులోని ఓ పైపుల పరిశ్రమ దగ్గరికి వెళ్లాడు. రాత్రి 11గంటల సమయంలో చెల్లెలు సంయుక్తకు ఫోన్ చేసి .. ఆ యువతి అకారణంగా తనపై ఫిర్యాదు చేసిందని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పారు. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి తన లోకేషన్ పంపి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. అనంతరం ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పుపెట్టుకున్నాడు. సంయుక్త తన బంధువులతో కలిసి ఆ ప్రాంతానికి చేరుకునే సరికి వినీత్ శరీరం పూర్తిగా కాలిపోయింది. వినీత్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వచ్చే నెల సూర్యాపేటకు రాహుల్

- దేశంలో కుల గణన చరిత్రాత్మకం
- రెండు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు
- హైదరాబాద్‌లో పార్టీ బలోపేతంపై దృష్టి: మహేశ్‌గౌడ్



హైదరాబాద్,జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పిలుపు మేరకు జైబాపు.. జైభీం.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి రెండో వారంలో సూర్యాపేట జిల్లాలో సంవిధాన్ బచావో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నామని, ఇందులో రాహుల్‌గాంధీ పాల్గొంటారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం విలేకరుల ఇష్టాగోష్ఠిలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించిన కుల గణన సర్వే.. స్వతంత్ర భారతదేశంలోనే చరిత్రాత్మకమని అభివర్ణించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు కులగణనను అడ్డుకోవాలని చూసినా విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. ఫిబ్రవరి 5న కులగణన నివేదిక మంత్రి మండలికి అందనుందని చెప్పారు. రిజర్వేషన్ పెంపుపై క్యాబినెట్‌లో చర్చించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాజధాని హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి సారించినట్టు చెప్పారు. జీహెచ్‌ఎంసీలో అత్యధిక సీట్లు గెలిచి.. మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ సమావేశం సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు భిక్షాటన చేస్తూ నిరసన తెలపడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి తెచ్చిన నిధులు ఎన్ని?.. ప్రాజెక్టులు ఎన్ని? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మాదిరిగా హామీలు అమలు చేయకుండా వదిలి వేయమని, ఆలస్యమైనా ఒక్కొక్కటీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ముగ్గురి పేర్లతో అధిష్ఠానానికి నివేదిక పంపామని, రెండు, మూడు రోజుల్లోనే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. సమయాన్ని దృష్టిలో పెట్టుకొని కమాండ్ కంట్రోల్ సెంటర్, సొంత నివాసంలో సీఎం సమీక్షలు చేస్తున్నారని, ఇందులో తప్పేం ఉందని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల అధికారిక నివాసంలో సీఎం, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఖర్గే ఫోటోలు పెట్టుకోవాలని సూచిస్తున్నట్టు తెలిపారు. వైఎస్‌ఆర్‌కు ఉన్నంత మంది అభిమానులు మరెవ్వరికీ ఉండరన్నారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన రుణమాఫీ సొమ్ము ఎంత? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన రుణమాఫీ సొమ్ము ఎంత? తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రాజకీయ అస్థిత్వం కోసమే కేటీఆర్, హరీశ్‌రావు, కవిత విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డు సీఈవోగా అసాదుల్లాను తక్షణం తొలగించండి

- రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్ బోర్డులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఫుల్ టైం సీఈవోగా ఉన్న అసాదుల్లాను తక్షణం తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. నాలుగు నెలల్లో పూర్తికాలపు సీఈవోను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డులకు ఆదేశాలు జారీచేసింది. డిప్యూటీ సెక్రటరీ కంటే తక్కువ ర్యాంకు కలిగిన అసాదుల్లాను సీఈవోగా నియమించడం వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 23కు విరుద్ధమని పేర్కొంది. 35 ఏళ్ల ప్రభుత్వ సర్వీసు చేసినప్పటికీ అసాదుల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు కలిగిన అధికారి అని గుర్తు చేసింది. ముస్లిం అధికారులు లేరన్న కారణంతో తక్కువ ర్యాంకు కలిగిన అధికారిని నియమించడం చెల్లదని పేర్కొంది. కొత్త ఫుల్‌టైం సీఈవోను నియమించే వరకు ఆథరైజ్డ్ ఆఫీసర్‌గా ఉన్న షేక్ లియాకత్ హుస్సేన్ ఇన్‌చార్జిగా కొనసాగవచ్చని పేర్కొంది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు, రాధాకిషన్‌లకు బెయిల్

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హైకోర్టు జడ్జీలు సహా ప్రతిపక్ష నేతలు, ఇతర ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసిన వ్యవహారంలో నిందితులుగా ఉన్న పోలీసు అధికారులు భుజంగరావు (అడిషనల్ ఎస్పీ), రాధాకిషన్‌రావు (టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ)లకు గురువారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మరో పోలీసు అధికారి తిరుపతన్న (అడిషనల్ ఎస్పీ)కు ఇటీవలే సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఈ ఇద్దరు అధికారులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష చొప్పున రెండు ధరావతులు చెల్లించాలని, విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్‌లు ట్రయల్ కోర్టులో సమర్పించాలని స్పష్టంచేసింది. పోలీసులు ఎప్పుడు పిలిచినా దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఇప్పటికే రాధాకిషన్‌రావు అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. భుజంగరావు జైలు నుంచి విడుదల కానున్నారు.

గ్యారంటీలే సర్కార్‌కు ఉరితాళ్లు: ఎంపీ లక్ష్మణ్

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలే ఈ ప్రభుత్వానికి ఉరితాళ్లు కాబోతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ తేల్చిచెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోతు తెలియక హామీలు ఇచ్చామంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు.. కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి.. హామీలు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దారులు వెదుకుతోందని దుయ్యబట్టారు. ఎన్నికల వేళ 6 గ్యారంటీలు-420 వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయ న మీడియాతో మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందంటూ నాడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ప్రకటించలేదా? అని ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

ఓసీ కులగణన కూడా నిర్వహించాలి

- ఈబీసీ సంక్షేమ సంఘం డిమాండ్

రాష్ట్ర ప్రజల్లో అపోహలు తొలగిపోవడానికి బీసీ కులగణనతో పాటు ఓసీ కులగణన కూడా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి కోరారు. అన్ని వర్గాల జనగణన జరిపి ఆయా తరగతుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను నిగ్గుతేల్చాలని, అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొందరు బీసీ మేధావులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రవీందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు.

జకారియాతో జమాతే ఇస్లామీకి సంబంధం లేదు: జమాతే ఇస్లామీ హింద్

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): "జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడు జకారియాను పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నార"ని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని జమాతే ఇస్లామీ హింద్ స్పష్టం చేసింది. పోలీస్‌లు అదపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతున్న జకారియాకు జమాతే ఇస్లాంతో ఏ మాత్రం సంబంధం లేదని జమాతే ఇస్లామీ హింద్ మీడియా కార్యదర్శి ముహమ్మద్ అక్బర్ బాషా వెల్లడించారు. జమాతే ఇస్లామీ హింద్ అనేది దేశవ్యాప్త ఆధ్యాత్మిక, సామాజిక సంస్థ అని, దీనికి జాతీయ అధ్యక్షుడిగా ఇంజనీర్ సయ్యిద్ సాదతుల్లా హుసైనీ ఉన్నారని తెలిపారు. జమాతే ప్రతిష్ఠకు, దాని జాతీయ అధ్యక్షుడి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు అరెస్ట్ అని ప్రచారం చేయడం సరైంది కాదని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతు కుటుంబాల పరామర్శకు అనుమతివ్వరా?

- ఏడాదైనా హామీల అమలేది: మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులు అనుమతివ్వడం లేదని బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ చైర్మన్, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఆ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులు మద్దతు ధర దక్కక, రైతు భరోసా రాక, రుణమాఫీ అవ్వక నిరాశతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించి, కొంత ఆర్థికసాయం అందజేశామని చెప్పారు. తాము రైతులను పరామర్శిస్తుంటే కాంగ్రెస్ పార్టీ అక్కసు వెళ్లగక్కుతోందన్నారు. ప్రజా పాలనలో పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, ప్రజలు మాత్రం ప్రతిరోజు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 420 రోజులు అవుతోందని, ఇప్పటికీ వారిచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలుకాలేదని అన్నారు. రాజకీయాలు మాట్లాడొద్దని చెప్పి స్పీకరే రాజకీయాలు మాట్లాడుతున్నారని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలపై స్పందిస్తాం.. కానీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలను పట్టించుకోమని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

రోహింగ్యాలకు పాక్ ఆయుధాలు!

- బంగ్లాదేశ్‌లోకి ఐఎస్ఐ నెట్‌వర్క్.. భారత్ అప్రమత్తం

ఢాకా, జనవరి 30: బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్ ప్రభావం పెరుగుతున్న కొద్దీ సాయుధ రోహింగ్యా గ్రూపుల కార్యకలాపాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ పరిణామం భారత్, మయన్మార్, బంగ్లాదేశ్‌లపై దీర్ఘకాల ప్రభావం చూపనుంది. దీంతో భారతదేశం అప్రమత్తమైంది. మయన్మార్‌కు చెందిన నాలుగు తిరుగుబాటు గ్రూపుల ప్రతినిధులు గత నెల 25న బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ సమీపంలోని శరణార్థుల శిబిరం వద్ద సమావేశమైనట్టు ఫస్ట్ పోస్టు వెబ్‌సైట్‌లో కథనం వెలువడింది. సమావేశంలో అరకాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ(ఏఆర్ ఎస్ఏ), రోహింగ్యా సాలిడారిటీ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ), అరకాన్ నేషనల్ డిఫెన్స్ ఫోర్స్ (ఏఎన్‌డీఎఫ్), అరకాన్ రోహింగ్యా ఆర్మీ (ఏఆర్ఏ) గ్రూపుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఫోర్ బ్రదర్స్ అలయెన్స్ లేదా రోహింగ్యా ఆర్మీ అనే కూటమిగా ఏర్పడి పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్, కుతుపలాంగ్ ప్రాంతాల్లో వేలాదిమంది రోహింగ్యా శరణార్థులు ర్యాలీ నిర్వహించారు. మయన్మార్‌లోని తమ స్వస్థలాన్ని తిరిగి దక్కించుకునేందుకు ఈ గ్రూపులు చేస్తున్న ప్రయత్నాలకు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ తోడ్పాటు అందిస్తున్నట్టు కాక్స్ బజార్ వర్గాలు తెలిపాయి. ఈ తోడ్పాటులో ఆయుధాలు సమకూర్చడం, శిక్షణ, నిఘా సమాచారాన్ని అందించడం తదితరాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శతప్రయోగాల 'కోట'

ఎడ్లబండి మీద ఉపగ్రహాన్నీ, సైకిల్‌మీద రాకెట్ విడిభాగాలను తీసుకుపోయిన కాలంనుంచి అంతరిక్షకేంద్రం నిర్మాణానికి అరంగేట్రం చేయడం వరకూ భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం 'ఇస్రో' ప్రస్థానాన్ని ఒకమారు తలచుకొని పులకించిపోయేందుకు బుధవారం నాటి వందో రాకెట్ ప్రయోగం ఉపకరిస్తుంది. దేశంతో పాటుగానే ఇదీ ఎదిగింది, అంతేకదా అని ఎంత సర్దిచెప్పుకుందామనుకున్నా, బడ్జెట్ కేటాయింపుల్లో పాలకులు ప్రదర్శించే కాఠిన్యాన్నీ, కాపీనాన్నీ కూడా తట్టుకొని నిలిచి, దక్కినదానితోనే అనేకానేక సాహసోపేతమైన ప్రయోగాలతో ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసిన హీరో మన ఇస్రో.

శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్‌సెంటర్‌లోని రెండోలాంచ్‌ప్యాడ్ నుండి మొన్న చేసిన సెంచరీతో ఇస్రో కీర్తిపతాకం గగనవీధుల్లో రెపరెపలాడింది. ఈ శతప్రయోగాల వేదిక శ్రీహరికోటను భారత అంతరిక్ష పరిశోధనావ్యవస్థ పితామహుడు విక్రమ్‌సారాభాయ్ రాకెట్ ప్రయోగ కేంద్రంగా ఎంచుకోవడం మీద చాలా కథనాలు ఉన్నాయి. ప్రయోగ కేంద్రం భూమధ్యరేఖకు ఎంత దగ్గరగా ఉంటే అంత తక్కువ ఇంధనంతో రాకెట్ భూమ్యాకర్షణశక్తిని అధిగమించగలుగుతుంది. ఆ లెక్కన శ్రీహరికోట ప్రపంచంలో రెండోస్థానంలో ఉందట. రాకెట్ ప్రయోగకేంద్రం దేశం తూర్పుతీరంలో ఉండటం వల్ల అనేక అదనపు సాంకేతిక, భద్రతా ప్రయోజనాలు ఉన్నాయి. శ్రీహరికోట దీవిని ఎంపిక చేయడానికి ముందు, కన్యాకుమారి తీరంలో కేంద్రాన్ని నెలకొల్పే ప్రతిపాదన మీద చర్చించడానికి విక్రమ్‌సారాభాయ్ కొంతమంది శాస్త్రవేత్తలతో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి అన్నాదురైతో సమావేశమయ్యేందుకు వెళ్ళారట. ఆ రోజు అన్నాదురైకి ఒంట్లోబాగోలేక తన బదులు ఓ మంత్రిని వెళ్ళమన్నారట. ఆ మంత్రి ఎంతకూ రాకుండా చాలాసమయం విక్రమ్‌సారాభాయ్‌ని నిరీక్షించేట్టు చేశారు, చివరకు ఒంటిమీద ఏ మాత్రం స్పృహలేని స్థితిలో ఉన్న ఆయనను కొందరు అక్కడకు మోసుకొచ్చి కూచోబెట్టారు. మంత్రిగారి అర్థంపర్థంలేని మాటలను భరించలేకపోయిన సారాభాయ్ పూర్తిగా విసుగుచెంది తమిళనాడు వద్దేవద్దని అనుకున్నారట. సరిగ్గా అదే సమయంలో 26వేల ఎకరాల శ్రీహరికోటదీవిని ఇచ్చేస్తామంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవచూపడంతో సారాభాయ్ సంతోషంగా దానిని స్వీకరించారని సుప్రసిద్ధ శాస్త్రవేత్త నంబినారాయణ్ తన ఆత్మకథలో రాశారు. సారాభాయ్ ఆదేశం మేరకు ఇస్రో శాస్త్రవేత్త ఆర్ఎం వసగమ్ తమిళనాడులోనే రెండుప్రాంతాలను రాకెట్ ప్రయోగకేంద్రం కోసం గుర్తిస్తే, అప్పటి డీఎంకె మంత్రి అనుచిత ప్రవర్తనతో అది ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయి పులికాట్ సరస్సు సరసన వెలసింది. గత ఏడాది డీఎంకె మంత్రి ఒకరు కులశేఖరపట్నం లాంచ్‌ప్యాడ్ శంకుస్థాపన సందర్భంలో విడుదల చేసిన పత్రికాప్రకటనలో ఇస్రో రాకెట్ బదులు చైనా రాకెట్ బొమ్మ వాడటంపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు విమర్శలు చేసిన సందర్భంలో, ఆరుదశాబ్దాలనాటి ఈ గతం తిరిగి తెరమీదకు వచ్చింది.

మరో రెండేళ్ళలో కులశేఖరపట్నం అంతరిక్ష ప్రయోగకేంద్రం కూడా అందుబాటులోకి రాబోతున్నందున ఇస్రో ప్రయోగ సామర్థ్యం ద్విగుణం బహుళం అవుతుంది. తొలి వంద రాకెట్ ప్రయోగాలకు నలభైఐదేళ్ళుపడితే మరో ఐదేళ్ళలోనే మరో వంద ప్రయోగిస్తామని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ సగర్వంగా చెబుతున్నారు. చంద్రయాన్ 4, చంద్రయాన్ 5, మార్స్ లాండర్, వీనస్ ఆర్బిటర్, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీని మించిన కొత్తతరం వాహకనౌక గురించి ఆయన ఆలోచనలు చేస్తున్నారు. ఇదంతా ఆత్మవిశ్వాసమే తప్ప అతిశయం కాదు. నేడు అగ్రరాజ్యాల సరసన ఇలా తలెత్తుకొని నిలబడటంలో సోవియట్ యూనియన్ సహకారం విస్మరించలేనిది. ఆ తరువాత సదరు సహకారానికీ, పరిజ్ఞానం బదలాయింపుకీ అడ్డుపడుతూ అమెరికా మనను పెట్టిన కష్టాలు స్వదేశీపరిశోధనలకు ఊతమిచ్చాయి. అదిలింపులు, బెదిరింపులు, అవమానాలు అధిగమించి సొంతకాళ్ళమీద ఎదిగిన ఇస్రో గగనయానాలు, చంద్రయానాలు, సూర్యనమస్కారాలు, అంగారక అధ్యయనాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ఆంగ్ల చిత్రాలకంటే తక్కువ ఖర్చుతో అంతరిక్షయాత్రలు చేసివస్తోంది. ఒకేమారు వంద ఉపగ్రహాలను విభిన్నమైన కక్ష్యల్లోకి వెదజల్లగలిగే సమర్థతను పెంచుకొని, ఐదువందల యాభై ఉపగ్రహాలను నింగికి చేర్చింది. విదేశీ ఉపగ్రహప్రయోగ వ్యాపారం చేస్తూ దేశానికి సంపాదించిపెడుతోంది. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానించి, మళ్ళీ విడదీసిన ఇటీవలి 'స్పేడెక్స్' విన్యాసం ఇస్రో సాధించిన మరో సాంకేతిక అద్భుతం. ఇలా నిరంతరం సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకుంటూ విక్రమ్‌సారాభాయ్, సతీష్‌ధావన్ ఇత్యాది మహామహుల కలలను నిజం చేస్తూ, దేశాన్ని స్పేస్ సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దుతున్న ఇస్రోను అభినందించాలి.

ట్రంప్, మోదీ 'మంచి' స్నేహితులు కాగలరా?



ఎటువంటి రాజకీయ అనుబంధంలోనైనా మిత్రుడు లేదా భాగస్వామి కంటే తాను తక్కువ స్థానంలో ఉండడాన్ని మోదీ ససేమిరా అంగీకరించరు. జన నీరాజనాలను మరెవ్వరితోను కలిసి పంచుకోవడానికి ట్రంప్ ఎట్టి పరిస్థితులలోను సుముఖత చూపరు. 2019–20లో ఇరువురి మధ్య వర్ధిల్లిన స్నేహసరసతలు ఇప్పుడు వారి సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయన్నది నిశ్చితంగా చెప్పలేము.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అని సెప్టెంబర్ 2019లో టెక్సాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘోషించారు. నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2020లో జరగనున్న అధ్యక్ష పదవీ ఎన్నికలలో కచ్చితంగా విజయం సాధిస్తారనే తన విశ్వాసాన్ని మోదీ అలా సుదృఢంగా వ్యక్తం చేశారు. కొద్ది నెలల అనంతరం ఫిబ్రవరి 2020లో అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' అనే ఒక బృహత్తర బహిరంగ కార్యక్రమంలో కూడా మోదీ అదే విశ్వాసాన్ని మళ్లీ వ్యక్తం చేశారు. 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అనేది ఒక తప్పుడు అభిప్రాయం. ఔచిత్య రహితంగా అత్యుత్సాహంతో బహిరంగపరిచిన ఒక పొరపాటు నిర్ణయం. కనుకనే 2020 నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితం మోదీని దిగ్భ్రాంతి పరిచింది. డొనాల్డ్ ట్రంప్ ఆ ఎన్నికలలో అనూహ్యంగా ఓడిపోయారు. గత నాలుగేళ్లుగా వాషింగ్టన్‌లో 'అబ్ కీ బార్ బైడెన్ సర్కార్' అనే భావన బలంగా ఉన్నది. నవంబర్ 2024 అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ అనూహ్యంగా భారీ మెజారిటీతో గెలిచారు. మరి 2019–20లో ట్రంప్, మోదీ మధ్య వర్థిల్లిన స్నేహ సంబంధాలు పునరుజ్జీవమవుతాయా అన్నది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల టెలిఫోన్‌లో జరిపిన ఉభయ కుశలోపరిలో ట్రంప్‌ను తన 'ప్రియమైన స్నేహితుడు'గా మోదీ అభివర్ణించారు. శక్తిమంతులైన ఈ నాయకులు ఇరువురూ జనాలను ఆకట్టుకోవడంలో సాటిలేని ఘనాపాటీలు అనడంలో సందేహం లేదు. వారి వ్యవహారశైలులు అప్పుడప్పుడు ఆశ్చర్యకరంగా ఒకే తీరులో ఉండడం పరిపాటి. జనాకర్షక నినాదాల ప్రాధాన్యం, ఉపయుక్తతను ఇరువురూ బాగా అర్థం చేసుకున్నవారే. అటువంటి నినాదాలతో బాగా లబ్ధి పొందినవారు కూడా. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనేది ట్రంప్ నినాదం కాగా 2047 నాటికి వికసిత్ భారత్‌కు దారితీసే 'అమృత్ కాల్'ను సృష్టిస్తానని నరేంద్ర మోదీ వాగ్దానం చేశారు. కాలం చెల్లిన ఉదారవాద రాజకీయాలపై మితవాద జాతీయవాదం విజయానికి ప్రతినిధులుగా మోదీ, ట్రంప్‌లను వారి అభిమాన గణాలు భావిస్తున్నాయి. గత కాలం ల్యూటెన్స్ కులీన వర్గాల ప్రాబల్యాన్ని మోదీ దెబ్బతీయగా వాషింగ్టన్ సంప్రదాయ పాలక వర్గాల ప్రాబల్యానికి ట్రంప్ విఘాతం కలిగించారు. వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్ గర్జనలు, భారతీయ ముస్లింలను 'అంతర్గత శత్రువులు'గా పరిగణించే మోదీ మద్దతుదారులలో పూర్తిగా ప్రతిధ్వనించాయి. వలసకారులను నిరోధించేందుకు సరిహద్దుల్లో గోడలు నిర్మించాలని ట్రంప్ మద్దతుదారులు కోరుతుండగా మసీదుల స్థానంలో ఆలయాలను నిర్మించేందుకు మోదీ అనుయాయులు ప్రయత్నిస్తున్నారు. ఒక 'శాశ్వత' శత్రువు కోసం అన్వేషణ అటు ట్రంప్, ఇటు మోదీ మద్దతుదారులను సమ్మగ్నం చేస్తోంది, కార్యనిమగ్నులనూ చేస్తోంది.

ట్రంప్–మోదీల మధ్య సమాంతరాలను అత్యుక్తులుగా చెప్పుకోనవసరం లేదు. నిజం చెప్పాలంటే వారి మధ్య సదృశాల కంటే వ్యత్యాసాలే ఎక్కువ. ఇరువురి రాజకీయ ప్రస్థానాలు చాలా భిన్నమైనవి. మోదీ ఒక అర్ధ శతాబ్ది కాలంగా రాజకీయాలలో ఉన్నారు. ఆరెస్సెస్ ప్రచారక్‌గా ప్రారంభమై క్రమంగా రాజకీయ సోపానాలను అధిరోహించి ప్రధానమంత్రి పదవికి చేరుకున్నారు. మోదీకి భిన్నంగా ట్రంప్ ఒక విజయవంతమైన వ్యాపారి. బీజేపీ శ్రేణుల నుంచి మోదీ ప్రభవించగా ట్రంప్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష పదవీ అభ్యర్థిత్వాన్ని సర్వోత్కృష్టుడైన 'బయటి వ్యక్తి'గా కైవసం చేసుకున్నారు. మోదీ తనను తాను ఒక హిందూత్వ యోధుడుగా తీర్చిదిద్దుకున్నారు. లావాదేవీలు, ఒప్పందాల విషయంలో అనితర సాధ్యుడైన నేర్పరిగా ట్రంప్ ప్రసిద్ధి పొందారు. మోదీలో భావజాల అభినివేశం పరిపూర్ణంగా ఉండగా ట్రంప్‌లో వ్యాపార కాంక్షలు ఆయన స్వాభావిక ప్రవృత్తిగా ఉండడం కద్దు. ఈ నాయకులిరువురూ వ్యక్తి పూజను ప్రోత్సహించినవారే. ఇరువురిలోను స్వానురాగ ప్రవృత్తి అమితంగా ఉంది.

మోదీ తన పదేళ్ల ప్రధాన మంత్రిత్వ కాలంలో తరచు అధికార రాజకీయాల సంప్రదాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించి భారత రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు. అప్పుడప్పుడూ తన ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టివేసేందుకు దిగ్భ్రాంతికరమైన నిర్ణయాలు తీసుకున్నారు. తద్వారా ప్రత్యర్థులను భయోత్పాతానికి గురిచేశారు. 2016లో పెద్దనోట్ల రద్దు అటువంటి చర్యే. నల్లధనాన్ని సంపూర్ణంగా నిర్మూలించే పేరిట ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు. విధాన నిర్ణయాల రూపకల్పన ప్రక్రియను చాలవరకు కేంద్రీకృతం చేసినప్పటికీ రాజకీయ ఔచిత్య లక్షణ రేఖను మోదీ ఎన్నడూ ఉల్లంఘించలేదు. ఒక పొరుగు దేశాన్ని బెదిరించేందుకు అర్ధరాత్రి సమయంలో మోదీ ట్వీట్ చేయడమనేది ఎన్నడూ జరగలేదు. ఆయన ఆ విధంగా వ్యవహరించడమనేది ఎప్పటికీ జరగని పని అని కూడా నిశ్చితంగా చెప్పవచ్చు.

మోదీకి భిన్నంగా ట్రంప్ నిత్యం ఆమోదయోగ్యమైన రాజకీయ ప్రవర్తనా నియమాలకు విరుద్ధంగా వ్యవహరించడం పరిపాటి. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే ఆయన ఎన్నో కటువైన ప్రకటనలు చేశారు; తీవ్ర పర్యవసానాలకు దారితీసే ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేశారు. అవన్నీ తన ప్రత్యర్థులు, వ్యతిరేకులను గందరగోళపరిచేందుకు, వారిని సవాల్ చేసేందుకు ఉద్దేశించినవేనని మరి చెప్పనవసరం లేదు. అమెరికా అధ్యక్షుడిది అద్వితీయమైన వైయక్తిక వ్యవహారశైలి. రాజకీయ విజ్ఞతకు అందులో స్థానం లేదు. ఎవరేమనుకున్నా ట్రంప్ లెక్క చేయరు. తాను చేయాలనుకున్నది చేసి తీరుతారు. తన నిర్ణయాలకు, చర్యలకు విస్తృత స్థాయిలో ఆమోదం పొందేందుకు మోదీ తప్పక ప్రయత్నిస్తారు. స్వచ్ఛ భారత్ ప్రచారానికి లోగోగా వినియోగించుకునేందుకు మహాత్మాగాంధీ కళ్లజోడును ఎంపిక చేసుకోవడమే అందుకొక నిదర్శనం. ట్రంప్‌కు తన స్వదేశ గతంతో తాదాత్మ్యత లేదు. చరిత్ర గురించిన ఆయన దృష్టి స్వయం ప్రతిష్ఠకు మాత్రమే పరిమితమయింది.

ఇప్పుడు మనం అసలు ప్రశ్నకు వద్దాం: ఆ నాటి చెలిమికి ఐదు సంవత్సరాలు అంతరాయమేర్పడిన అనంతరం ఇప్పుడు మళ్లీ పాత స్నేహం కుసుమిస్తున్న సమయంలో డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఎలా కలిసికట్టుగా ముందుకు సాగుతారు? ఎటువంటి రాజకీయ అనుబంధంలోనైనా మిత్రుడు లేదా భాగస్వామి కంటే తాను తక్కువ స్థానంలో ఉండడాన్ని మన మోదీ ససేమిరా అంగీకరించరు కదా. ఇక ట్రంప్ విషయానికి వస్తే జన నీరాజనాలను మరెవ్వరితోను కలిసి పంచుకోవడానికి ఆయన ఎట్టి పరిస్థితులలోను సుముఖత చూపరు గాక చూపరు. తమ ఉభయులలో తానే గొప్ప అనే అభిజాత్యాన్ని ప్రదర్శించేందుకు ట్రంప్, మోదీ ఇరువురూ తప్పక ప్రయత్నిస్తారు. ప్రతి ఒక్కరినీ సతాయించేందుకు లేదా భయపెట్టేందుకు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమైనప్పటికీ ఆయనతో సమావేశమయినప్పుడు తమ వైఖరి, అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్యక్తం చేసేందుకు ప్రధాని మోదీ ఆయన మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులు దృఢనిశ్చయంతో ఉన్నారు. సౌష్ఠవం లోపించిన స్నేహ బంధంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను పరిగణించాలి. నడుస్తున్న చరిత్రను ప్రభావితం చేయగల శక్తి సామర్థ్యాలు ప్రస్తుతం లేకపోయినప్పటికీ అమెరికా ఇప్పటికీ ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతోంది. అగ్రరాజ్య హోదాను ప్రగాఢంగా కోరుకుంటున్న భారత్, అంతర్జాతీయ వ్యవహారాలలో తనకొక ప్రత్యేక గుర్తింపు, మరింత ప్రాధాన్యాన్ని భారత్ ఎంతగా అభిలషిస్తోందో మరి చెప్పనవసరం లేదు. 'అమెరికా ఫస్ట్' అనే లక్ష్యానికి అనుగుణమైన రీతిలో ఒక సువిశాల లాభప్రద మార్కెట్‌గా భారత్‌ను ట్రంప్ భావిస్తున్నారనడంలో సందేహం లేదు. అయితే భారత్‌ను ఒక విశ్వసనీయమైన వ్యూహాత్మక మిత్ర దేశంగా వాషింగ్టన్ చూడగలదనే ఆశాభావం మోదీకి ఇంకా ఉన్నది.

భారత్, చైనాలు అధిక సుంకాలతో బాగా లబ్ధి పొందుతున్న దేశాలుగా ట్రంప్ గట్టిగా భావిస్తున్నారు. తన విలక్షణ శబ్దాడంబరంతో నిరసిస్తున్నారు కూడా. ఇది మనకు ఎంతైనా ఆందోళనకరమైన విషయమే. దౌత్య మర్యాదలు పాటించే ఓర్పు, నేర్పు ట్రంప్‌కు లేవు. సభ్యతా సంస్కారాలకు విరుద్ధంగా వ్యవహరించేందుకు ఆయన వెనుకాడరు. ఆయన ప్రపంచ దృక్పథంలో వాణిజ్య ప్రయోజనాలకు అగ్ర ప్రాధాన్యమున్నది. మరి ఇటువంటి నాయకుడిని మిత్రుల ప్రశస్త మాటలు, పాత స్నేహాలు కదిలిస్తాయా? చెప్పవచ్చిన దేమిటంటే భవిష్యత్తులో భారత్, చైనాలు రెండిటితోనూ తన సొంత షరతులపై వ్యవహరించేందుకు, ఒప్పందాలు చేసుకునేందుకు ట్రంప్ తప్పక ప్రయత్నిస్తారు. ఎందుకు? అమెరికా ప్రయోజనాలు కాపాడేందుకే. ఈ విషయమై ఎవరికీ ఎటువంటి సందేహం ఉండనక్కరలేదు.

అమెరికాతో మన సంబంధాలు ఎలా పరిణమించనున్నాయి? ఈ విషయంలో వచ్చే కొద్ది నెలలపాటు భారత్ చాలా జాగ్రత్తగా ఉండాలి. అంతిమంగా జరిగేది మన ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందో లేదో ఇప్పుడే చెప్పలేము. వేచి చూడాలి. ట్రంప్‌తో సఖ్యతకు మోదీ ప్రయత్నిస్తారా? 2019 అమెరికా అధ్యక్ష ఎన్నికల తరుణంలో తనకు బహిరంగంగా పరిపూర్ణ మద్దతునిచ్చిన విషయాన్ని ట్రంప్‌కు ఆయన గుర్తు చేయవచ్చు. పాత స్నేహసరసతలు ప్రస్తుత సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయన్నది నిశ్చితంగా చెప్పలేము. సమస్యేమిటంటే తనను తాను గొప్పగా ప్రకటించుకునే రియాల్టీ షోలో అమెరికా అధ్యక్షుడు ఒక బిగ్‌బాస్ లాంటి వ్యక్తి. ఈ షోలో కేవలం ఒకే ఒక్కరి – బిగ్‌బాస్– మాటే తొలి, తుది మాట. దానికే సమస్త ప్రాధాన్యం. భారత్‌తో సహా విశాల ప్రపంచమంతా కేవలం ప్రేక్షకులు మాత్రమే. మరి ఈ ట్రంప్ షోలో తదుపరి అంకం ఏమిటో ఎవరికీ తెలియదు. నమ్మకంగా చెప్పగలిగేవారు కూడా ఎవరూ లేరు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ధాత్రికి దాపురించిన పాడుకాలం!



■ సునీతా నారాయణ్

మట్టివాసన

డొనాల్డ్ ట్రంప్ తాను ఆశించింది చేశారు, మనం ఊహించిందే పూర్తి చేశారు. లక్షలాది మైళ్ల దూరం నుంచి, ఆ నడి రాత్రి ట్రంప్ విజయ గర్వంతో ఆర్భాటంగా తన దేశాన్ని పారిస్ ఒడంబడిక నుంచి వైదొలిగింపచేసేందుకు ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై సంతకం చేయడాన్ని, వీక్షించాను. 'ఈ నిర్ణయంతో, లక్షల కోట్ల డాలర్లను ఆదా చేసుకోనున్నా'మని హర్షధ్వానాలు చేస్తున్న తన అభిమానుల నుద్దేశించి అమెరికా కొత్త అధ్యక్షుడు అన్నారు.

హరిత ఉద్యమాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ట్రంప్ గతంలో కంటే ఇప్పుడు మరింత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాతావరణ మార్పుతో సంభవిస్తున్న విధ్వంసం ఎల్లెడలా ప్రతి ఒక్కరి అనుభవంలోకి వస్తోన్న రోజులివి. ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఆనవాయితీ ప్రకారం కాంగ్రెస్ భవనం వెలుపల లక్షలాది ప్రజల సమక్షంలో కాకుండా లోపల జరిగింది. చలిగాడ్పులు ప్రచండంగా ఉండడమే అందుకు కారణం. ఉత్తర ధ్రువ ప్రాంతాలలో సుడిగాలులు మరింత చంచలమై అమెరికా పశ్చిమ తీర ప్రాంతాలను బలంగా తాకాయి. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవం సమయంలోనే లాస్‌ఏంజెలెస్‌లో సంపన్నుల, సెలెబ్రిటీల విశాల హర్మ్యాలు దావానలంలో మాడి మసి అయిపోతున్నాయి. ప్రతి ప్రాంతమూ, సామాన్యులూ సంపన్నులూ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ప్రకృతి విపత్తులకు గురవుతుండగా వాతావరణ మార్పు అనేది ఒక మిథ్య అని వాదించడంలో విజ్ఞత ఏమైనా ఉన్నదా? రాల్, వాతావరణ మార్పు ఒక అభూతకల్పన అని ట్రంప్ మహాశయుడు ఘోషిస్తున్నాడు. ఆయనకు ఓటు వేసినవారిలో అత్యధికులు సైతం ఆయన వాదనతో ఏకీభవించేవారే.

వాతావరణ మార్పు అనే పదం ట్రంప్ రాజకీయ పరిభాషలో లేనే లేదు. అది రాజకీయంగా సరైన భావన కాదు అనేది ఆయన సునిశ్చిత విశ్వాసం. ట్రంప్ వైఖరికి మరో బలమైన కారణమున్నది. శిలాజ ఇంధనాల వాడకం పెరగాలని, విదేశాలకు తరలిపోయిన తయారీ రంగ పరిశ్రమలను మళ్లీ స్వదేశానికి తీసుకురావాలనేది ఆయన లక్ష్యం. 'డ్రిల్, బేబీ, డ్రిల్'కు వ్యతిరేకత అనేది లేకుండా పోవాలంటే వాతావరణ మార్పు అంశాన్ని పూర్తిగా తిరస్కరించి తీరాలని ట్రంప్ విశ్వసిస్తున్నారు. స్వచ్ఛ ఇంధనానికి పరివర్తన ప్రణాళికలను నిరోధించేందుకు అమెరికాలో లభ్యమయ్యే సహజ వాయువును సమస్త దేశాలకు సరఫరా చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. అధిక సుంకాల భారం పడకుండా ఉండాలంటే తమ సహజవాయువును యూరోపియన్ దేశాలు కొనుగోలు చేయవలసిందేనని ట్రంప్ నిర్దేశిస్తున్నారు. అలాగే ఇంటర్నల్ కంబస్టియన్ ఇంజిన్ (అంతర్దహన యంత్రం) వాహనాలను మళ్లీ రంగంలోకి తీసుకురావాలని ట్రంప్ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. ఆ వాహనాల సాంకేతికతలు, తయారీలో అమెరికా అగ్రగామిగా ఉండడమే ట్రంప్‌ను అందుకు పురిగొల్పుతోంది విద్యుత్ వాహనాల రంగంలో చైనా అగ్రగామిగా ఉందన్న వాస్తవాన్ని ట్రంప్ విస్మరించలేరు. మొత్తం మీద అంతర్జాతీయ వాణిజ్యం, ప్రపంచ రాజకీయాలు అమెరికా ఆధిపత్యం, పెత్తనంలో ఉండాలనేది ఆయన అభిమతం. ప్రపంచ దేశాలు, వాటి వాణిజ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు ఆయన ఆరంభించిన చరిత్రాత్మక పోరాటంలో వాతావరణ మార్పును నిరోధించడమనేది ఒక అప్రధాన విషయమే.



ప్రపంచ దేశాలు, వాటి వాణిజ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు డొనాల్డ్ ట్రంప్ ఆరంభించిన చరిత్రాత్మక పోరాటంలో వాతావరణ మార్పును నిరోధించడమనేది ఒక అప్రధాన విషయమే. మానవాళి మనుగడకు ఈ భూమి తప్ప మరో గ్రహం లేదు. ఈ భూమిని మన నివాసానికి అనుకూలంగా కాపాడుకోవడమే మన ముందున్న మార్గం. ట్రంప్ యుగంలో ఇదెలా సాధ్యమవుతుంది? దీనిపై చర్చను మనం కొనసాగించి తీరాలి.

ట్రంప్ ప్రతికూల వైఖరితో వాతావరణ మార్పుపై పోరుకు చాలా హాని వాటిల్లుతుంది. అసలు భూ ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమైన హరిత గృహ వాయు (జిహెచ్‌జి) ఉద్గారాలకు ఇతోధికంగా దోహదం చేసింది, చేస్తోంది అమెరికాయే కాదూ? ఈ వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వర్తమానంలోనే కాదు, చారిత్రకంగా కూడా భూతాపం పెరుగుదలలో ప్రధాన బాధ్యత అమెరికాదే. ఇప్పుడు జిహెచ్‌జి కాలుష్యం వెనుక ప్రథమ స్థానంలో చైనా ఉండగా ద్వితీయ స్థానంలో అమెరికా ఉన్నది. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో 2030 సంవత్సరానికల్లా కాలుష్యకారక వాయు ఉద్గారాలను 50– 52 శాతం తగ్గించేందుకు, 2035 నాటికి 61–66 శాతానికి తగ్గించేందుకు అమెరికా ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఇప్పుడు ట్రంప్ అసలు ఆ అంశాలను పరిగణనలోకే తీసుకోవడం లేదు.

బైడెన్ హయాంలో వాతావరణ మార్పుపై పోరులో అమెరికా సరైన మార్గంలో ఉందని నేను చెప్పబోవడం లేదు. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా అమెరికా తన కాలుష్యకారక వాయు ఉద్గారాలను చాలా తక్కువగా మాత్రమే తగ్గించింది. అయితే మరింత ఎక్కువగా తగ్గించేందుకు హామీ ఇవ్వడమే కాకుండా అందుకు నిబద్ధతతో వ్యవహరిస్తుంది కూడా. హరిత ఒప్పందాల అమలు సాధ్యమయ్యేందుకు ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం (ఐఆర్ఏ) విశేషంగా తోడ్పడింది. పునరుద్ధరణీయ ఇంధనం, విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంపొందించేందుకు బైడెన్ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. ట్రంప్ రెండోరాకడతో ఇదంతా మారిపోయింది. వచ్చిన రెండు రోజులలోనే అమెరికా వ్యాప్తంగా ఇంధన అత్యవసర పరిస్థితిని విధించారు.

ట్రంప్ విధానాల ఫలితంగా కాలుష్యకారక వాయు ఉద్గారాలు మరింతగా తప్పక పెరుగుతాయి. అమెరికా ఉద్గారాలు 2005లో గరిష్ఠ స్థాయిలో రికార్డయ్యాయి. వస్త్రోత్పత్తి పరిశ్రమలను మళ్లీ స్వదేశానికి తీసుకువచ్చి ఉద్యోగాల కల్పనను పెంపొందిస్తానని ట్రంప్ పదే పదే చెబుతున్నారు. అదే జరిగినప్పుడు జిహెచ్‌జి ఉద్గారాలూ పెరుగుతాయి.

సరే, కృత్రిమ మేధ అభివృద్ధి, పర్యవసానాలనూ విస్మరించలేము. డేటా సెంటర్లకు విద్యుత్ ఇతోధికంగా అవసరమవుతుందని అంచనా. ఈ విద్యుత్‌ను శిలాజ ఇంధనాల నుంచే ఉత్పత్తి చేయాలనది ట్రంప్ నిర్దేశం. ట్రంప్ పునరాగమనం శుభకర పరిణామమేమీ కాదు. ఇప్పటికే కాలుష్యకారక వాయు ఉద్గారాల తగ్గింపునకు సంకోచిస్తున్న వివిధ దేశాల ప్రభుత్వాలు ట్రంప్ స్ఫూర్తితో శిలాజ ఇంధనాల వాడకాన్ని పెంచేందుకు సానుకూలమవుతాయి. అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు శిలాజ ఇంధనాలపై ఆధారపడటం మరింతగా పెరుగుతుంది. ఇదంతా నిరుత్సాహాన్ని కలిగిస్తోంది కదూ. అయితే ఒక ఆశారేఖ లేకపోలేదు. సకల దేశాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వాతావరణ మార్పు ప్రభావాలను నెదుర్కొనేందుకు సమష్టిగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల ప్రకృతి ఉత్పాతాల తీవ్రత తగ్గిపోగలదు. మన మనుగడకు ఈ భూమి తప్ప మరో గ్రహం లేదు. ఈ భూమిని మన నివాసానికి అనుకూలంగా కాపాడుకోవడమే మన ముందున్న మార్గం. అయితే ట్రంప్ యుగంలో అదెలా సాధ్యమవుతుంది? దీనిపై చర్చను మనం కొనసాగించి తీరాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

చరిత్ర పొడుగునా...

పారదర్శకమైన పదాల వెనకే
దాగివున్న రహస్యాలు,
వాక్యవిన్యాసంతో
మాయచేసే వ్యాఖ్యానాలు
సంస్థాగత గోడలన్నీ
మరిన్ని విస్తరిస్తున్నా భూగోళంపై
ఆర్థిక విశ్లేషణలతో
మురిసిపోడమే మిగిలింది!

పరిష్కారాలు ఎన్నివున్నా
అగ్రరాజ్యాల ఆధిపత్యం విస్తరించిన
ఆఫ్రికా, ఆసియా ఖండాల–
సుదీర్ఘ ఆకలియాత్రలలో
తెగల–మతాల సంకుల సమరంలో
తెగిన తలలు చెప్పిన రహస్యాలు
చరిత్రపొడుగునా
ఎండిన రక్తపుటేరుల జాడలే!!

– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

సామాజిక అసమానతలపై గళమెత్తిన గద్దర్

ప్రజా వాగ్గేయకారుడు, ప్రజా కవి, కళాకారుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ తన పాటలతో ప్రజలలో ఉత్తేజాన్ని కలిగించారు, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చారు. ఆ గొంతు శాశ్వతంగా మూగబోయి పద్దెనిమిది నెలలయింది. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు, మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన లచ్చుమ్మ, శేషయ్య దంపతులకు జనవరి 31, 1949లో జన్మించారు. దాదాపు అరవై వసంతాలకు పైగా ప్రజలతో మమేకమై ఎన్నో ప్రజా ఉద్యమాలకు తన మాట, పాట ద్వారా ఊపిరి నింపిన విప్లవకారుడు ఆయన. నక్సల్బరీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత బహుజన ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం ఇలా అన్ని ఉద్యమాలలో తన పాటలతో ప్రజా జీవితాలను ప్రభావితం చేశారు. ప్రభుత్వాలను కదిలించారు.

'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో పోతావ్ కొడకో నైజాము సర్కరోడా' అని రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ విమోచన కొరకు గళమెత్తారు. 1980లో చాల ఇళ్లలో 'భద్రం కొడుకో నా కొడుకో కొమరన్న', మదన సుందరి..., 'భారతదేశం భాగ్యసీమరా సకల సంపదలు గల్ల దేశమున దరిద్రమెట్లుందో నాయన, నీతి గల్ల మన దేశంలోన అవినీతెందుకు పెరిగిపోయర' పాటలు వినిపించేవి. చుండూరు దళితుల ఊచకోతకు వ్యతిరేకంగా 'జ్ఞానం ఒక్కరి సొత్తు కాదన్న అది సర్వజాతుల సంపదోరన్న, దళిత పులులమ్మా' అనే పాట జనాన్ని ఉగ్రూత లూగించింది.

నిజామాబాద్, హైదరాబాద్‌లలో గద్దర్ విద్యాభ్యాసం చేశారు. 1975లో కొద్దికాలం కెనరా బ్యాంకులో ఉద్యోగం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ పాడిన 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా.. పోరు తెలంగాణమా' పాట ఎంతటి ప్రభావం చూపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉద్యమం అప్పటిదాకా ఒక ఎత్తు. ఆ పాట తర్వాత మరొక ఎత్తుగా కొనసాగింది. గద్దర్ ఆట, పాట కోట్లాది మందిని కదిలించింది. ఉద్యమాన్ని ఉరకలెత్తించింది. 'అమ్మా తెలంగాణమా..', 'అడవి తల్లికి వందనం' ఇలాంటి వందలాది పాటలతో ప్రభావం చూపారు గద్దర్. జనం గోసను తన పాటల ద్వారా వినిపించారు. గద్దర్ ఒక సంచలనం, ఆయన పిలుపు ఒక ప్రభంజనం, గద్దర్ పాట విని రోమాలు నిక్కబొడుచుకోనివారు ఉండరు. కొన్ని వేలమంది ఉద్యమం బాట పట్టారు. 'నీ పాదం మీద పుట్టుమచ్చనై..' పాటకు నంది అవార్డుకు ఎంపికయ్యారు గద్దర్. కానీ దానిని స్వీకరించేందుకు తిరస్కరించారు.

సామాజిక తెలంగాణ స్వప్నం నెరవేరలేదని, ఎంతో కాలం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ కేవలం కొందరి చేతుల్లోనే ఉందని గద్దర్ వాపోయేవారు. జీవిత చరమాంకంలో సామాజిక సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల అభ్యుదయం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని గ్రహించి ఆ పార్టీ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు.

పీపుల్స్‌వార్, మావోయిస్టు ఉద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో తన గొంతు వినిపించారు గద్దర్. తన గళంతో కోట్లాది మంది ప్రజలను ఉత్తేజపరిచారు. దేశంలో దళితుల హత్యలపై ఆయన అవిశ్రాంతంగా పోరాటం చేశారు. నకిలీ ఎన్‌కౌంటర్లను తీవ్రంగా వ్యతిరేకించారు. అమరవీరుల కుటుంబాలకు చేయూతనిచ్చేవారు. పీపుల్స్‌వార్ పార్టీ క్యాడర్ రిక్రూట్‌మెంట్ ఆయన పాటల ద్వారా ప్రభావితమయింది. చాలామంది సానుభూతిపరులు, పౌర–ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, దళిత బహుజన సంఘాలలో సాంస్కృతిక విప్లవం తెచ్చిన వ్యక్తి. ఆయన పాటలతో ఉత్తేజమై ఎందరో నక్సల్ ఉద్యమంలో చేరారు. ఈ క్రమంలోనే 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. నాడు మరణం అంచుల దాకా వెళ్లి, ప్రాణాలతో బయటపడ్డారు.

1969 తెలంగాణ ఉద్యమంలోనూ గద్దర్ చురుగ్గా పాల్గొన్నారు. భావజాల వ్యాప్తి కోసం ఊరూరా తిరిగి, బుర్రకథలతో ప్రచారం చేసేవారు. అలా ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి. నరసింగరావు.. భగత్‌సింగ్ జయంతి రోజున ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ప్రతి ఆదివారం ఆయన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో బి. నరసింగరావు ప్రోత్సాహంతో గద్దర్ 'ఆపర రిక్షా' పేరుతో తన మొదటి పాట రాశారు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది.

సామాజిక తెలంగాణ స్వప్నం నెరవేరలేదని, ఎంతో కాలం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ కేవలం కొందరి చేతుల్లోనే ఉందని గద్దర్ వాపోయేవారు. తాను జీవించి ఉన్న చివరి రోజులలో సామాజిక సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల అభ్యుదయం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని గ్రహించి ఆ పార్టీ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ పట్ల ఆయనకు వల్లమాలిన అభిమానం. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో పాల్గొన్నారు, పౌర ప్రజా సంఘాలతో మమేకమై భారత్ బచావో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినా, దేశానికి పతకాలు సాధించిన రెజ్లర్లపై లైంగిక వేధింపులు జరిగినా, బిల్కిస్ బానో రేప్ కేసులో నిందితులకు క్షమాభిక్ష ప్రసాదించినా... మాకు సంబంధించిన విషయాలు కావని మౌనం పాటిస్తున్న పార్టీలు, చివరికి గద్దర్‌ను భౌతికంగా నిర్మూలించేందుకు దాడులు జరిపిన పార్టీలు సైతం గద్దర్‌ని కొనియాడుతున్నాయి. అలాగే ఒక విప్లవకారుడి చివరి అంతిమ యాత్రలో ప్రభుత్వ లాంఛనాలతో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అరుదైన వ్యక్తి గద్దర్. ప్రాంతాల మధ్య అంతరాలను, వెనుకబాటుతనాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. సమాజ పురోభివృద్ధికి ప్రతిబంధకాలు అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, మతోన్మాదం, అశ్లీలత అని భావించి... తన ఆట, పాట ద్వారా ప్రజలను ఆలోచింపజేసి భావ విప్లవం తెచ్చిన మహానుభావుడు ఆయన.



2023 జనవరిలో రాయలసీమ ప్రజా సంఘాల వేదికలో గద్దర్ ప్రసంగించారు. రాయలసీమ పట్ల ప్రత్యేక అభిమానంతో నీళ్లు, నిధులు, ప్రాంతీయ అసమానతలు తుదముట్టించడానికి లౌకిక ప్రజాతంత్ర ఉద్యమానికి బాసటగా నిలిచారు. ముప్పై సంవత్సరాల క్రిందట మహాబోధి విద్యాలయం ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులకు విద్యా ప్రదానం చేశారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారికి, సింగిల్ పేరెంట్ పిల్లలకు తాను స్థాపించిన పాఠశాలలో ఉచిత విద్య అందించారు. గుమ్మడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు నేలపైన ప్రజాకళలు ఉన్నంత వరకు గద్దర్ పాట సజీవంగా ఉంటుంది.

■ జి. వెన్నెల గద్దర్
ఛైర్‌పర్సన్, తెలంగాణ సాంస్కృతిక సారథి
(నేడు గద్దర్ జయంతి)



పబ్లిక్‌గార్డెన్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న వినయభాస్కర్

420 రోజులైంది? హామీల అమలెప్పుడు?

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

హనుమకొండ టౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులైందని, ఇచ్చిన 420 హామీలు అమలెప్పుడవుతాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రశ్నించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలన కోతల పాలన అని దుయ్యబట్టారు. ఎగవేతలు, ఎదురుచూపులతో పాలన కొనసాగుతోందని విమర్శించారు. రైతుబంధు, రైతు బీమా కోసం రైతులు ఎదురు చూస్తున్నారని అన్నారు. రైతు కూలీలకు రూ.12వేలు ఎప్పుడిస్తారోనని వారు ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.6వేలు, మహిళలకు రూ.2500, వృద్ధులకు పెంచిన రూ.4వేల పింఛన్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. డిక్లరేషన్ పేరుతో హామీల పేరుతో గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. 100 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి 420 రోజులైనా హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పులి రజినీకాంత్ తది తరులు పాల్గొన్నారు.

కమల సారథి ఎవరో?

- అధిష్ఠానానికి ముగ్గురి పేర్లను పంపిన రాష్ట్ర నేతలు
- సీనియర్ల నుంచి కేంద్ర నాయకత్వం అభిప్రాయ సేకరణ
- త్వరలో జరగనున్న నూతన అధ్యక్షుడి నియామకం



రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి ఎంపిక ఉత్కంఠను రేపుతోంది. కొత్త సారథి ఎవరు? అనే దానిపై పార్టీలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. 2016, 2021, 2024లో మూడు దఫాలుగా 9 ఏళ్ల బీజేపీ జిల్లా అధ్యక్షురాలుగా పనిచేసిన రావు పద్మను రాష్ట్ర కార్యవర్గంలో తీసుకుంటుండటంతో కొత్త అధ్యక్షుడిని త్వరలో ఎంపిక చేయనున్నారు. సంస్థాగత ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని మండల, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ల నియామకం పూర్తికావడంతో పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం.. జిల్లా అధ్యక్షుల ఎంపికపై దృష్టిసారించింది. గతంలో మండల, డివిజన్ అధ్యక్షులను జిల్లా కమిటీ ప్రకటించేది. కానీ ఈ సారి రాష్ట్ర అధిష్ఠానం ప్రకటించింది. అదే విధంగా జిల్లా అధ్యక్షులను పార్టీ రాష్ట్ర అధిష్ఠానం ప్రకటించగా, ఈ దఫా జిల్లా అధ్యక్షులను ప్రకటించే బాధ్యతను జాతీయ పార్టీ తీసుకుంది.

బరిలో..

బీజేపీ జిల్లా అధ్యక్ష బరిలో చాడ శ్రీనివాసరెడ్డి, రావుల కిషన్, కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం, గుజ్జుల శ్రీరాంరెడ్డి, కొండి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత, కందిగట్ల సత్యనారాయణ పోటీపడ్డారు. అయితే జిల్లా అధ్యక్షుడి బరిలో ఉండేవారు రెండు దఫాలు (6 సంవత్సరాలు) క్రియాశీలక సభ్యుడై, వయస్సు 45 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలనే ఓ నిబంధన ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా అబ్జర్వర్ తల్లోజ్ ఆచారి హనుమకొండ బీజేపీ అధ్యక్ష బరిలో ఉన్న వారిలో అర్హతలను బట్టి 8 మంది పేర్లను పరిశీలించి ఐదుగురిని ఖరారు చేసి రాష్ట్ర నాయకత్వానికి అందజేసినట్లు తెలుస్తోంది. అయితే మొదటి నుంచి పార్టీ కోసం శ్రమించే సీనియర్లు అయిన చాడ శ్రీనివాసరెడ్డి, రావుల కిషన్, కొలను సంతోష్‌రెడ్డి పేర్లను రాష్ట్ర నాయకత్వం కేంద్ర నాయకత్వానికి పంపించినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. ముగ్గురి బలం, బలహీనతలపై జిల్లాలోని సీనియర్లు నుంచి జాతీయ పార్టీ ఇప్పటికే సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురిలో ఎవరిని ఎంపిక చేస్తారనేది ప్రస్తుతం ఉత్కంఠంగా మారింది.

పార్టీలో సీనియర్లు

ఈ ముగ్గురిలో ఇద్దరు రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా కొనసాగుతుండగా, ఒకరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు గతంలో ఎన్నికల్లో పోటీ చేశారు. చాడ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థి దశలోనే రాజకీయంలోకి అడుగుపెట్టి జిల్లాస్థాయిలో వివిధ పదవులు చేపట్టి కార్పొరేటర్, ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఇతర జిల్లాల ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత గ్రేటర్‌లోని 52వ డివిజన్ కార్పొరేటర్‌గా తన సతీమణి చాడ స్వాతిరెడ్డిని రెండు పర్యాయాలుగా గెలిపించడంలో కీలకంగా పనిచేశాడు. అలాగే రావుల కిషన్ తల్లి బీజేపీలో చురుకుగా పనిచేసి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ఈ సారి తన సతీమణి రావుల కోమలను 30 డివిజన్‌లో కార్పొరేటర్‌గా బరిలో నిలిపి విజయం సాధించిచాడు. కొలను సంతోష్‌రెడ్డి రెండుసార్లు కార్పొరేటర్‌గా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాడు.

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవికి త్రిముఖ పోరు



చాడ శ్రీనువాసరెడ్డి



రావుల కిషన్




కొలను సంతోష్‌రెడ్డి

త్వరలో ఎంపిక

రానున్న స్థానిక ఎన్నికలతో పాటు రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కార్పొరేషన్‌పై కమలం జెండా ఎగురవేసేందుకు సమర్థత కలిగిన వ్యక్తిని ఎంపికచేసేందుకు అధిష్ఠానం అడుగులు వేస్తోంది. ఇప్పటికే అధ్యక్షుడిని ప్రకటించాల్సి ఉండగా అష్టమి, నవమి వచ్చిందనే కారణంగా ప్రకటన వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది. ఈనెల 26లోగా జిల్లా అధ్యక్షుడు ఎవరనేది జాతీయ పార్టీ ప్రకటించనున్నట్లుగా తెలుస్తోంది.

నగరం ఆధ్యాత్మిక సౌరభం



◄నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తికళాకారులు, చిన్నజీయర్ అభివాదం

- నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు
- అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- హిందూ ధార్మిక విలువలను విస్తరింపచేద్దాం
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి
- వరంగల్ కేంద్రంగా సంకీర్తన మండలికి శ్రీకారం

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే



క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులు నిర్దేశిత నిబంధనలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. గురువారం నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో లేఅవుట్‌ల ఏర్పాటు, బిల్డింగ్ నిర్మాణ అనుమతులకు పలువురు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వాటికి అనుమతుల మంజూరు కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా లేఅవుట్ అనుమతుల జారీ కోసం అమ్మవారిపేట, మడికొండ ప్రాంతాల్లో, భవన నిర్మాణ అనుమతుల జారీ కోసం వడ్డెపల్లి ప్రాంతంలో కమిషనర్ పర్యటించి కొలతలు వేసి సమాచారాన్ని ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హర్షద్, రజిత తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- షీటీమ్ ఫిర్యాదులపై సున్నితంగా వ్యవహరించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- ఆర్గనైజన్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా, చిత్రంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీసు అధికారులు

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వీలైనంత తొందరగా చేరుకోవాలని ఆర్గనైజన్ అండ్ హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం పోలీసు అతిథి గృహానికి చేరుకున్న అడిషనల్ డీజీపీకి సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సాయుధ బలగాలు గౌరవవందనం చేశారు. తనిఖీల్లో భాగంగా కమిషనరేట్ కార్యాలయానికి చేరుకొని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీపీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ఏర్పాటైన షీటీమ్ పట్ల ప్రజలకు అవగహన కల్పించడంతో పాటు షీ టీమ్‌లో ఇచ్చే ఫిర్యాదులను అధికారులు సున్నితంగా పరిష్కరించాలన్నారు. బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసు నమోదు చేయాలన్నారు. స్టేషన్ అధికారులకు భరోసా కేంద్రం పనితీరు తెలిసేలా కేంద్రాన్ని సందర్శించి అక్కడి కార్యకలాపాలను తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్, మత్తు పదార్థాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో సేఫ్టీ ఉమెన్, సేఫ్టీ ట్రాఫిక్, యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ క్లబ్‌లను ఏర్పాటుచేసి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. జాగృతి కళాబృందం ద్వారా ప్రజలకు నష్టం కలిగే అంశాలలపై అవగాహన కల్పించాలన్నారు. బాల నిర్మూలన కోసం నిరంతరం తనిఖీలు కొనసాగించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కమిషనరేట్ భవనంతో పాటు రిజర్వుడ్ ఆయుధాగారంతోపాటు డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సలీమా, రవీందర్, రాజ మహేంద్ర నాయక్, అదనపు ఎస్పీలు చేతన్, మనాన్ భట్, ఏఆర్ అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.



రైల్వే డీఆర్ఎం భరతేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రైల్వే డీఆర్ఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే భవన్‌లో గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్‌ను, ఏడీఆర్ఎం ఎం.గోపాల్‌ను కలిశారు. కాజీపేటలో నిర్మించ తలపెట్టిన బస్టాండ్‌పై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా బస్టాండ్ స్థలాన్ని అప్పగిస్తే, శంకుస్థాపన పనులు చేపడుతామని కోరారు. అనంతరం బస్టాండ్ స్థల మ్యాప్‌ను పరిశీలించారు. బస్టాండ్ స్థలాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరుతూ వినతిప్రతం సమర్పించారు. బస్టాండ్ ప్రతిపాదనలు త్వరలో రైల్వే బోర్డుకు పంపిస్తామని డీఆర్ఎం చెప్పి నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ అంకూస్ ఉన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు పతకం



బంగారు పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కుస్తీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుంది. కరీంనగర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ 97 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారుడిపై విజయం సాధించి నవీన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి పెట్టాడు. ఈ సందర్భంగా నవీన్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.

పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కుసుమ శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకునేందుకు పాఠశాలతో పాటు, ప్రత్యేక శిక్షణ అవసరమని సన్మార్గం, సత్ప్రవర్తన శిక్షణ ప్రధాన పర్యవేక్షకుడు కుసుమ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన కొలనుపాక సుమన్ శాస్త్రితో కలిసి యాదవనగర్‌లో వేసవికాలంలో నిర్వహించే శిక్షణ శిబిరం వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 20 వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని, జూన్ 11వ తేదీ నుంచి 41 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల నుంచి 14 ఏళ్ల మగ పిల్లలకు మాత్రమే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకొని శిబిరానికి పంపిస్తే చక్కని క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన, విద్య పట్ల ఆసక్తి, కళల పట్ల మక్కువ కలిగేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తామని కుసుమ శ్రీనివాస్ చెప్పారు. వివరాల కోసం 9849267993 మొబైల్‌లో సంప్రదించాలని సూచించారు.

బీసీలు రాజకీయాలను శాసించాలి

పద్మశాలీ సంఘం జాతీయ నేత ఈగ మల్లేశం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఈగ మల్లేశం, శ్రీరాములు, సమ్మారావు

వడ్డేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయాలను శాసించి రాజ్యాధికారాన్ని చేపట్టి హక్కులను సాధించుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా ఆధిపత్య కులాల పాలకులు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తెచ్చి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాష్ట్రంలోని 60 లక్షల మంది నిరుద్యోగులకు శాపంగా మారాయన్నారు. కేవలం మూడు శాతం ఉన్న ఓసీ కులాలకు 10 శాతం, 65 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వే షన్లు మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్రనేత గుండు ప్రభాకర్ మాట్లా డుతూ.. బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దృష్టి కి తీసుకెళ్లేందు కోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వం లో ఫిబ్ర వరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మధ్యా హ్నం 2గంటలకు నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు రాజకీయాలకతీతంగా అన్ని బీసీ కులాలతో పాటు పద్మశాలీ కులస్తులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వడ్నాల నరేందర్, చంద మల్లయ్య, బచ్చు ఆనందం, దుస్స శివశంకర్, ఆడెపు రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, శామంతుల శ్రీనివాస్, బేతి అశోక్, మేడారపు సుధాకర్, గాడి పల్లి రాజేశ్వర్‌రావు, భైరి శ్రీనివాస్, పరికిపండ్ల వేణు, జానకీరాములు, బీ రమేష్, శివశంకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఐలాపూర్ జాతర పనులు పూర్తి చేయాలి

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర



ఐలాపూర్‌లో గద్దెల ప్రాంగణంలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

కన్నాయిగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. గురువారం ఆయన ఐలాపూర్‌లో పర్యటించారు. భక్తులకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాల కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా జాతర పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం వనదేవతలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు మల్లెల రవి, మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, పీరీల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల ఆలయాన్ని సందర్శన

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయి, మాల్యాల, దొడ్ల గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గోవిందరాజుల ఆలయాన్ని సందర్శించిన ఆయనకు సారలమ్మ ప్రధాన పూజారి, మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు గిరిజన సాంప్రదాయ ప్రకారం స్వాగత పలికారు. అనంతరం గోవిందరాజుకు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 12 నుంచి జరిగే మేడారం మినీ జాతర సందర్భంగా కొండాయిలోని గోవిందరాజుల ఆలయం వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాపై తప్పుడు ప్రచారం చేశారు

- ఏ ఉగ్రవాద సంస్థతో మాకు సంబంధం లేదు
- పోలీసులు విచారణ చేసింది వాస్తవమే..
- మా సంఘానికి క్లీన్ చిట్ ఇచ్చి పంపించారు
- ఆల్ ఇండియా జమాతే ముస్లీమి అధ్యక్షుడు జక్రియా

వరంగల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని, తనకు, తమ సంఘానికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు లేవని ఆల్ ఇండియా జమాతే ముస్లీమి జాతీయ అధ్యక్షుడు జక్రియా స్పష్టం చేశారు. గురువారం వరంగల్ చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 2021మార్చి నుంచి ఆల్ ఇండియా జమాతే ముస్లీమి సంఘానికి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానన్నారు. అయితే ఈ నెల 25వ తేదీన తాను శ్రీలంకకు వెళుతుండగా, చెన్నై ఎయిర్ పోర్టులో ఇమ్మిగ్రేషన్ వద్ద పోలీసులు తనను నిలిపి అదుపులోకి తీసుకున్నారని, రెండు రోజులు వారి అదుపులోనే ఉంచుకుని, ఫోన్, పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారన్నారు. రెండు రోజుల విచారణ తర్వాత తరువాత తమ సంఘానికి ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని క్లీన్‌చిట్ ఇచ్చారని వివరించారు. తమ సంఘం ప్రచారానికి ఎక్కడైనా పోవచ్చని అధికారులు పేర్కొన్నారని తెలిపారు. అయితే తనకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు కొన్ని సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు జక్రియా తెలిపారు.



ఉపాధి పనుల నివేదికను ప్రజావేదికలో వివరిస్తున్న డీఆర్పీలు

ఉపాధి హామీలో గోల్‌మాల్.!?

మరిపెడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మరిపెడ మండలంలోని 44 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు గురువారం జరిగిన సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో వెల్లడైంది. ఊరూరా ఎఫ్ఏలు గతం లాగానే మళ్లీ అవే కాకి లెక్కలతో అక్రమాలకు పాల్పడ్డట్లు బట్టబయలైంది. సోషల్ ఆడిట్ సర్వే బృందాలు పక్షం రోజులుగా మండలంలోని ఊరూరా జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ నివేదికలను గురువారం మరిపెడ మండల్ పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇన్‌హౌస్ ప్రజావేదికలో డీఆర్పీలు జిల్లా ఉన్నతాధికారులకు పలు ఆసక్తికర విషయాలను నివేదించారు. ఎఫ్ఏలు తమ అనుయాయులకు పనులు చేయకున్నా మస్టర్ రోల్‌లో పేర్లు రాసి బిల్లులు స్వాహా చేసినట్లు వెల్లడయ్యింది. ఆనేపురంస్టేజీ, నీలికుర్తి, ఎల్లంపేట, వీరారం, ఉల్లెపల్లి, గాలివారిగూడెం తదితర గ్రామాల్లో పనులు లేకుండానే బిల్లులు పొందారు. నీలికుర్తి, ఎల్లంపేట గ్రామాల ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించాలని ఆయా గ్రామాల బాధితులు డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రావు చెప్పారు. కార్యక్రమంలో డీపీసీ మన్మోహన్, ఏపీసీ అంజిగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీవో కనకదుర్గ, గతంలో పని చేసిన ఎంపీడీవో ధన్‌సింగ్, అంబుడ్స్ మేనేజర్ ఆదామ్, ఎస్ఆర్పీలు చెన్నకేశవులు, కొమురయ్య, ఏపీవో మంగమ్మ, ఎంపీవో సోమ్లానాయక్, ఎఫ్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎమ్మెస్సీ ప్రాక్టికల్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాదికి సంబంధించిన ఎమ్మెస్సీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్-1 ప్రాక్టికల్ తరగతులను నిర్వహిస్తామని కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట గోపీనాథ్ గురువారం తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగం కోర్సుల అభ్యర్థులందరూ వర్సిటీలోని ఆయా విభాగాల్లో నిర్వహించే ప్రాక్టికల్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీల్లో జరుగుతారని వెల్లడించారు. అలాగే ఫిబ్రవరి 9, 10న ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరై పరీక్షలు రాయాలని కోరారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా కిశోర్



డాక్టర్ కిశోర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిశోర్ పూర్తి అదనపు బాధ్యతలు గురువారం స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిశోర్‌ను టీఎన్‌జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షు డు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ.. ఎంజీఎం అభివృద్ధికి, రోగు ల సంరక్షణకు, మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఇస్మాయిల్ అలీ, లక్ష్మీప్రసాద్, రవికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వర్‌రావు

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గోదాముల నిర్వహణతో పాటు అందులో నిల్వల రికార్డులు సక్రమంగా ఉండాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు అన్నారు. గురు వారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ రీజియన్ పరిధిలోని గిడ్డంగుల సంస్థల మేనేజర్లతో నాగేశ్వర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిడ్డంగుల నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు. గోదాముల్లో బాగా కష్టపడి పని చేసేవారిని గుర్తించి వారికి ప్రోత్సాహం ఇస్తామన్నారు. గోదాముల్లోని నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గోదాముల్లో ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గోదాములను ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనఖీలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్ర లక్ష్మి, జనరల్ మేనేజర్లు ఆనంద్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో యువకుడి ఆత్మహత్య

మృతుడి స్వస్థలం ఏపీలోని విశాఖపట్టణం

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస సెంటర్‌లోని శివప్రియ లాడ్జ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన యువకుడు పనస పతంజలి పవన్ ప్రేమ్‌కుమార్ (31) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణం జిల్లా నర్సీపట్నంలోని చాకలీ కాలనీకి చెందిన పవన్ ప్రేమ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 12.25 గంటలకు శివప్రియ లాడ్జ్‌లోని రూమ్ నెంబర్ 107ను అద్దెకు తీసుకున్నాడు. లాడ్జ్ యాజమానికి ఎస్ఎస్‌సీ పరీక్ష ఉందని, అందుకే విశాఖపట్టణం నుంచి ఇక్కడికి వచ్చానని తెలిపినట్లు చెప్పారు. పవన్ ప్రేమ్‌కుమార్‌కు మూడు నెలల క్రితం వివాహం అయినట్లు తెలిసింది. తల్లిదండ్రులు వస్తే కానీ పవన్ ప్రేమ్‌కుమార్ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో.. వివరాలు తెలుస్తాయని ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో సమాచారం ఆలస్యమవుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2525	2130
పల్లికాయ (సూక)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	5400	3100
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
ఎల్లో మిర్చి	16500	13500
తేజ మిర్చి	13500	9000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్ 341	14500	11500
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

క్వింటా మిర్చిని రూ.25 వేలకు కొనాలి


తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : క్వింటా మిర్చి రూ.25 వేలకు కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ గురువారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడారు. మార్కెట్‌లో క్వింటా మిర్చిని అధికంగా రూ.13 వేలకే కొనుగోలు చేయడ దారుణమని విమర్శించారు. భారీ ఎత్తున మిర్చి మార్కెట్‌కు తరలివస్తున్నప్పటికి ధరను నామమాత్రం ధరలకే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. గత ఏడాది క్వింటా మిర్చి రూ.24 వేలధర పలికిందని చెప్పారు. ఓ వైపుమిర్చి 35-40 క్విం టాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 15-20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని దాంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. వ్యాపారులు, దళారులతో అధికారులు కుమ్మక్కై మిర్చి రైతును చిత్తు చేస్తున్నారని విమర్శించారు. కోల్డ్ స్టోరేజ్‌లలో దాచుకుందామనుకున్న వ్యాపారులు, కమిషన్ ఏజెంట్‌లే తిష్ట వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళారి వ్యవస్థను నివారించాలని అందుకు గాను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లలో కూడ తనిఖీలు నిర్వహించాలని, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మిర్చి ని కొనుగోలుచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, అధ్యక్షులు గునిగంటి రాజన్న, ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, పల్లా ప్రభాకర్‌రెడ్డి, బయ్య సోమన్న, నీరుటి జలేందర్, కట్ల కృష్ణయ్య, బానోత్ రమేష్, వెంకన్న, పులగుజ్జు రామ్మూర్తి, అంగోత్ ఇస్తా, రామసాని రాంరెడ్డి పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

కేయూలో పదవుల పందేరం



- రిజిస్ట్రార్ సహా కీలక పదవులకు కొత్త ముఖాలు • ఎస్సీ ప్రొఫెసర్‌కు రిజిస్ట్రార్ పోస్టు ఇచ్చే చాన్స్
- పరిపాలన పదవుల్లో కొందరికీ ఎప్పుడూ మొండిచెయ్యే • సీఎంతో కీలక భేటీ నేపథ్యంలో పోస్టుల భర్తీ అలస్యం

కేయూ క్యాంపస్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నూతన పరిపాలన అధికారులు త్వరలోనే పగ్గాలు చేపట్టనున్నారు. రిజి స్ట్రార్‌తో సహా ఇతర కీలక పదవులన్నింటినీ సమర్థులతో భర్తీ చేసేందుకు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఇప్పటికే సమాలోచనలు చేసినట్లు సమాచారం. అయితే ఎవరు ఏ పోసుకు సరిపోతారనే అంశంలో కొంత సంశయంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పరిపాలన పదవుల భర్తీ విషయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే వీసీ ఓసీవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కచ్చితంగా ఎస్సీ వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కే రిజిస్ట్రార్ పదవి వస్తుందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. రిజిస్ట్రార్‌తో పాటు మరిన్ని కీలక పదవులైన కేయూ డెవలప్‌మెంట్ ఆఫీసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీడీసీ అకడమిక్ డీన్, సీడీసీ అకడమిక్ ఆడిట్ డీన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, హాస్టల్స్ డైరెక్టర్‌తో పాటు ఇతర కీలక పదవుల్లోకి కొత్తగా పలువురు ప్రొఫెసర్లతో భర్తీకానున్నాయి. ఇప్పుడున్న పరిపాలన అధికారులందరూ గతంలో నియమించబడిన వారు కావడంతో వారందరి పదవులలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో వర్సిటీల్లో పెండింగ్ విషయాలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నత విద్య మండలి, ఉన్నత విద్య కమిషనరేట్ కార్యాలయ అధికారులు సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు కోరుతున్నారు. వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది విషయంలోనూ నిబంధనలను విధిస్తున్నారు. వర్సిటీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండంతో వర్సిటీలో పరిపాలన, అకడమిక్ అధికారుల పాత్ర రానున్న కాలంలో మరింత కీలకం కానుంది.

ఆశావహుల ఎదురుచూపులు

కాకతీయ యూనివర్సిటీలో 409 మంది ప్రొఫెసర్ల పోస్టులకుగాను ప్రస్తుతం 76 మందే రెగ్యులర్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. గతంలో పనిచేసిన కీలకమైన ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందారు. వారి స్థానంలో 2010 తర్వాత నుంచి వర్సిటీలో రెగ్యులర్ నియామకాలు జరగలేదు. 15 ఏళ్లకాలంలో పోయే వారే తప్ప.. వచ్చే వారు కరువయ్యారు. దీంతో వర్సిటీలో తీవ్రమైన ప్రొఫెసర్ల కొరత ఏర్పడింది. 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల బ్యాచ్‌లో 32 మందికి కోర్టు కేసుల నేపథ్యంలో ఇంక్రిమెంట్లతో పాటు పదోన్నతులను ఇవ్వలేదు. దీంతో వారికి వర్సిటీలో పరిపాలన పదవులు అందని ద్రాక్షలాగే మారాయి. గత వీసీ కాలంలో ఒక్కరిద్దరి పైరవీలకు తలొగ్గి వర్సిటీలో పరిపాలన పోస్టులు కట్టబెట్టినప్పటికీ తర్వాత తొలగించారు. 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసు విషయం తెలితే వారికీ పరిపాలన పదవులను కేటాయించే అవకాశాలున్నాయి. ఇప్పుడున్న ప్రొఫెసర్ల కంటే అధికంగా వర్సిటీలో పరిపాలన పదవులు ఉండడంతో దాదాపు అందరికీ పదవులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే పలుకుబడి కలిగిన వర్సిటీ పదవుల కోసం ప్రొఫెసర్ స్థాయి వ్యక్తులందరూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి దృష్టిలో పడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే పదవుల కోసం పైరవీలకు దిగుతున్నారు.

అసంతృప్తి సెగలు

కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు పదవుల పంపిణీపై అసంతృప్తి సెగలు కమ్ముకున్నాయి. వర్సిటీలో పదవులు వచ్చినోళ్లకు వస్తున్నాయని, రానివారికి ఏమీ రాకపోవడంతో పలువురు ప్రొఫెసర్లలో అసంతృప్తి నెలకొంది. కొందరు సర్వీస్‌లోకి వచ్చినప్పటి నుంచి దాదాపు ఏళ్లుగా పరిపాలన పదవుల్లోనే కొనసాగుతున్నారు. వర్సిటీలో పలువురు ప్రొఫెసర్లకు పదవులేమీ కావడం లేదు. పరిపాలన పదవులు నిర్వహించని వారికి వర్సిటీలో ఉద్యోగ విరమణ సమయంలో పలు బెనిఫిట్స్ లభిస్తాయి. దీంతో పదవులకు డిమాండ్ పెరగుతోంది. వర్సిటీలో కీలకమైన డిపార్టుమెంట్లలో పనిచేసే ప్రొఫెసర్లలో సగానికి కంటే ఎక్కువ మంది పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. పదవుల్లో ఉన్న ప్రొఫెసర్లు పాఠాలు చేప్పే తీరిక దొరకడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీంతో అకడమిక్ వాతావరణం దెబ్బతింటోంది. వర్సిటీలో పదవులు కొందరు ప్రొఫెసర్లకే ఇచ్చి మరికొందరికీ మొండి చెయ్యి చూపడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వర్సిటీ పదవులు ఇలా..

మ్యాథ్స్ విభాగంలో ఆరుగురికి.. నలుగురు పదవుల్లో ఉండగా జువాలజీలో నలుగురికి.. ముగ్గురు పదవుల్లో కొనసాగుతున్నారు. కెమిస్ట్రీలో ఆరుగురికి ముగ్గురు, కామర్స్‌లో నలుగురికి ఇద్దరు, కంప్యూటర్ సైన్స్‌లో నలుగురికి ఒక్కరు, జియాలజీ, ఎకానమిక్స్‌లో ఉన్న ఒక్కొక్కరు, ఫార్మసీలో ఏడుగురికి ఒక్కరు పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. వీరంతా పదవుల్లో ఉంటే విద్యార్థులకు పాఠాలు, పరిశోధన ఎలా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదిలా ఉండగా, ఇంకా పాలక మండలి సభ్యులుగా, డీన్లు, ప్రిన్సిపాల్స్, హెడ్స్ తదితర అకడమిక్ పదవుల్లోనూ మరికొందరు ప్రొఫెసర్లు కొనసాగుతున్నారు.

కీలకం కానున్న ఓఎస్డీ పోస్టు

గతంలో కేయూలో ఎప్పుడూ లేని ఓఎస్డీ పోస్టును తాజాగా తెస్తున్నారు. వర్సిటీలో ఓఎస్డీ పోస్టుకు రాష్ట్రఫైనాన్స్ సెక్రటరీ అభ్యంతరాలు లెవనెత్తినప్పటికీ వర్సిటీ పాలకమండలి సైతం ఆమోదం తెలిపింది. వర్సిటీలో వీసీ- రిజిస్ట్రార్‌ల మధ్య స్థంగా ఓఎస్డీ పని చేస్తారు. పాలక మండలి, వీసీ నిర్ణయాలను రిజిస్ట్రార్ అమలు చేస్తారు. అయితే మధ్యలో ఓఎస్డీ పోస్టు అవసరమా? అనే అభ్యంతరాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు వర్సిటీలో ఎప్పుడు ఓఎస్డీ పోస్టే లేదు కదా.. అని వర్సిటీలో అందరూ చర్చించుకుంటున్నారు. తాజాగా వర్సిటీలో ఓఎస్డీ పోస్టును భర్తీ చేయనుండటంతో ఓఎస్డీ కీలకంగా మారనున్నారు. అయితే వర్సిటీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఓఎస్డీ పోస్టు అనవసరమనే భావన వర్సిటీలో నెలకొంది.

సీఎంతో భేటీ అనంతరమే ప్రకటన



వర్సిటీల డీపీఆర్ (డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు)లను తయారు చేయాలని గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్సిటీల వీసీలకు ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీల్లో ఇప్పుడున్న సిబ్బంది మొదలుకుని వర్సిటీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలన్నీ తమకు డీపీఆర్ రూపంలో పకడ్బందీగా సమర్పించాలని సూచించారు. వర్సిటీలో వీసీ డీపీఆర్‌ల ఏర్పాటుకోసం కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. గతంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు కేయూ డీపీఆర్‌లను సమీక్షించారు. గతంలో సంక్రాంతి పండగకు ముందే సీఎం - వీసీల భేటీ షెడ్యూల్ ఉండగా, మళ్లీ ఎప్పుడు ఉంటుందనేది తెలియరాలేదు. సీఎం రేవంత్‌రెడ్డితో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి డీపీఆర్‌ల భేటీ ముగిసిన తర్వాత వర్సిటీలో నూతన పరిపాలన అధికారుల నియామకాల ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి భేటీ అలస్యం జరిగితే వీలైనంత త్వరలోనే కొత్త అధికారుల నియామకాల ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

నిబంధనలు పాటించు.. క్షేమంగా జీవించు..

- రోడ్డు భద్రతా నియమాలపై అందరికీ అవగాహన అవసరం
- ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ఎంతో ముఖ్యం
- రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- నెలరోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణ



ఉర్సుగుట్ట వద్ద ట్రాలీ ఆటోకు రేడియం స్టిక్కర్ వేయిస్తున్న ఎంవీఐ శోభన్‌బాబు(ఫైల్)

ఖిలావరంగల్ / వర్ధన్నపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'సెల్‌ఫోన్ కంటే ప్రాణం విలువైంది. హెల్మెట్ కంటే మన తల ఖరీదైంది. కారులోని సీటు బెల్టు మన ప్రాణాలను రక్షిస్తుంది' అంటూ పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిని వాహనదారులు గుర్తించినప్పుడే రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య తగుతుందని.. అందుకే 'రోడ్డు నిబంధన పాటించు.. క్షేమంగా జీవించు' అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 1న ప్రారంభమైన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగుస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు అధికారులు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన వస్తున్న చెట్ల పొదలను తొలగింపజేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులను నిలిపి గులాబీ పువ్వులు ఇచ్చి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. 'మీ క్షేమమే.. మా ధ్యేయం' అంటూ తలకు హెల్మెట్లను పెట్టి అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ నియమాల గురించి పోస్టర్లు, కరపత్రాలు, సామాజికమాధ్యమాలు, కళాజాత, అవగాహన సదస్సుల ద్వారా వివరించారు. డ్రండెన్ డ్రైవ్‌లు పెట్టి మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

శిరస్త్రాణమే శ్రీరామ రక్ష

వాహనదారులు శిరస్త్రాణమే శ్రీరామ రక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెల్మెట్ ధరించని వారిని హెచ్చరించడం, సీటు బెల్టు పెట్టుకోని సూచించడం లాంటివి చేశారు. అయినా సరే చాలా మంది వాహనదారుల్లో పెద్దగా మార్పు రావడం లేదు. నిత్యం ట్రాఫిక్ కూడళ్లలో, హైవేల్లో కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు. కొంత మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ ఫిక్స్ చేసి మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. కారు నడిపే వ్యక్తులు సీటు బెల్టు పెట్టుకోకుండా కారు నడిపే దృశ్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. సీటు బెల్టు లేకపోవడం వలన సైతం తలకే ఎక్కువగా గాయాలై మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. కొన్ని కొన్ని సార్లు బెలూన్లు ఓపెన్ కాకపోతే ప్రాణాలు నిలవడం కష్టమే. పోలీసులు, రవాణాశాఖ, ఇతర అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని కొత్త కార్యక్రమాలు తీసుకువచ్చినా తుదిగా పాటించాల్సింది ప్రజలే. ముఖ్యంగా బైక్, కారు నడుపుతున్నప్పుడు స్పీడు ఎక్కువగా పోవడం, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా డ్రైవ్ చేయడం వలన ఈ మధ్యకాలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురైనప్పుడు జీవితాంతం బాధ పడాల్సి వస్తోందని చెపుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాల్లో ప్రధానమైనవి..

- ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలి. విపరీతమైన వేగంతో వెళ్లొద్దు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ గుర్తులను అనుసరిస్తూ ప్రయాణికులు సురక్షితంగా రోడ్లపై తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లను ఉపయోగించకూడదు.
- కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ చేసే వారితో పాటు మిగిలిన వారు కూడా సీటు బెల్టును ధరించాలి.
- రోడ్డుపై ఒక వాహనానికి.. మరో వాహనానికి మధ్య 50 అడుగుల దూరం ఉండాలి.
- మద్యం తాగి వాహనం నడపడం నేరం. ఇక ట్రిబుల్, ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదానికి కారణమవుతుంది.
- ఇక పాదచారులు రోడ్లపై నడిచేటప్పుడు ఎడమవైపునుంచి ఫుట్‌పాత్ పై నుంచి నడవాలి. రోడ్డును దాటాల్సి వచ్చిన క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, జీబ్రాక్రాసింగ్‌ల వద్ద మాత్రమే రోడ్డు దాటాలి.



అందరినీ చైతన్య పరుస్తున్నాం..

టి. జయపాల్‌రెడ్డి. సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్, వరంగల్.



జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతా నిబంధనలు తెలిసేలా, అందరిలో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల జరిగే పరిణామాలు, శిరస్త్రాణం లేకుండా బైకులు నడిపితే ప్రమాదాల బారిన పడే అవకాశాల గురించి తెలియజేశాం. ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు ట్రిబుల్ రైడింగ్, ర్యాష్‌డ్రైవింగ్ తదితర కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు మినీ టెలీఫిలింను ప్రదర్శించాం. వరంగల్ జిల్లాలో రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లు, రోడ్లపై రేడియం స్టిక్కర్లు, జీబ్రాక్రాసింగ్, తదితర గుర్తులను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులు, ఆర్టీఏ అధికారులు, సిబ్బందితో కలిసికట్టుగా ఈ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం.

అవగాహనతో ప్రమాదాల నివారణ

బి.చందన్, ఎస్ఐ, వర్ధన్నపేట



అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. ప్రతీ ఒక్కరు పోలీసులు, రవాణాశాఖ అధికారులు సూచించే భద్రతా నియమాలను పాటించాలి. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య ఎక్కువ కావడం అందరినీ కలిచివేస్తోంది. దీని పట్ల కనీస అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో వర్ధన్నపేట మండలంలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజలను చైతన్య పరచడంతో పాటు డ్రైవర్లను కూడా చైతన్యవంతులను చేస్తున్నాం. ఆర్థిక, సామాజిక, సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు రోడ్లపై బైకులు వేసుకుని తిరగడాన్ని కఠినంగా పరిగణిస్తాం.



సంకీర్తనా మండలి సమావేశంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి, వేదికపై మేయర్ గుండు సుధారాణి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వికాసతరంగిణి ప్రతినిధులు

నగరం.. ఆధ్యాత్మిక సౌరభం



- నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర • అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారుల కళాప్రదర్శనలతో హోరెత్తిపోయింది. వికాస తరంగిణి వరంగల్, హనుమకొండ శాఖల ద్వారా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల వరకు సంకీర్తన మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ర్యాలీని ప్రారంభించారు. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి ప్రాచీక కళారూపాలైన బోనాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలతో ఒక్కో కళారూపం ఒక్కో రకంగా ఏకరూప దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వికాస తరంగిణి కార్యకర్తలు మంగళ హారతులతో ర్యాలీలో పాల్గొన్నారు. కిలోమీటర్ల పొడవునా ర్యాలీ నేత్రపర్వంగా కొనసాగిన క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అయినా కళాకారులు ఉత్సాహంతో సంకీర్తనను ఆలపిస్తూ మిన్నంటే జైశ్రీమన్నారాయణ నినాదాలతో నృత్యాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఓరుగల్లు నగర చరిత్రలో ఆధ్యాత్మిక సౌరభంతో కూడిన అతి పెద్ద ర్యాలీగా సంకీర్తన మండలి ర్యాలీ కొనసాగింది.

హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలి..

భక్తి కళాసంఘాల ద్వారా హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలన్న లక్ష్యంతో తన ఆలోచనల ప్రతిరూపంగా సంకీర్తన మండలి ఆవిర్భవించిందని, దాని తొలి కార్యక్రమానికి బోణీగా ఓరుగల్లు నగరం నిలిచిందని పరమహంస పరివ్రాజక ఆచార్యుడు, సమతామూర్తి స్థాపకుడు, పద్మభూషణ్ చిన్నజీయర్‌స్వామి అన్నారు. 2001 సంవత్సరంలో కృష్ణం వందే జగద్గురుమ్, 2003 గీతా జ్యోతి కార్యక్రమాలకు ఓరుగల్లే బోణీగా ప్రారంభమై తెలుగు రాష్ట్రాల్లో విస్తరించాయని, అదే ఆనవాయితీగా తమ సంకీర్తనా మండలి హైందవ భక్తి కళామార్గాన్ని కూడా వరంగల్ నుంచే ప్రారంభింపజేస్తున్నట్లు ఆయన హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ప్రాచీన కళారూపాలను గౌరవించడంతోపాటు కళాకారులను ప్రోత్సహిస్తూ భావితరాల వారికి కళారూపాలను పదిలపర్చేందుకోసమే ఈ సంకీర్తన మండలి పని చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరిలో మానసిక శక్తిని పెంపొందింపజేసేవి సంకీర్తనేనని, వాటితోపాటు కళారూపాలు కూడా ప్రతీ మనిషిలో చైతన్యం నింపుతాయన్నారు. ప్రతీ కళారూపంలోనూ దైవత్వం దాగి ఉంటుందని, అందుకే ఏ కళారూపాన్ని తీసుకున్నా ధార్మిక చింతన ఉంటుందని చెబుతూ ప్రతీ కళారూపాన్ని ఈ తరం యువతకు అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనేక సంప్రదాయాల సమాహారమే హైందవ ధర్మమని, భగవంతుడితో భక్తుడికి అనుసంధాన సాధనం భక్తి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ఓరుగల్లు నగరం భక్తి ప్రవాహంలో మునిగిందని, చిడతలు, డప్పులు, కోలాటం, నృత్యం లాంటి ప్రదర్శనలు ఎన్నో తనకు ఆనందంగా కలిగింపజేశాయని చినజీయర్ స్వామి అన్నారు. ప్రతీ ఒక్కరిని భక్తిరసంలోకి తీసుకెళ్లి ఓలలాండింపజేసే గుణం ప్రతీ కళకు ఉంటుందన్నారు. అందులోని సాహిత్యాన్ని తీసుకొని కళారూపాన్ని సజీవంగా ప్రదర్శింపజేసేందుకు చదువు రాకున్నా కళాకారుల ప్రతిభ అద్భుతమని కితాబిచ్చారు. ఇక నుంచి సంకీర్తన మండలిని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింపజేస్తామన్నారు.

తొలుత దేవనాద జీయర్ స్వామి అధ్యక్షపాన్యాసం చేస్తూ.. ఆధ్యాతిక పునాదులపై సామాజిక సేవతోపాటు భక్తి కళామార్గం రూపొందించేందుకు ఓరుగల్లు వేదికగా కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఓరుగల్లుకు స్వామివారి రాకతోపాటు కళారూపాల ప్రదర్శన ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చిన కళాకారులతో పర్వదిన సందడి కనిపిస్తోందన్నారు. నేపాల్ కృష్ణమాచార్య, సముద్రాల శఠగోపాచార్య, నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆచార్య పి.జ్యోతి, వికాస తరంగిణి కేంద్ర కమిటీ పక్షాన మహేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. వరంగల్, హనుమకొండ వికాస తరంగిణిల చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, మురళీకృష్ణతో పాటు వికాస తరంగిణి నిర్వాహకులు చాడ సుభాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మురళీధర్‌రావు, తిరుమల్, ఉమా, ఆచార్య జ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదిక వద్ద తిరుమలగిరి నుంచి గంగిరెద్దులతో తరలివచ్చిన కళాకారుల విన్యాసాలను స్వామి ఆసక్తిగా తిలకించారు. గోమాత ప్రత్యేకతను తెలియచెబుతూ దానికి ఆహారాన్ని అందించారు. గిరిజన సంప్రదాయ ప్రదర్శన, చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన, చింతు యక్షగానం, కూచిపూడి కళా నృత్య ప్రదర్శనలు దేనికదే ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. ఈ కార్యక్రమం ప్రారంభంలో హనుమాన్ చాలీసాపై స్వామివారితో సహా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు చేసిన నృత్యంతో ఓరుగల్లు ఓలలాడింది.



కోలాటం ఆడుతూ భజనలు చేస్తున్న మహిళలు

'బాధిత మహిళలకు అండగా సఖీ సెంటర్'

బాలసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో హింసకు గురవుతున్న బాధిత మహిళలకు సేవలందించడానికి అండగా సఖీ సెంటర్ ఉంటుందని సఖీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సఖీసెంటర్ నిర్వహిస్తున్నట్లు మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, హింసల నుంచి రక్షణ కల్పించడానికి సఖీ వన్ స్టాప్ సెంటర్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని అన్నారు. మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ సహకారంతో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖీ సెంటర్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బాధిత మహిళలు సఖీ సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్ 181కి ఫోన్ చేసి నేరుగా సెంటర్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. సఖీ సెంటర్‌లో కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీసు సహాయం, న్యాయసహాయం, తాత్కాలిక వసతి ఐదు రకాల సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని దామోదర్ వివరించారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మిన్ ఎస్. హైమావతి, కౌన్సిలర్లు పావని, విజయలక్ష్మి, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, డీన్ సమ్మయ్య

ఆరోగ్య సమస్యలను అధిగమించాలి

కాకతీయ యూనివర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ప్రజల జీవనశైలితో అందరూ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటికి ఫార్మసీ రంగం సరైన ఔషధాలను కనుక్కోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ ఫార్మసీ కళాశాల నేతృత్వంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జాతీయ సదస్సు జరిగింది. కేయూ సెనెట్ హాల్‌లో రిసెంట్ అడ్వాసెస్ ఫార్మస్యూటికల్ సైన్స్ అనే అంశంపై జరిగిన సదస్సులో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫార్మసీ కళాశాలకు 50 ఏళ్లు నిండిన గొప్ప వారసత్వం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు ఉన్నారని చెప్పారు. యువ పరిశోధకులు ఔషధరంగంలో టాస్క్‌తో ముందుకుసాగాలన్నారు. అకాడమిక్, రిసెర్చ్‌పై శ్రద్ధ వహించాలన్నారు. ఫార్మసీలో డిటెన్షన్ విధానాన్ని వద్దనడం బాధాకరమన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి స్కిల్స్ పెంచుకోవాలని, అల్యూమినీ నెట్ వర్కింగ్‌ను విస్తృతం చేసుకోవాలన్నారు. నాందేడ్ శ్రీరామానంద్ తీర్థ మరాట్వాడా వర్సిటీ ఫార్మసీ ప్రొఫెసర్ శశికాంత్ సి.దవాలే 'ఇన్నోవేటివ్ డిస్కవరీ అప్రోచెస్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కంప్లిమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. హైదరాబాద్ నోవర్టిస్ శాస్త్రవేత్త ఎంసీపీ వేణుగోపాల్, నల్లా మల్లారెడ్డి ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ కృష్ణమోహన్ చిన్నాలలు మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించారు. కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఫార్మసీ రంగంలో ఇటీవల వచ్చిన మార్పులు, పరిశోధన అంశాలను వివరించారు. ఈ సదస్సులో బీవోఎస్ చైర్‌పర్సన్ జె.కృష్ణవేణి, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ వై. నర్సింహరెడ్డి, డాక్టర్ బి.నాగరాజు, ప్రొఫెసర్ ఎం.సారంగపాణి, ప్రొఫెసర్ వీరేశం, డాక్టర్ షయేదా పాల్గొన్నారు. సదస్సులో పరిశోధన పత్రాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఫార్మసీ పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకంలో సమస్త విజ్ఞానం

వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పుస్తకంలోనే సమస్త విజ్ఞానం దాగి ఉందని, విద్యార్థులు తమ జీవిత లక్ష్యాల సాధనకు పుస్తకాలను మెట్లుగా ఉపయోగించుకోవాలని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. గురువారం నిట్ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల పుస్తక ప్రదర్శనను ప్రొఫెసర్ సుబుధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 17 ప్రముఖ ప్రచురణ కర్తలు, పుస్తక సరఫరాదారులు, విక్రేతలు ఈ పుస్తప్రదర్శనలో పాల్గొంటున్నారని, ఇంజనీరింగ్ సైన్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, సామాజిక శాస్త్రాలు, హ్యూమనిటీస్ వంటి విభిన్న రంగాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శిస్తున్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లైబ్రరీ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శనలో అందుబాటులో ఉంచిన పుస్తకాలను వ్యక్తిగత వినియోగం కోసం అధ్యాపకులు, విద్యార్థులకు 28 శాతం ప్రత్యే రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిట్ లైబ్రేరియన్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సరికొత్త ప్రచురణలను అందుబాటులో ఉంచినందుకు విక్రేతలకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ లైబ్రేరియన్ డాక్టర్ వీరన్న, ఎం.శెట్టార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ జి.బాలక్రిష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు

జిల్లా రెవెన్యూ అధికారి గణేష్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 60 శాతం అంగ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం స్త్రీ, శిశు, వయోవృద్ధులు, వికలాంగుల శాఖ, వైద్య, ఆరోగ్య, విద్య, రెవెన్యూ శాఖల అధికారులతో దివ్యాంగుల హక్కు ల పరిరక్షణకు చేపట్టిన చర్యలపై అజెండా వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పూర్తి చేస్తామని, వికలాంగుల సంఘం కోరిన విషయాలను పైఅధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ఉపాధ్యాయ బదిలీలలో నిబంధనల మేరకు సదరన్ సర్టిఫికెట్ల ఆధారంగా ప్రాధాన్యత కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రత్యేక సమావేశం

కాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట సీపీఎం కార్యాలయంలో గురువారం పార్టీ నాయకుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య హాజరై మాట్లాడారు. కాజీపేటలో బస్టాండ్ వెంటనే నిర్మించాలని, రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్మాణాలతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేశ్, కె. మదన్‌చారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌లో సీసీ కెమెరాలను రద్దు చేయాలి

డీఐఈవోకు ప్రైవేటు కాలేజీల యాజమాన్యం వినతిపత్రం



డీఐఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షల్లో సీసీ కెమెరాలను రద్దు చేయాలని కోరుతూ ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు గురువారం హనుమకొండ డీఐఈవో గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరపాలని ఇంటర్ బోర్డు కొత్త నిబంధన పెట్టిందని, దీంతో ప్రాక్టికల్ పరీక్షలు రాసే విద్యార్థులు మానసిక ఆందోళనకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సీసీ కెమెరాల నిబంధన ఎత్తివేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రైవేట్ కాలేజీ యాజమాన్య ప్రతినిధులు వద్దిరాజు సత్యనారాయణరెడ్డి, షైన్ కుమార్, వడ్డకొండ వేణుగోపాల్‌గౌడ్, పెంతల అశోక్‌రెడ్డి, జక్కుల రాజు, లెక్కల రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, జనగాం శివ, కందకట్ల నరేందర్, ఐలి కర్నాకర్, సందీప్, జయపాల్‌రెడ్డి, మహేశ్, వెంకట్, కనకరాజు, భిక్షపతి, శ్రీరామ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రుక్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత మహాత్మాగాంధీకి ఘననివాళి

హసన్‌పర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ గ్రామాలతో పాటు పలు విలీన గ్రామాలలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 1వ డివిజన్‌లో కిట్స్ వాకర్స్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఆయా అధ్యక్షులు సంద్రు నాగేందర్, నాగమల్ల సుధీర్ అధ్యక్షతన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తిలో గాంధీ విగ్రహానికి, కిట్స్ మైదానంలో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి వాసవి క్లబ్, కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో..

● బాలసముద్రం: హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల పాఠశాలలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకోవాలని కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి పిల్లలకు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుచరిత, ఉపాధ్యాయినిలు వసుధ, హరిత, పిల్లలు పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో విధి నిర్వహణలో రాణించాలి : సీపీ

వరంగల్ క్రైం: గాంధీజీ స్ఫూర్తితో విధి నిర్వహణలో రాణించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. గురువారం కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అడుగు జాడల్లో నడిచి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

బల్దియా ప్రధాన కార్యాలయంలో..

వరంగల్ కార్పొరేషన్ : మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో అదనపు కమిషనర్ జోనాతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు గాంధీకి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ఆంగ్లేయుల పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన నాయకులలో బాపూజీ అగ్రగణ్యుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో రాజేష్, జేఏఓలు సరిత, జగదీశ్వరి, సూపరింటెండెంట్లు బాకం సంతోష్, దేవేందర్, రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహాత్ముడికి నివాళులర్పిస్తున్న అదనపు కమిషనర్, అధికారులు



గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న బైరపాక ప్రశాంత్, తదితరులు

హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం

బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

కేయూ క్యాంపస్ : ఎన్నికల్లో మోసపూరితమైన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజల తరఫున నిలదీస్తామని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ హెచ్చరించారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు హనుమకొండ గాంధీనగర్ టీవీ టవర్‌కాలనీలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, కంజర్ల మనోజ్‌కుమార్, అరూరి రంజిత్ మాట్లాడారు.

గత ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని 6 హామీలిచ్చారని ధ్వజమెత్తారు. 2 లక్షల ఉద్యోగాలు, రైతుబంధు, ఉచిత గ్యాస్ ఇందిరమ్మ ఇండ్లు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఎలక్ట్రికల్ స్కూటీలు, మహిళ, నిరుద్యోగ భృతి అమలు కావడం లేదన్నారు. అమరవీరుల కుటుంబాలకు పించన్లు లేవన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతోనూ అబద్ధపు హామీలిచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ 420 హామీలు అమలు చేయాలని ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు నల్లా సుధాకర్‌రెడ్డి, జెట్టి రాజేందర్, రూరల్ జిల్లా ఆర్డినేటర్ లంకా రాజగోపాల్, పోచంపల్లి రఘు, గొల్లపల్లి వీరాస్వామి, అర్షం మధుకర్, రాజేశ్, పవన్, అహ్మద్, శ్రీకాంత్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి సభకు జమాతే ఇస్లామి హింద్ మద్దతు

వడ్డెపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు జమాతే ఇస్లామి హింద్ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు అబ్దుల్ హన్నన్ తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జిల్లా నాయకులు మహ్మద్ అబ్దుల్ అలీమ్, మహ్మద్ రఫీక్‌లు మాట్లాడారు. తరతరాలుగా బీసీలు అసమానతలకు, వివక్షతకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తహసీన్, సైఫుల్లా, ఎండీ షంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలు బీసీ యుద్ధభేరి సభకు తరలి రావాలి

ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు వడ్డెర కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఇంటి కొక్కరు స్వచ్ఛందంగా తరలి రావాలని వడ్డెర సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుంజ స్వామి పిలుపు నిచ్చారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు గడిచినా బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే అగ్రవర్ణ పాలకులు వినియోగించుకుంటున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో వడ్డెర సంఘం జిల్లా నేతలు బొంత సుధాకర్, ఓర్సు మహేష్, గండికోట రాజు, ఆలకుంట అశోక్, భద్రయ్య, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ మెడికల్ : ఫిబ్రవరి 2వ తేదీన సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని డాక్టర్ కూరపాటి రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం ఆఫీసర్స్ క్లబ్‌లో బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్స్ ఫోరమ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ, బీసీ డాక్టర్స్ ఫోరం వరంగల్ బాధ్యులు డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. యుద్ధభేరి సమావేశాన్ని విజయవంతం చేయడంలో వరంగల్ డాక్టర్స్ చాలాముఖ్య పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బీసీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు బీసీ రాజ్యాధికారంతోనే సాధ్యమన్నారు. కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకరం మేమెంతో.. మాకంత.. నినాదంతో అగ్రవర్ణాల ఆధిపత్యం పోవాలంటే బీసీలందరూ ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రాజు, డాక్టర్ తాళ్ల రవి, డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన 100 మంది డాక్టర్స్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఐజేయూ లక్ష్యం

వడ్డెపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సంక్షేమమే ఐజేయూ లక్ష్యమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ కార్యవర్గ సమావేశంలో 2025 డైరీని ఆవిష్కరించారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, యూనియన్ నేతలు దాసరి కృష్ణారెడ్డి, గాడిపెల్లి మ .దు, వల్లాల వెంకటరమణ, గడ్డం కేశవమూర్తి, కే సంతోష్, తోట సుధాకర్, పిన్న శివకుమార్, బుచ్చిరెడ్డి, నహీం పాషా తదితరులు పాల్గొన్నారు.

పద్మ విభూషణ్ అవార్డు గ్రహీతకు సన్మానం



నాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రవాసిరెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు

న్యూశాయంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పద్మ పురస్కారాలలో పద్మ విభూషణ్ అవార్డు పొందిన గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నూకల అంజివర్ధన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ.. మూడు పద్మ పురస్కారాలు పొందడంతో పాటు వైద్య రంగంలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగేశ్వర్‌రెడ్డి జాతికే గర్వకారణమన్నారు. నాగేశ్వర్‌రెడ్డి భవిష్యత్‌లో మరెన్నో అవార్డులు తెచ్చుకోవాలన్నారు. సన్మానించిన వారిలో నేతాని శ్రీనివాస్‌రెడ్డి, మర్రి యాదవరెడ్డి, బీరెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, రఘుపతిరెడ్డి, కేశవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంజీఎంలో ఉచిత గుండె వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో వచ్చే గుండె సంబంధిత వ్యాధులను డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ (డీఈఐసీ) సెంటర్ ద్వారా గుర్తించి వారికి గుండె పరీక్షలు, ఆపరేషన్ చేయించినట్లయితే వారి భవిష్యత్‌కు మంచి బాటలు వేసిన వారమవుతాయని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. గురువారం ఎంజీఎంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటరులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్లలోపు ఉన్న పిల్లలు ఉమ్మడి వరంగల్ నుంచి సుమారు 218 మంది పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. చాలామంది పిల్లలకు 2డీకో పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ తమాసి, మేనేజర్ అభిషేక్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, డీఐవో డాక్టర్ ఐ.ప్రకాశ్, డాక్టర్ అంబి శ్రీనివాస్, డాక్టర్ రవీందర్, డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

ప్రొఫెసర్ జ్యోతి మృతి తీరనిలోటు

కేయూ క్యాంపస్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేయూ ఆర్ట్స్ విభాగం డీన్, తెలుగు శాఖాధ్యక్షురాలు ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి మృతి వర్సిటీకి తీరని లోటని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ తెలుగు విభాగం సెమినార్ హాల్‌లో ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి సంస్మరణ సభ కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం, ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి భర్త మంద జానయ్య, ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు, డాక్టర్ చిర్రా రాజు గౌడ్, డాక్టర్ కొట్టే భాస్కర్‌లు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ జ్యోతి నిబద్ధత, నిజాయితీ, అంకితభావం కలిగినవారని కొనియాడారు. జ్యోతి తెలుగు విభాగానికి, వర్సిటీకి అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చింతకింది కాశీం ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. పేదరికం నుంచి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగిన జ్యోతి జీవితంలో ఎన్నో అటుపోట్లను అధిగమించారని చెప్పారు. ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ మాట్లాడుతూ.. వర్సిటీలో అనేక పదవులకు సమర్ధవంతంగా నిర్వహించి వన్నెతెచ్చారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, ప్రొఫెసర్ పంతంటి వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ.. జ్యోతి ప్రొఫెసర్‌గా, అడ్మినిస్ట్రేటర్‌గా, సామాజిక సేవల్లో ముందుండేదని చెప్పారు. వర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్ మాట్లాడుతూ.. జ్యోతి ఎందరో విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపిందన్నారు. జ్యోతి భర్త మంద జానయ్య తన జీవిత నేపథ్యం, ఎదిగిన తీరును వివరించారు.

విద్యార్థుల్లో జ్యోతి నింపిన స్ఫూర్తితో జీవితంలో ఎదగాలని సూచించారు. సభలో కేయూ ఎస్డీఎల్‌సీఈ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ మంథని శంకర్, స్కాలర్లు, విద్యార్థులు తమ అనుభవాలను వెలుబుచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జ్యోతి కుటుంబ సభ్యులు, స్కాలర్లు, విద్యార్థులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అందరి మద్దతు

హసన్‌పర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టుగుట్ట బాలాజీ గార్డెన్స్‌లో ఎస్సీ వర్గీకరణ అమలుపై పార్టీలకతీతంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు..వేల గొంతుకలు' ప్రదర్శన సభకు మద్దతుగా నిలుస్తామని ప్రజా సంఘాల ప్రతినిధులు సభలో ప్రకటించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, వరంగల్ జిల్లా సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి మిట్టపల్లి సురేందర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్‌లు మాట్లాడారు. బీసీ జేఏసీ చైర్మెన్ అనుమాండ్ల విద్యాసాగర్, బీసీ నాయకుడు గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, బీసీ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయీస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్, బొడ్డు దయాకర్‌మాదిగ, పుట్ట భిక్షపతి, ఆరెపల్లి పవన్, రాజారపు భిక్షపతి, రేణికుంట్ల దుర్గాప్రసాద్, మేకల రమేష్, బోడ యుగంధర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి బల్లార్షా, పుష్‌పుల్ రద్దు

కాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల దృష్ట్యా ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు కాజీపేట - బల్లార్షా, అప్ అండ్ డౌన్ పుష్‌పుల్ రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా భద్రచలం నుంచి బల్లార్షా వెళ్లే సింగరేణి అప్ అండ్ డౌన్ రైలును ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. మార్చి 1 తర్వాత యథావిధిగా నడుస్తాయని చెప్పారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పొగాకు ఉత్పత్తులు, గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మడికొండ పీఎస్ పరిధిలో ఎరుకుల రాజేశ్వర్‌రావు గోదాం నుంచి రూ. 14,000 విలువ చేసే పొగాకు ఉత్పత్తులు, విష్ణుపురిలోని దిండి చందు నుంచి రూ.12,600 విలువ చేసే గుట్కాలను స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

కాళ్లు పట్టుకున్నా కనికరించరా ?

- చెత్త డంపింగ్ యార్డు బాధితుల ఆవేదన
- అధికారుల కాళ్లు పట్టుకుని వేడుకున్న డంపింగ్ బాధితులు

మడికొండ, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): మడికొండ శివారులోని చెత్త డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న విషపూరితమైన రసాయనాలతో కూడిన పొగ పరిసర గ్రామాలను కమ్మేసి ఊపిరాడకుండా చేస్తోందని, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడుతున్నారని బాధితులు ఆందోళన చెందుతున్నారు. అనేకసార్లు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా తరలిస్తామని హామీలిస్తూ కాలయాపన చేస్తున్నారని, సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు. ఈక్రమంలో బాధితులు సమస్య పరిష్కారం కోసం కమిటీగా ఏర్పడి పలు విధాలుగా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. గురువారం డంపింగ్ యార్డును పరిశీలించేందుకు వచ్చిన మునిసిపల్ అధికారులను బాధితులు చుట్టుముట్టి నిర్బంధించారు. సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ హామీ ఇస్తేగాని అక్కడి నుంచి కదిలేది లేదని అక్కడే బైఠాయించి ఫ్లకారులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో బాధితుడు దువ్వ నవీన్ అధికారుల కాళ్లు పట్టుకొని డంపింగ్ యార్డును తరలించి తమ ప్రాణాలను కాపాడండి అంటూ ప్రాధేయపడ్డాడు. రెండు గంటల పాటు బాధితుల ఆందోళనతో మునిసిపల్ ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఎంహెచ్‌వో రాజారెడ్డి దిగి వచ్చి మూడు నెలల్లోగా మరి కొన్ని చోట్ల చెత్త డంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి చెత్త వాహనాలను అక్కడకు రాకుండా చూస్తామని, అలాగే ప్రస్తుతం అక్కడ గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువుగా మారుస్తామని తెలిపారు.



మడికొండ శివారులోని డంపింగ్ యార్డు వద్ద బైఠాయించిన బాధితులు

అనంతరం ఆ చోట చెట్లు పెంపకం చేపట్టి డంపింగ్ సమస్య పూర్తిగా తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులు హామీతో బాధితులు శాంతించి ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హక్ కమిటీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, దువ్వ నవీన్, పొగేటి వెంకట్రావు, బొల్లికొండ వినోద్, గడ్డం మహేందర్, బోగి మహేందర్, తక్కళ్లపల్లి రామ్మోహన్‌రావు, గడ్డం చంద్రమౌళి మహిళలు పాల్గొన్నారు. ఘటనా స్థలానికి మడికొండ ఎస్సై రాజ్ కుమార్, ఏఎస్సై చంద్రమౌళి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

పర్వదినం

సకల విద్యాప్రదాయిని



సర్వశక్తిమయి అయిన జగదంబను వాక్కు, బుద్ధి, జ్ఞానాల స్వరూపిణిగా భావన చేస్తే... ఆ రూపమే సరస్వతీ దేవి. ఆమెను ఆరాధించే గొప్ప పర్వదినం మాఘ శుద్ధ పంచమి. దీనినే 'శ్రీ పంచమి' అని కూడా అంటారు. సరస్వతీదేవిని 'జ్ఞానం దేహి స్మృతి దేహి విద్యాం విద్యాధిదేవతే ప్రతిష్ఠాం, కవితాం దేహి శక్తిం శిష్య ప్రబోధితాకామ్' అని 'బ్రహ్మవైవర్త పురాణం' వర్ణించింది. "విద్యాధిదేవత అయిన సరస్వతీ దేవి జ్ఞానాన్ని, జ్ఞాపకాన్ని ప్రసాదించే తల్లి. విద్యను, ప్రతిష్ఠను, కవితాశక్తిని ఆమె అనుగ్రహిస్తుంది. శిష్యులను జ్ఞానవంతులుగా చేసే శక్తిని సమకూరుస్తుంది" అని భావం.

ప్రాణశక్తి, జ్ఞాన శక్తి...

ప్రతిభ, మేధ, శ్రద్ధ, స్ఫురణ, సాహిత్య సంగీతాది కళా నైపుణ్యాలు సరస్వతీ గుణాలు. పూర్వం గురువులు 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ప్రార్థన చేయించిన తరువాత విద్యార్థులకు బోధన ప్రారంభించేవారు. అక్షరాభ్యాసానికి ముందు సరస్వతిని పూజించి, పలక మీద బలపంతో శివ పంచాక్షరిని రాయించే ఆనవాయితీ ఉంది. బ్రహ్మదేవుడు సరస్వతిని ఆరాధించి, జ్ఞానాన్ని పొంది... సృష్టిని ఆరంభించాడని పురాణాలు చెబుతున్నాయి. వాణి, భారతి, వీణాపాణి, విద్యావాచస్పతి, వాగ్దేవి, బుద్ధిధాత్రి, ప్రజ్ఞ... ఇలా ఆమెకు సహస్రాధికంగా పేర్లు ఉన్నాయి. లౌకికమైన విద్యలకు, పారమార్థికమైన బ్రహ్మవిద్యకు అధినేత్రి సరస్వతి. భ్రమ, బుద్ధిమాంద్యం, మతిమరపు, వాక్కులో లోపాలు తదితరాలను సమూలంగా నశింపజేస్తుంది కాబట్టి 'నిశ్శేష జాడ్యాపహా' అని సరస్వతీదేవిని వర్ణించారు. వేదాల్లో సరస్వతీ సూక్తాలు ఉన్నాయి. ప్రాణ శక్తిగా, జ్ఞానశక్తిగా పూర్వులు సరస్వతిని ఆరాధించారు. 'యా బ్రహ్మాచ్యుత శంకరః ప్రభృతిభిః దేవైః సదా పూజితా..' సరస్వతీ దేవిని సర్వ దేవతలూ పూజిస్తారు.

నాటి వ్యాసపురి... నేటి బాసర


పురాణ గ్రంథాల ప్రకారం... వాల్మీకి మహర్షి... సరస్వతిని ఉపాసించి రామాయణ మహా కావ్య రచన చేశాడు. ఆ బాటలోనే వ్యాస మునీంద్రుడు కూడా నడచి వేదవిభజన చేశాడు. పురాణాలను ఆవిష్కరించి, మహా భారత, భాగవత, బ్రహ్మసూత్రాది రచనలు చేసి... భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ఆచార్యుడు అయ్యాడు. సరస్వతీ దేవిని సాక్షాత్కరించుకున్న వ్యాసుడు ఆ తల్లి ఆజ్ఞపై పరమ పావన గోదావరీ తీరంలోని వాసర క్షేత్రంలో ఆమెను సైకత మూర్తిగా ప్రతిష్ఠించాడు. ఆ రోజు మాఘ శుద్ధ పంచమి అనీ 'దేవీ భాగవతం' తదితర గ్రంథాలు పేర్కొంటున్నాయి. వ్యాసపురిగా ప్రసిద్ధి చెందిన ఆ క్షేత్రం అనంతర కాలంలో 'బాసర'గా ప్రాచుర్యం పొందింది. సరస్వతీ కృపతోనే అపారమైన తత్త్వ విజ్ఞానాన్ని పొందానని చెప్పిన ఆది శంకరులు శృంగేరిలో శారదామాతను ప్రతిష్ఠించి, ఆరాధించారు. యాజ్ఞవల్క్యుడు గురు శాపం కారణంగా అభ్యసించిన విద్యలన్నిటినీ కోల్పోయాడు. సూర్యుడి సూచనల మేరకు సరస్వతిని ఉపాసించి ఆమె కరుణను పొందాడు. మళ్ళీ విద్వాంసుడయ్యాడు.

మాఘ శుద్ధ పంచమి రోజున జన్మించిన సరస్వతీ దేవి తెలుపు వర్ణంలో వెలుగులీనుతూ ఉంటుంది. ఆమెకు ఇష్టమైన రంగు తెలుపు. తెల్లని పద్మం ఆమె పీఠం. హంస ఆమె వాహనం. తెల్లని పుష్పాలు ఆమెకు ఇష్టం. తెల్ల రంగు వస్త్రాలతో ఆమెను అలంకరించి, పూజించి, తెల్లని పాయసాన్ని నివేదిస్తే అనుగ్రహిస్తుందని పెద్దలు చెప్పారు. పుస్తక ధారిణి అయిన సరస్వతిని పుస్తక రూపంలోనూ పూజించవచ్చు. గాయత్రిగా, సావిత్రిగా, పరాశక్తిగా శ్రుతులు పేర్కొన్న సరస్వతిని శ్రీపంచమినాడు భక్తితో అర్చిస్తే సర్వ శుభాలు చేకూరుతాయనేది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

మౌనమే ఆయన సందేశం...

"నేను మేలుకొలుపడానికే కాని బోధించడానికి రాలేదు" అని ప్రకటించిన సద్గురువు అవతార్ మెహెర్‌బాబా. ఆయన 44 ఏళ్ళ పాటు సుదీర్ఘ మౌన దీక్షలో గడిపారు. దేశ, విదేశాల్లో పర్యటించినప్పుడు, ప్రమాదాలకు గురై చికిత్స పొందుతున్న సమయంలో కూడా ఆయన మౌనాన్ని విడిచిపెట్టలేదు. మౌనమే తన సందేశంగా జీవించారు. అయితే తాను మౌనాన్ని ఒక ప్రతిజ్ఞలా కానీ, తపోదీక్షగా కానీ చేపట్టలేదనీ, విశ్వకళ్యాణం కోసమే చేపట్టాననీ ఆయన స్పష్టం చేశారు. "మీరు చూస్తున్న ఈ ప్రపంచం అంతా ఒక మిథ్య. ఇదంతా ఒక కల. ఈ నిజాన్ని మీరు తెలియజేయడం కోసమే మెహర్‌బాబాగా మీ మధ్యకు వచ్చాను. ఈ సత్యం తెలుసుకోవాలంటే మీకు భగవంతుడి కృప కావాలి. నిరంతర భగవన్నామ స్మరణ ద్వారానే అది లభిస్తుంది. తద్వారా మంచి కర్మలు చేపట్టడం, మంచి సంస్కారాలు పొందడం, క్రమేణా జన్మ రాహిత్యం, భగవంతుడిలో ఐక్యం కావడం సులువవుతుంది" అని చెప్పారు.



ఇన్ని మతాలు ఎందుకు?

'ప్రపంచంలో ఎన్నో మతాలు ఉన్నాయి. అసలు ఇన్ని మతాలు ఎందుకు?' అనే విషయం గురించి మెహెర్‌బాబా మాట్లాడుతూ "వివిధ కాలాల్లో ఆవిర్భవించిన ఆ అవతార పురుషుడు మతాలను ప్రజలకు వరంగా ఇచ్చాడు. ప్రజల మనసులను భగవంతుడి వైపు మరల్చడానికే మతాలను సృష్టించాడు. మరి 'ఒక్కో మతం ఒక్కో రకంగా ఎందుకు ఉంది? అన్ని మతాలు ఒకేలా ఎందుకు లేవు?' అంటే... బుద్ధుడి కాలం వేరు, మహమ్మద్ ప్రవక్త కాలం వేరు. తమ అవతార కాలంలోని పరిస్థితులకు తగినట్టు, ప్రజల మానసిక పరిపక్వతకు తగినట్టు వారు తమ బోధనలు చేశారు. మార్గనిర్దేశకత్వం చేశారు. కాబట్టి అన్ని మతాలూ ఒక్కటే" అని ఆయన చెప్పారు. "నేను ప్రత్యేక మతాన్ని స్థాపించడానికి రాలేదు. నా మతం పేరు 'ప్రేమ మతం'. నేటి మానవాళికి అవసరమైనది ప్రేమ" అని వెల్లడించారు. "నిస్వార్థ సేవ, ప్రేమ... ఈ రెండూ దైవీ గుణాలు. ఆధ్యాత్మిక పథంలో అత్యాశ, కామం, పరోక్ష నిందలు అత్యంత ప్రమాదకరమైనవి. తోటి మానవులను ప్రేమించడం భగవంతుణ్ణి ప్రేమించడానికి తొలిమెట్టు. కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించడం నిజమైన, స్వచ్ఛమైన ప్రేమకు చిహ్నం. ఇతరుల మేలు కోసం మీరు ప్రార్థిస్తే... మీకు కూడా తప్పకుండా మేలు జరుగుతుంది" అని తెలిపారు.

ప్రశ్నలన్నిటికీ జవాబు...

మెహెర్‌బాబా శిష్యులలో ఒకరైన జి.ఎస్.ఎన్.మూర్తి నిత్యం భగవద్గీత పారాయణం చేస్తూ ఉండేవారు. బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులలోని వేదాంతపరమైన కొన్ని అంశాలను బాబాను అడిగి తెలుసుకుందామని ఆయన అనుకున్నారు. తన సంశయాలన్నిటినీ ఒక కాగితం మీద టైప్ చేసి తీసుకువెళ్ళారు. బాబా ఎదుట కూర్చొని... ప్రశ్నించడానికి తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈలోగా బాబా తన ఎదురుగా ఉన్న ఒక చిన్న పుస్తకాల కట్టలోంచి ఒక పుస్తకాన్ని తీసి... మూర్తికి ఇచ్చారు. ఆ పుస్తకంలోని అక్షరాలను తన చూపుడువేలుతో చూపిస్తూ... వాటిని చదవమన్నారు. ఆ అక్షరాలను మూర్తి చదువుతూ ఉంటే... తన ప్రశ్నలన్నిటికీ జవాబు దొరికినట్టయింది. ఆ పుస్తకాన్ని కొనుక్కుందామని మూర్తి నిశ్చయించుకున్నారు. అప్పుడు బాబా "ఏం ఆలోచిస్తున్నావ్?" అని అడిగారు. "ఏమీ లేదు" అన్నారు మూర్తి. బాబా ఆ పుస్తకాన్ని మూర్తికి బహుమతిగా ఇస్తూ "దీన్ని ఎప్పుడూ నీదగ్గరే ఉంచుకో. ఇకపై నీకు ఇదే భగవద్గీత. దీన్ని ప్రతిరోజూ పఠించు. నీ ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి" అని చెప్పారు.

నేడు అమరతిథి...


అవతార్ మెహెర్‌బాబా 1969 జనవరి 31న దేహ త్యాగం చేశారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు అయిదు కిలోమీటర్ల దూరంలోని మెహెరాబాద్‌లో చిన్న కొండపై ఆయన సమాధి ఉంది. నేడు (జనవరి 31న) ఆయన 56 అమరతిథిని భక్తులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12.00 నుంచి 12.15 వరకూ... ఆయనను స్మరిస్తూ వారు మౌనం పాటిస్తారు.

• డాక్టర్ మల్లాది కృష్ణానంద్, 9959553218

ముక్తి మార్గదర్శి

ఫిబ్రవరి 6న
శ్రీ మధ్వనవమి

భగవత్ తత్త్వాన్ని మానవులకు బోధించి, వారిని ముక్తి మార్గం వైపు నడిపించడానికి ఈ లోకంలో అవతరించిన మహనీయుడు శ్రీమధ్వాచార్యులు. హనుమంతుడు, భీముడి అవతారాల అనంతరం... వైష్ణవతత్త్వం తాలూకు సత్యమైన రూపాన్ని తిరిగి ప్రతిష్ఠించడం కోసం... వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా ఇలపై అవతరించాడు. మహిమాన్వితుడైన ఆయన జీవిత చరిత్రను తెలిపే అపూర్వమైన గ్రంథం 'శ్రీ సుమధ్వ విజయం'. త్రివిక్రమ పండితాచార్యుల కుమారుడు నారాయణ పండితాచార్యులు రచించిన ఈ గ్రంథం పదహారు సర్గలలో... 1,008 శ్లోకాలను కలిగి ఉంది. ఈ గ్రంథ పారాయణం వల్ల పుణ్యమే కాదు, సంసార బంధ విముక్తి కూడా లభిస్తుందని భక్తుల విశ్వాసం. గ్రంథకర్త అయిన నారాయణ పండితాచార్యులే 'శ్రీ సుమధ్వ విజయా'న్ని సంక్షిప్తంగా, భక్తుల పారాయణకు అనుకూలంగా ఉండేలా 'ప్రమేయ నవమాలిక' పేరుతో రచించారు. దానిని 'అణుమధ్వ విజయం' అని పిలుస్తారు. దీనికి అద్భుతమైన వ్యాఖ్యానం రాసినందుకే శ్రీ రాఘవేంద్రస్వామికి ద్వైత సామ్రాజ్యం అనే భాగ్యం దొరికిందని శ్రీ వాదీంద్రతీర్థులు తన 'గురుగుణస్తవనం'లో పేర్కొన్నారు.



సాక్షాత్తూ వాయుదేవుడే...

శ్రీమధ్వాచార్యులు భగవద్గీతకు భాష్యంతో తన గ్రంథ రచన ఆరంభించారు. ఆ గ్రంథాన్ని బదరీనాథుడికి సమర్పించారు. ఈ సందర్భంగా బదరిలో 48 రోజుల పాటు 'కాష్ఠమౌన వ్రతా'న్ని ఆచరించారు. అంటే ఆహార, పానీయాలు లేకుండా కట్టెలా కదలకుండా, మౌనంగా ధ్యానం చేస్తూ, ప్రవచనాలకోసం మాత్రమే నోరు విప్పడం. వ్యాసభగవానుడు ఈ కఠినమైన వ్రతానికి ప్రసన్నుడయ్యాడు. మధ్వాచార్యుల వద్దకు వచ్చి, తన బదరికా ఆశ్రమానికి రావాలని ఆదేశించాడు. ఆ ఆశ్రమం ఊర్ధ్వబదరిలో ఉంది. హిమాలయాల్లో అతి ఎత్తైన చోట, ఆకాశాన్ని తాకుతున్నట్టు ఉండే పొడవైన, దట్టమైన చెట్ల మధ్య, రక్తాన్ని గడ్డకట్టించే మంచుతో నిండిన ఆ ప్రదేశాన్ని చేరుకోవడం చాలా కష్టం. మరునాడు ఉదయం తన అనుష్ఠానాలను ముగించుకున్న మధ్వాచార్యులు... శిష్యులందరినీ అక్కడే ఉండమని చెప్పి, ఒంటరిగా ఊర్ధ్వ బదరికి బయలుదేరారు. గురువును విడిచి ఉండలేని సత్యతీర్థులు అనే శిష్యుడు ఆయనను అనుసరించాడు. మధ్వాచార్యులు... హనుమంతుడిలా తన శరీరాకృతిని పెంచుకొని, ఒక కొండపైనుంచి మరో కొండపైకి అడుగులు వేస్తూ ఎంతో వేగంగా నడుస్తున్నారు. సత్యతీర్థులు ఎంత వేగంగా పరుగెత్తినా ఆయనను అందుకోలేకపోతున్నాడు. చివరికి నిస్సహాయుడై... గురువును గట్టిగా పిలిచాడు. అప్పుడు మధ్వాచార్యులు వెనక్కి తిరిగి చూసి, తన చెయ్యి విదిలించారు. ఆ గాలికి సత్య తీర్థుడు పువ్వులా ఎగిరి, మళ్ళీ మఠంలోకి వచ్చి కూర్చున్నాడు. మధ్వాచార్యులు, వాయుదేవుడు ఒక్కరే అనడానికి ఇదొక ఉదాహరణ. ఇక... మధ్వాచార్యులు రచించిన 'బ్రహ్మసూత్ర భాష్యం'లో అర్థ గాంభీర్యం లాంటివి అనంతంగా ఉంటాయి. వాటిలో 'అనువ్యాఖ్యానము' అత్యంత విశిష్టమైనదే కాదు, ఆయన గ్రంథాలన్నిటికీ మణిహారం లాంటిదని పండితులు ప్రస్తుతించారు. మందర పర్వతాన్ని కవ్వంగా ఉపయోగించి, క్షీరసాగరాన్ని మథించి, దానినుంచి అమృతభాండాన్ని వెలికి తీసినట్టు... మహాభారతాన్ని మధ్వాచార్యులు మథించి 'మహాభారత తాత్పర్య నిర్ణయం' అనే తత్త్వ గ్రంథాన్ని రచించారు.

మధ్వ నవరాత్రులు...

మాఘ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకూ... తొమ్మిది రోజులను మధ్వ నవరాత్రులుగా పరిగణిస్తారు. జగద్గురువైన శ్రీ మధ్వాచార్యులు భగవంతుని ఆదేశం ప్రకారం పవిత్రమైన భరత భూమిలో జన్మించారు. జిజ్ఞాసువులకు అమూల్యమైన తత్త్వ భాండాగారాన్ని అందించారు. ఉడిపిలోని అనంతేశ్వర దేవాలయం నుంచి బదరికి ఆయన పయనించిన రోజు మధ్వ నవమి. ఆ రోజున ఆయన తన శిష్యులకు ఉపదేశం చేస్తూ ఉండగా... ఆకాశం పుష్ప వర్షం కురిసింది. అప్పుడే మధ్వాచార్యులు అదృశ్యం అయ్యారు. ఊర్ధ్వబదరిలో వేదవ్యాసుని దగ్గర జ్ఞానసాధన చేస్తూ... ఇప్పటికీ ఆయన అక్కడే ఉన్నారనేది భక్తుల నమ్మకం. శ్రీమధ్వ నవమి రోజున మధ్వాచార్యులు రచించిన గ్రంథాలను భక్తులు రథాలలో ఉంచి, అత్యంత వైభవంగా ఊరేగిస్తారు.


• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

వివేకవాణి

దేవుడి ఉనికికి రుజువేదీ?

భారతీయత తాత్త్వికతను విశ్వవ్యాప్తం చేయడానికి పరిశ్రమించిన మహనీయుడు స్వామి వివేకానంద. కోల్‌కతాలోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన ఆయనకు తల్లితండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్. చిన్న వయసునుంచే ఆయన ఆటపాటల్లో, చదువులో చురుగ్గా ఉండేవారు. గణితం, చరిత్ర, ఫిలాసఫీలో పట్టభద్రుడయ్యాక, న్యాయ విద్యను అభ్యసించారు. కళాశాలలో చదువుతున్నప్పుడే... శ్రీ రామకృష్ణ పరమహంసను కలుసుకున్నారు. అప్పటికి వివేకానందుడి వయసు పద్దెనిమిదేళ్ళు. నాటినుంచి శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో తనను తాను తీర్చిదిద్దుకున్నారు.

వివేకానందుడు ఎల్లప్పుడూ తార్కికంగా ఆలోచించేవారు. తనకు ప్రశ్నగా అనిపించిన ప్రతిదానికీ సరైన సమాధానాన్ని కోరుకొనేవారు. ఒక రోజు ఆయన శ్రీరామకృష్ణుల దగ్గరకు వచ్చి "మీరు ఎప్పుడూ దేవుడు గురించి మాట్లాడుతూ ఉంటారు. కానీ దేవుడున్నాడని రుజువేమిటి? అలాంటి రుజువు ఏదైనా ఉంటే నాకు చూపించండి" అని అడిగారు.



శ్రీరామకృష్ణులు నవ్వుతూ "దేవుడు ఉన్నాడనడానికి నేనే రుజువు" అన్నారు. ఆ మాటకు తక్షణమే ఏ జవాబు ఇవ్వాలో వివేకానందుడికి తెలియలేదు. అక్కడినుంచి వెళ్ళిపోయారు. మూడు రోజుల తరువాత మళ్ళీ గురువు దగ్గరకు వచ్చి "దేవుడు ఉన్నాడనడానికి మీరే రుజువని చెప్పారు. మరి నాకు దేవుణ్ణి చూపించగలరా?" అని ప్రశ్నించారు.

"దేవుణ్ణి చూసే ధైర్యం నీకుందా?" అని అడిగారు శ్రీరామకృష్ణులు. ఉంది అన్నారు వివేకానందుడు.

అప్పుడు శ్రీరామకృష్ణులు తన కాలిని చాపి... ఎదురుగా కూర్చున్న వివేకానందుడి ఛాతీ మీద పాదాన్ని పెట్టి నొక్కారు. తక్షణం వివేకానందుడిలో ఏదో కలవరం కలిగింది. సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. అలా దాదాపు పన్నెండు గంటల సేపు ఆ స్థితిలోనే ఉండిపోయారు. దైవం ఉనికి గురించి సందేహంతో సహా వివేకానందుడి మనసులో ఉన్న ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికింది. పరిపూర్ణమైన జ్ఞానం, అవగాహనతో ఆ స్థితి నుంచి బయటకు వచ్చారు.

ఆ తరువాత... వివేకానందుడు తన జీవితంలో గురువును మరో ప్రశ్న ఎప్పుడూ అడగలేదు. శ్రీరామకృష్ణుల సందేశాన్ని ప్రపంచమంతటా చాటిచెప్పారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువతరం ఈ దేశానికి అవసరం" అని ప్రకటించిన వివేకానందుడి స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా మన దేశం జరుపుకొంటోంది.

చింతన

మాయలో మైమరచిపోవద్దు

మనం బాగా చదువుకుంటే పెద్దయ్యాక బాగా డబ్బు సంపాదించవచ్చని ఎంతో మంది పెద్దలు మనకు చిన్నతనం నుంచి బాగా నూరిపోస్తారు. ఆ ధోరణితోనే మనం పెరిగి పెద్దవుతాం. అదే మనకు మహామంత్రంలా మారిపోతుంది. 'ఇది చేయాలి, అది చేయాలి, ఏదో చేయాలి' అని పరితపిస్తూ ఉంటాం. కానీ మనం తప్పనిసరిగా నెరవేర్చుకోవాల్సిన కల ఏమిటి? మనం గమనించినట్టయితే... వాస్తవానికి మన అందరి కలా ఒక్కటే. జీవితం సుఖ సంతోషాలతో సాగిపోవాలన్నదే మనందరికీ ఉన్న అతి సరళమైన వాంఛ. కానీ ఈ చిన్న విషయాన్ని అందరూ ఎంతో సులువుగా మరచిపోతున్నారు.

శాంతి కొరవడితే...

అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే - మనం లోపల సంతృప్తిగా ఉన్నట్టయితే, ఏ విషయంలోనూ గొడవపడం. అంటే, మనిషికి మౌలిక అవసరాలు తీరడం ముఖ్యం. అవే తీరని స్థితిలో ఉంటే మనిషికి తాను పేదవాణ్ణనే భావన కలుగుతుంది. ఆఫ్రికాలో నేనొక విషయం గమనించాను. అక్కడ కొంతమంది చిన్న పిల్లలు... వాళ్ళ కాళ్ళకు చెప్పులు ఉండవు. చిరిగిన దుస్తులతో, చింపిరి జుత్తుతో కనిపిస్తారు. కానీ ఒక సైకిల్ చక్రం తీసుకొని, దానితో హాయిగా నవ్వుతూ ఆడుకుంటున్నప్పుడు... వాళ్ళ ముఖాలలో కనిపించే చిరునవ్వు చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తుంది. మనిషి మౌలిక అవసరాలు తీరితే ఆనందంగా ఉండగలడు. అదే కడుపులో ఆకలి వేధిస్తూ ఉంటే చిరునవ్వు కనిపించదు. కేవలం కన్నీళ్ళు మాత్రమే కనిపిస్తాయి. మనం చూస్తున్నవన్నీ కేవలం మనం సృష్టించుకున్నవే. ఎవరైనా తమనితాము నిరుపేదలుగా భావించుకుంటూ ఉంటే... అందుకు కారణం కూడా మనిషేనని గుర్తించాలి. ఈ విషయాలను మనం అర్థం చేసుకోకపోతే ముందుకి సాగలేం. సమాజం అనే అమరిక విచ్ఛిన్నమవుతుంది. ఈనాడు జరుగుతున్నది అదే కదా! దాన్ని ఏకం చేసి పట్టి ఉంచగలిగేది కేవలం శాంతి మాత్రమే. మన జీవితాల్లో శాంతి కొరవడితే... ప్రతిదీ చిన్నాభిన్నం అవుతుంది. కుటుంబాలు, మనుషులు చిన్నాభిన్నం అవుతారు.



వాటి విలువ గుర్తించండి...


'తనని తాను తెలుసుకోవడం' అనేది ఎంతో ప్రధానం. ఎలా తెలుసుకున్నప్పుడు మాత్రమే మీలో దయాగుణం కూడా నిండి ఉందని గుర్తిస్తారు. మనల్ని మనం తెలుసుకోలేనప్పుడు... మన దగ్గర ఉన్న వాటి గురించి కూడా తెలుసుకోలేం. మీలో జ్ఞానం ఉంది, చీకటిని పారద్రోలగలిగే ప్రకాశం మీ హృదయంలో ఉంది. మీకు కావలసినవన్నీ మీలోనే ఉన్నాయి. కానీ ఒకవేళ మిమ్మల్ని మీరు తెలుసుకోలేకపోతే... మీ దగ్గర ఉన్నవాటిని కూడా మీరు తెలుసుకోలేరు. కాబట్టి అన్నిటికన్నా ముందు 'నిన్ను నువ్వు తెలుసుకో'! మీలో ఉన్న సద్గుణాలను గుర్తించి, మీ జీవితాల్లో ముందడుగు వేయండి. ఏది ఏమైనా ఈ ప్రాపంచిక మాయలో పడి మైమరచిపోవద్దు. మీలోంచి వస్తున్న శ్వాస వేరెవరిదో కాదు... అది మీదే. అందులో దాగి ఉన్న ఆనందం కూడా వేరెవరిదో కాదు, మీ ఆనందమే. వీటన్నిటి విలువను గుర్తించండి.

సంతృప్తికి మార్గం

"ఎవరైతే మనఃప్రసన్నతను పొందుతారో... తక్షణం వారి దుఃఖాలన్నీ నశిస్తాయి. ప్రసన్నచిత్తుడైన యోగి బుద్ధి ఇతర విషయాలన్నిటి నుంచి వైదొలగి, పరమాత్మ పట్ల మాత్రమే పూర్తిగా స్థిరపడుతుంది" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. మన కోరికలన్నీ తీరిన తరువాత... మనం సంతుష్టి చెంది, సుఖాన్ని పొందుతామనీ, దుఃఖాన్ని దూరం చేసుకుంటామనీ భావిస్తూ ఉంటాం. కానీ మొదట సంతుష్టి చెందాలనీ, ఆ తరువాత మిగిలినవన్నీ వాటంతట అవే అనుసరిస్తాయనీ శ్రీకృష్ణుడు బోధిస్తున్నాడు.


ఉదాహరణకు మనకు జ్వరం, శరీర అవయవాల్లో నొప్పులు తదితర లక్షణాలు ఉంటే... మనం ఆరోగ్యంగా లేమని నిర్ధారించుకుంటాం. ఈ లక్షణాల మూలాలకు చికిత్స చేయకుండా వాటిని అణచివెయ్యడం వల్ల ఆరోగ్యం కుదుటపడదు. పోషకాహారం, మంచి నిద్ర, వ్యాయామం లాంటివి మనకు మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయి. అదే విధంగా అసంతృప్తికి కారణమైన భయం, క్రోధం, ద్వేషం లాంటివి మనలో సంతృప్తి లేకపోవడాన్ని సూచిస్తాయి. వాటిని కృత్రిమంగా అణచివేయడం వల్ల మనకు సంతృప్తి లభించదు. క్రోధాన్ని, ద్వేషాన్ని అణచివేసి, సమాజంలో ఆమోదయోగ్యమైన ప్రవర్తనను ప్రదర్శించడానికి అనేక శీఘ్ర పరిష్కారాలు ఉన్నాయి.

గీతాసారం



ప్రస్తుతకాలంలో కూడా అవి ఆచరణలో ఉన్నాయి. కానీ ఈ లక్షణాల్ని అణచివేస్తే... కొంతసేపటి తరువాత మరింత శక్తితో తిరిగి వస్తాయి. ఉదాహరణకు మన బాస్ మీద అణచిపెట్టుకున్న కోపం తరచుగా కింది ఉద్యోగులు లేదా కుటుంబ సభ్యుల మీద వ్యక్తమవుతుంది. ఈ ప్రపంచం తాలూకు ద్వంద్వ స్వభావం గురించి తెలుసుకోవడం, కర్మ ఫలం ఆశించకుండా కర్మను ఆచరించాలనే అవగాహన, త్రిగుణాలే మన కర్మలకు, ఆలోచనలకు భావాలకు అసలైన కర్తలనీ, మనం కేవలం సాక్షులం మాత్రమేననీ గుర్తించడం... ఇదీ సంతృప్తికి మార్గం.

మన నిజ స్వరూపమైన అంతరాత్మ ఎల్లప్పుడూ సంతుష్టిగా ఉంటుంది. తాడు, పాము ఉదాహరణలో... తాడులో పాముని చూసినట్టు మనలో వ్యక్తమయ్యే దానితో మనల్ని జత చేసుకొని, అసంతృప్తికి లోనవుతాం. ఈ దుఃఖం నుంచి విముక్తి పొందడానికి శ్రీకృష్ణుడు మనల్ని 'ఆత్మవాన్', 'ఆత్మారామన్'... అంటే ఆత్మతో తాదాత్మ్యం చెందాలని సూచిస్తున్నాడు. ఇది దుఃఖాల అణచివేత కాదు. వాటిని సాక్షిగా చూస్తూ ఉండే సామర్థ్యాన్ని సంపాదించుకోవడం.




కె. శివప్రసాద్
ఐఎఎస్

చింతన

కుండలినీ శక్తి నిజంగానే ఉందా?

జిడ్డు కృష్ణమూర్తి ఉపన్యాసాల్లో, సంభాషణలలో 'చైతన్యం' అతి ముఖ్యమైన అంశం. 'యోగః చిత్త వృత్తి నిరోధః' అని పతంజలి మహర్షి అష్టాంగ యోగాన్ని నిర్వచించాడు. చైతన్యంలో పుట్టి, నిరంతరం చలనంలో ఉండే వృత్తుల్ని నిరోధించడాన్ని, అంటే... వాటిని అరికట్టే లేదా నిర్మూలించే సాధనను 'యోగం' అంటారని అర్థం. అయితే 'చిత్తం అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు పతంజలి యోగసూత్రాల్లో మనకు జవాబు దొరకదు. 'నేను ఎవరిని?', 'ఈ ప్రపంచం ఏమిటి?' అనే రెండు మౌలికమైన ప్రశ్నలు అర్థం కావాలంటే... చైతన్యం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. కాబట్టి చిత్తం లేదా చైతన్యం ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్రాలలో అతి ముఖ్యమైన విషయం. మన అనుభవాలన్నిటికీ ఇదే రంగస్థలం. పాయసంలో రుచిని, గులాబీలో పరిమళాన్ని, వేణునాదంలో మాధుర్యాన్ని, ఉదయిస్తున్న సూర్యుడిలో రంగులను జ్ఞానేంద్రియాలు గ్రహిస్తున్నప్పటికీ... అవి అనుభవం అయ్యేది చైతన్యంలోనే. మన సంకల్పాలకు, ఆలోచనలకు, రాగద్వేషాలకు, సుఖదుఃఖాలకు, వినయం, మదం లాంటి గుణాలకు చైతన్యమే వేదిక. దీని పర్యాయ పదాలైన 'మనసు, బుద్ధి, చిత్తం, హృదయం' లాంటివి మన మాటల్లో తరచు దొర్లుతూ ఉంటాయి.

అది కేవలం ఒక మిష



ఆధ్యాత్మిక సాధన అంతా చైతన్యపరమైనదే. మనిషి చైతన్యంలో కుండలినీ అనే అనంతమైన శక్తి ఒకటి ఉంటుంది, దాన్ని సాధన ద్వారా మేల్కొల్పవచ్చునని మన సంప్రదాయం చెబుతోంది. "కుండలినీ శక్తి నిజంగానే ఉంటుందా?..." కృష్ణమూర్తితో జరిపిన సంభాషణల్లో పుపుల్ జయకర్ లాటి మేధావులు ఈ ప్రశ్న వేశారు. "అవును, చైతన్యంలో అనంతమైన, నిత్యనూతనమైన, అక్షయమైన శక్తి ఒకటి ఉంటుంది" అనేది కృష్ణమూర్తి జవాబు. "అయితే మనకు అనంతమైన ఈ చైతన్యంలో ఒక చిన్న భాగం మాత్రమే అందుబాటులో ఉంటుంది. 'నేను' అనే అహంభావం, అది సృష్టించిన 'నేను-నువ్వు' అనే విభజన (అంటే ద్వైతం), ఆ 'నేను' చుట్టూ పేరుకున్న కుహనా మనుగడ... ఇవన్నీ చైతన్యాన్ని ఆవరిస్తాయి. అందువల్ల మనకు మన చైతన్యం సంపూర్ణంగా అందుబాటులో ఉండదు. చైతన్యాన్ని శుభ్రపరిస్తే ఈ శక్తి మేలుకొనే అవకాశం ఉంటుంది. సంప్రదాయం చెప్పే సాధన అందుకు పనికిరాదు" అంటారు కృష్ణమూర్తి. అబద్ధాలు, అవినీతి, అసూయ లాంటి వాటితో నిండిన జీవితాన్ని గడుపుతూ కుండలినీ శక్తిని మేల్కొల్పాలనే ఉద్దేశం హాస్యాస్పదం, కేవలం ఆధ్యాత్మిక వ్యాపారానికి ఒక మిష. చైతన్యాన్ని సంపూర్ణంగా శుభ్రపరచడం ఒక్కటే ఈ శక్తిని మేలుకొలుపగలిగే మార్గం. అంటే దానిలో ఎలాటి ఆలోచనలకు, జ్ఞాపకాలకు... అంటే గతంతో ముడిపడిన అనుభవాలకు, సంకల్పాలకు, మంత్రాలకు, ఉపదేశాలకు, జపాలకు (ఇవన్నీ ఆలోచనల ప్రతిరూపాలే)... చివరకు 'కుండలినీ శక్తిని మేలుకొలపాలి' అనే ఆలోచనకు కూడా తావు లేకుండా చూడాలి.

నిరంతర ప్రక్రియ

చైతన్యాన్ని శుభ్రపరిచే ఈ ప్రక్రియను 'ధ్యానం' (మెడిటేషన్) అంటారు కృష్ణమూర్తి. ఈ ధ్యానం పక్షమో, మాసమో, ఆరునెలలో చేసే పునశ్చరణ కాదు. ఇది 24 గంటలూ నిర్విరామంగా, అత్యంతమైన అప్రమత్తతతో జరిగే మానసిక ప్రక్రియ. చైతన్యాన్ని సంపూర్ణంగా శుభ్రపరచడం వరకే మన ప్రయత్నం పరిమితమై ఉంటుంది. కుండలినీ శక్తి తాలూకు జాగృతి మన చేతిలో ఉండదు. ఇంటిని శుభ్రం చేసి కిటికీలు, తలుపులు తెరిస్తే గాలి లోపలికి వచ్చే అవకాశం ఉంటుంది. గాలిని మనం నిర్బంధించలేం. కుండలినీ శక్తి కూడా అంతే.

• గుంటూరు వనమాలి , www.gunturu.de


ప్రయాగ్‌రాజ్ లోని బస్టాండ్‌లో రాజుతో పాటు ఆయన బృంద సభ్యులు

కొద్దిలో ప్రాణాపాయం తప్పింది..

- అరగంట ముందు వెళ్లుంటే తొక్కిసలాటలో బలయ్యేవాళ్లం
- ఓ ఆశ్రమంలోకి పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్నాం..
- కుంభమేళా వెళ్లిన హనుమకొండ వాసుల అనుభవం

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'మహా కుంభమేళాలో తొక్కిసలాట నుంచి కొద్దిలో తప్పించుకున్నాం. అరగంట ముందు సంగమఘాట్‌కు వెళ్లుంటే తొక్కిసలాటలో మా ప్రాణాలు కూడా పోయేవి. భగవంతుడి దయ వల్ల బతికి బయటపడ్డాం' అని పలువురు హనుమకొండ వాసులు తెలిపారు. ప్రస్తుతం అక్కడే ఉన్న వీరు తిరిగొచ్చేందుకు సరైన ప్రయాణ సదుపాయాలు లేక కష్టాలు పడుతున్నారు. మౌని అమావాస్య రోజు ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు చేయడానికి 500 మందికిపైగా హనుమకొండ వాసులు బృందాలుగా కుంభమేళాకు తరలి వెళ్లారు. స్థానిక చాకలివాడకు చెందిన కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి అధ్యక్షుడు చీకటి రాజుతోపాటు మరో 8 మంది ఒక బృందంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. వీరు అక్కడికి చేరుకున్న తర్వాత ప్రధాన బ్రిడ్జిపైనే కాళికామాత గుడి పక్కన ఓ ఆశ్రమంలో గది అద్దెకు తీసుకున్నారు. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఘటనను రాజు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. 'రాత్రి 2 గంటల సమయంలో పుణ్యస్నానానికి బయలుదేరి బ్రిడ్జి మీదకి వచ్చాం. అప్పటికే విపరీతమైన రద్దీ ఉంది. ఎటుచూసినా ప్రవాహంలా తరలివస్తున్న జనం. దీంతో ఆబ్రిడ్జి మీదనే కాసేపు నిల్చున్నాం. ఇంతలోనే మా ముందు నుంచి అంబులెన్స్‌లు, పోలీసుల వాహనాలు వెళ్లడం కనిపించింది. ఆరా తీస్తే తొక్కిసలాట జరిగిందని తెలిసింది. దీంతో బ్రిడ్జి మీదికి పెద్ద ఎత్తున జనం రావడం మొదలుపెట్టారు. అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసుల సాయంతో కర్మయోగి అనే ఆశ్రమంలోకి పరుగుతీశాం. బయట ఎటుచూసినా 20 కి.మీ. మేర వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వీఐపీలకే ఎక్కువ భద్రత కల్పించి సామాన్య ప్రజలను పట్టించుకోకపోవడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడింది. ఆశ్రమం నుంచి బయటికొచ్చాక రాత్రంతా నిర్మాణంలోని ఓ భవనంలో తలదాచుకున్నాం. ఎలాగోలా ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్ బస్‌స్టేషన్‌కు చేరుకున్నాం. ఇక్కడా బస్సులు దొరికే పరిస్థితి లేదు. దీంతో కాన్పూర్‌కు ఏదైనా ప్రైవేటు వాహనంలో వచ్చి అక్కడి నుంచి హైదరాబాద్‌కు రావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రైవేటు వాహనదారులు దారుణంగా దోచుకుంటున్నారు. బస్‌స్టేషన్ నుంచి కాన్పూర్‌కు 200 కి.మీ. దూరానికి రూ.35 వేల నుంచి 40 వేలు అడుగుతున్నారు. ఏం చేయాలో తెలియక బస్‌స్టేషన్‌లోనే పడిగాపులు కాస్తున్నాం' అని వెల్లడించారు.

కుంభమేళాలో టీటీడీ ఉద్యోగి అదృశ్యం

తిరుమల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు వెళ్లిన దీపాలి సుబ్రహ్మణ్యం అనే ఉద్యోగి కనిపించకుండా పోయారు. కుంభమేళా నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌లోని సెక్టార్6లో టీటీడీ శ్రీవారి ఆలయ నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 13వ తేదీ నుంచి తిరుమల తరహాలో ఈ ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు. అక్కడ విధులు నిర్వహించేందుకు టీటీడీ నుంచి దాదాపు 250 మంది సిబ్బంది డిప్యుటేషన్‌పై వెళ్లారు. బుధవారం సాయంత్రం సబ్బు కోసం బయటకు వెళ్లిన దీపాలి సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. ఎంతకీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో దారాగంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శీతాకాల సభల్లో సెగలే!



(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు. ఈ రెండు అంశాలపైనా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయనున్నాయి. గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో దీని తాలూకా ప్రమాద ఘంటికలు గట్టిగానే మోగాయి. ప్రతిపక్షాలు వక్ఫ్ బిల్లుపై ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తున్న తీరుపై నిరసన తెలిపాయి. ఎన్డీఏ మిత్రపక్షం జనతాదళ్ (యూ)... జమిలి ఎన్నికలపై విస్తృత చర్చ లేకుండా ముందుకు వెళ్లరాదని స్పష్టం చేసింది. బిహార్ కు భారీ పారిశ్రామిక ప్యాకేజీ ప్రకటించాలని మరో మిత్రపక్షం లోక్ జనశక్తి (పశ్వాన్) డిమాండ్ చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద అపరిష్కృతంగా ఉన్న అంశాలను పరిష్కరించాలని తెలుగుదేశం, జనసేన కోరాయి. కాగా తమకు ఎక్కడో చివరన సీట్లు కేటాయించారని, వైసీపీ ఎంపీల పక్కన సీట్లు కేటాయించడం సరైంది కాదని ప్రభుత్వం దృష్టికి టీడీపీ తీసుకువచ్చింది. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రులు కిరెన్ రిజిజూ, అర్జున్ రాం మేఘ్వాల్, ఎల్. మురుగన్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నుంచి జైరాం రమేశ్, కె. సురేశ్, గౌరవ్ గొగోయ్, వామపక్ష నేతలు జాన్ బ్రిటాస్, పి. సంతోష్‌కుమార్, టీఎంసీ ఎంపీలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓబ్రెయిన్, తెలుగుదేశం ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బీద మస్తాన్‌రావు, జనసేన ఎంపీ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

తొందర పడొద్దు: జేడీ(యూ)

జమిలి ఎన్నికల బిల్లును తొందరపాటుతో ప్రవేశపెట్టరాదని, విస్తృత సంప్రదింపులు జరపాలని జనతాదళ్ (యూ) ఎంపీ సంజయ్ కుమార్ ఝా అఖిలపక్ష సమావేశంలో సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ కు ఒకే సారి ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం తొందరపడరాదని ఆయన చెప్పారు. చైనీస్ కంపెనీ డీప్ సీక్ తక్కువ వ్యయంలో ఏఐ నమూనాను రూపొందించడంతో అమెరికా సంస్థలు కూడా నష్టాలకు గురవుతున్నాయని, దీనిపై భారత్ తన వైఖరి ఏమిటో తేల్చాలని ఝా కోరారు. బిహార్ తలసరి ఆదాయానికి, జాతీయ సగటుకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని, ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీని కేటాయించి తమ రాష్ట్రాన్ని ఆదుకోవాలని, భారీ ఆర్థిక సహాయం చేయాలని లోక్ జనశక్తి (రాంవిలాస్)ఎంపీ అరుణ్ భారతి డిమాండ్ చేశారు.

మాకు వెనుక సీట్లు ఇస్తారా?: టీడీపీ

ఎంపీల సీట్లను ఇష్టం వచ్చినట్లు కేటాయించారని కాంగ్రెస్ నేత గొగోయ్ అనగా, టీడీపీ కూడా తమకు సీట్ల విషయంపై ఇబ్బందిగా ఉన్నదని తెలిపింది. మాగుంట శ్రీనివాసులురెడ్డి వంటి సీనియర్ నేతలను కూడా వెనుక బెంచికి పరిమితం చేశారని దగ్గుమళ్ల చెప్పారు.

వీవీఐపీల వల్లే కుంభమేళా విషాదం: ఎస్పీ

వక్ఫ్ బిల్లుపై నియమించిన జేపీసీలో ఎటువంటి నిబంధనలు పాటించలేదని, చైర్మన్ జగదంబికా పాల్ అప్రజాస్వామికంగా వ్యవహరించారని, కమిటీని ఒక ప్రహసనంగా మార్చారని డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, టీఎంసీ ఎంపీ బందోపాధ్యాయ విమర్శించారు. స్థాయీ సంఘాల్లో అధికార పార్టీ సభ్యులకే ఎక్కువ స్థానం కల్పించారని వామపక్ష నేత జాన్ బ్రిటాస్ ఆరోపించారు. ఒక ఎంపీకి ఒక స్టాండింగ్ కమిటీ కేటాయించాలన్న నిబంధనను తుంగలో తొక్కి. ఒక్కో అధికార పార్టీ ఎంపీకి పలు స్టాండింగ్ కమిటీలు కేటాయిస్తున్నారని, 29 మంది బీజేపీ ఎంపీలు వివిధ కమిటీల్లో ఉన్నారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. కాగా సభ సజావుగా జరిగేందుకు సహకరించాల్సిందిగా అన్ని పార్టీలను కోరినట్లు కేంద్ర మంత్రి కిరెన్ రిజిజూ తెలిపారు. కాగా, శుక్రవారం రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన తర్వాత ఆర్థిక సర్వే ప్రవేశపెడతారు. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడతారు. సోమవారం నుంచి రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం తర్వాత చర్చ ప్రారంభమవుతుంది.

నకిలీ వార్తలు, పెయిడ్ న్యూస్‌పై నేడు చర్చ!

పెయిడ్ న్యూస్, నకిలీ వార్తలు ఎక్కువగా వస్తుండటం, అనేక టీవీ న్యూస్ చానళ్లు సంచలనాలపై దృష్టి కేంద్రీకరించడం, సాంప్రదాయ వార్తా పత్రికలు రీడర్‌షిప్ తగ్గిపోవడం తదితర సమస్యలు ఎదుర్కొంటున్న అంశాలు శుక్రవారం సమావేశం కానున్న పార్లమెంటరీ కమిటీలో చర్చకు రానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే నేతృత్వంలోని కమ్యూనికేషన్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ ఈ సమావేశంలో అన్ని రకాల మీడియాలకు సంబంధించిన చట్టాల అమలును సమీక్షించనుంది. కొన్ని న్యూస్ చానళ్లు టీఆర్పీ రేటింగ్ కోసం సన్సేషన్లు సృష్టించే ఆలోచనతో ముఖ్యమైన, తీవ్రమైన వార్తలను పణంగా పెట్టి క్రైమ్, సెలబ్రిటీ వార్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఈ సమావేశంలో చర్చించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ప్రాంతీయ, స్థానిక మీడియా ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ప్రత్యేకించి ఎన్నికల సమయాల్లో నకిలీ వార్తలు సృష్టిస్తున్న గందరగోళం తదితరాలపై సమావేశంలో చర్చించనున్నారు. సమాచార ప్రసారమాధ్యమాలశాఖ కార్యదర్శి, ప్రసారభారతి సీఈవో, ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ తదితర కీలక వ్యక్తులు కమిటీ ఎదుట హాజరయ్యే అవకాశం ఉంది.

నిర్మలకు ఇది ఎనిమిదో బడ్జెట్

10 బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 8వ బడ్జెట్ ఇది. కాగా, మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు రెండు దశలుగా జరుగనున్నాయి. మొదటి దశ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు, రెండో దశ సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నాయి.

స్పీకర్ వద్దకు వక్ఫ్ బిల్లు నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 30: వక్ఫ్ బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. గురువారం జేపీసీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్ పార్లమెంటులోని స్పీకర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి నివేదికను అందజేశారు. ఇటీవల వక్ఫ్ సవరణ బిల్లును జేపీసీ 15-11 ఓట్ల తేడాతో ఆమోదించిన సంగతి తెలిసిందే. కాగా, బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రప్రభుత్వం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది.

బడ్జెట్ సమావేశాల్లో 16 బిల్లులు

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక బిల్లు-2025, వక్ఫ్ సవరణ బిల్లు సహా మొత్తం 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. వీటిలో బ్యాంకుల నియంత్రణ చట్టం సవరణ బిల్లు, భారతీయ రైల్వేలు, భారతీయ రైల్వేల బోర్డు విలీన చట్టం, విపత్తు నిర్వహణ, చమురు క్షేత్రాల(నియంత్రణ, అభివృద్ధి), విమానయాన రంగం ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ, గోవా అసెంబ్లీలో ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో మార్పుచేర్పులు, ఇనిస్టిట్యూట్‌ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ పేరును త్రిభువన్ సహకారీ యూనివర్సిటీగా మార్పు, పరిశ్రమల్లో బాయిలర్ల సురక్షిత నిబంధనలు, నౌకాయాన తదితర బిల్లులు ఉన్నాయి. కాగా, తొలిరోజైన శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. అనంతరం ఆర్థిక సర్వే-2024-25ను పార్లమెంటులో ప్రవేశపెడతారు. శనివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపడతారు.

డాక్టర్ మృత్యు'వేల్'!

- వైద్యుడే తండ్రీకూతుళ్లను చంపేశాడు!
- వైద్యం వికటించి తండ్రి మృతి
- నిలదీసిన కుమార్తెపై దాడి, ఆమె మృతి
- ఇద్దరి శవాలనూ ఇంట్లో వదిలి పరార్
- దుర్వాసన రాకుండా రసాయనాల పూత
- 3 నెలల తర్వాత వెలుగులోకి దారుణం
- ఎట్టకేలకు వైద్యుడు సామవేల్ అరెస్టు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైద్యో నారాయణో హరీ అంటారు. అంటే వైద్యుడు దేవుడితో సమానమని!... కానీ.. చెన్నైలో ఓ వైద్యుడి చేసిన నిర్వాకం తెలిసే ఒళ్లు గగుర్పాటు కలగమానదు. వైద్యం వికటించి ఓ వృద్ధుడు మృతి చెందగా, దీనిపై నిలదీసిన ఆయన కుమార్తెపై వైద్యుడు దాడి చేయడంతో ఆమె కూడా మృతి చెందింది. దీంతో ఇద్దరి మృతదేహాలనూ వారింట్లోనే వదిలి, ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. తండ్రీకూతుళ్ల అదృశ్యంపై బంధువులు ఫిర్యాదు చేయగా, 3 నెలల అనంతరం ఇంటి తాళాలు పగలగొట్టి తండ్రీకూతుళ్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కుమార్తె కాల్‌డేటా ఆధారంగా వైద్యుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ జరపడంతో అసలు గుట్టు బయటపడింది. తిరుముల్లైవాయిల్‌లో గురువారం వెలుగుచూసిన ఈ ఘటనపై పోలీసుల కథనం ఇలా ఉంది. వేలూరు జిల్లాకు చెందిన శంకర్(73), ఆయన కుమార్తె సింథియా (35) 4 నెలల క్రితం తిరుముల్లైవాయిల్ ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. శంకర్ మూత్రాశయ వ్యాధితో బాధపడుతుండటంతో సింథియా తనకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన పాత మహాబలిపురంరోడ్డు (ఓఎమ్మార్)కు చెందిన డాక్టర్ సామవేల్‌ను ఇంటికే పిలిపించి చికిత్స చేయించింది. ఓ రోజు సింథియా తండ్రికి డయాలసిస్ చేస్తుండగా ఆయన మృతి చెందాడు. తప్పుడు చికిత్స వల్లే తండ్రి మరణించాడని సింథియా డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం కాస్తా వారి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో సింథియా కింద పడి, తలపగలడంతో అక్కడికక్కడే మరణించింది. ఈ హఠాత్పరిణామంతో ఆందోళన చెందిన డాక్టర్ సామవేల్ తండ్రీకూతుళ్ల మృతదేహాలను వారింట్లోనే ఇంటిలోనే ఉంచి, దుర్వాసన రాకుండా కొన్ని రసాయనాలను చల్లి, ఇంటికి తాళం వేసి పారిపోయాడు. మూడునెలలుగా తండ్రీకూతుళ్ల సమాచారం తెలియకపోవడంతో బంధువులు పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం తిరుముల్లైవాయిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని గురువారం ఉదయం తిరుముల్లైవాయిల్ వద్ద శంకర్ నివసించిన ఇంటి తలుపులను పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా, కుళ్లిన శవాలు కనిపించాయి. మృతదేహాలను పోస్టుమార్టంకు పంపిన పోలీసులు, సింథియా సెల్‌ఫోన్‌లో కాల్ రికార్డును పరిశీలించారు. డాక్టర్ సామవేల్‌తో ఆమె నిత్యం మాట్లాడినట్లు తెలుసుకున్న పోలీసులు.. ఓఎమ్మార్‌లోని ఓ ఇంట్లో దాగివున్న అతడిని అరెస్టు చేసి విచారించగా జరిగిన దారుణం బయటపడింది.



కోలీవుడ్‌లో ఇష్టమైన హీరో సూర్య


అల్లు అరవింద్

కోలీవుడ్‌లో తనకు ఇష్టమైన హీరో సూర్య అని, ఆయన హీరోగా తమిళంలో స్ట్రైట్ చిత్రాన్ని నిర్మిస్తానని నిర్మాత అల్లు అరవింద్ వెల్లడించారు. గీతా ఆర్ట్స్ బ్యానరుపై చందూ మొండేటి దర్శకత్వంలో అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రూపొందగా ఫిబ్రవరి 7వ తేదీన విడుదలవుతుంది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా, గురువారం చెన్నైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'తమిళంలో నా అభిమాన హీరో సూర్య. ఆయనతో స్ట్రైట్ తమిళ చిత్రం తీస్తాను. సూర్యతో దర్శకుడు చందు మొండేటి ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిపారు. 'తండేల్' ముగియగానే ఆ ప్రాజెక్టుపై పూర్తిగా దృష్టిసారిస్తారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలుస్తుంది. మనసులో పాన్ ఇండియా మూవీని తీయాలని ప్లాన్ చేస్తే అది ఫెయిల్ అవుతుంది. చాలామంది నిర్మాతలు చేతులు కాల్చుకున్నారు. వారి పేర్లు చెప్పదలచుకోలేదు. పాన్ ఇండియా అనే ఆలోచన లేకుండా ఒక మంచి సినిమా తీయాలన్న బలమైనకాంక్షతో సినిమా తీస్తే అది దేశ వ్యాప్తంగా ప్రేక్షకాదరణ పొందుతుంది' అన్నారు.

చెన్నై, ఆంధ్రజ్యోతి

గోపీ సుందర్‌కు మాతృవియోగం



మలయాళ, తెలుగు చిత్రాల సంగీత దర్శకుడు గోపీ సుందర్ శోకంలో మునిగిపోయారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి, లివి సురేశ్ బాబు (65) గురువారం కేరళలో కన్నుమూశారు.

మేలో పట్టాలెక్కనున్న స్పిరిట్



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. దర్శకుడిగా 'యానిమల్'తో సందీప్, హీరోగా 'కల్కి 2898 ఏ.డీ'తో ప్రభాస్ హిట్లు కొట్టడంతో ఈ కలయికపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. తాజాగా, ఈ సినిమా గురించి ఓ అప్‌డేట్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'స్పిరిట్' రెగ్యులర్ షూటింగ్ మేలో ప్రారంభమవుతుందని తెలిసింది. జూన్ నుంచి ప్రభాస్ షూటింగ్‌లో చేరనున్నారట. ఈ సినిమాలో పోలీస్ పాత్రలో ఆయన కనిపించనున్నారు. ప్రభాస్ ఈ పాత్రను పోషించడం ఇదే మొదటిసారి. ఇందులో విలన్‌గా సౌత్‌కొరియన్ యాక్టర్ డాన్ లీ నటించనున్నారని ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టాక.. పూర్తయ్యేవరకు మరో సినిమా షూట్‌లో పాల్గొనకూడదని ప్రభాస్‌ను కోరారట సందీప్.



పుణెలోనే పూర్తి చేస్తారా?

రాత్రి 7 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



సిరీస్ లక్ష్యంగా భారత్

సమం కోసం ఇంగ్లండ్

నేడు నాలుగో టీ20

పుణె: వరుస విజయాల జోరులో టీమిండియా మూడో టీ20లోనే సిరీస్‌ను ముగిస్తుందని అంతా భావించారు. కానీ ఇంగ్లండ్ ఆల్‌రౌండ్‌షోతో చెలరేగి ఆతిథ్య జట్టుకు బ్రేక్ వేసింది. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత్‌ను పర్యాటక బౌలర్లు కట్టడి చేయగలిగారు. ఇప్పుడు ఇరు జట్ల మధ్య శుక్రవారం నాలుగో టీ20 పుణెలో జరుగనుంది. భారత్ ఈ మ్యాచ్‌లో నెగ్గితే సిరీస్ వశమవుతుంది. అటు మరోసారి ప్రత్యర్థిని దెబ్బతీసి సిరీస్ ఫలితాన్ని ఆఖరి మ్యాచ్‌కు తీసుకెళ్లాలని బట్లర్ సేన కృత నిశ్చయంతో ఉంది.

శాంసన్‌పై ఒత్తిడి

చివరి మూడు టీ20ల్లోనూ భారత బౌలర్లు ఇంగ్లండ్ భారీ స్కోర్లను అడ్డుకోగలుగుతున్నారు. కానీ రాజ్‌కోట్‌లో బ్యాటింగ్ వైఫల్యం దెబ్బతీసింది. స్పిన్నర్ వరుణ్ ఐదు వికెట్లతో అండగా నిలిచినా ప్రయోజనం లేకపోయింది. భారత్ ఛేదనలో మంచు ప్రభావం లేకపోవడంతో ఇంగ్లండ్ బౌలర్లు బంతిపై పట్టు సాధించారు. ఇక ఓపెనర్ శాంసన్‌ను షార్ట్ పిచ్ బంతుల బలహీనత వెంటాడుతోంది. ఈ సిరీస్‌కు ముందు భీకర ఫామ్‌లో ఉన్నా.. తాజా సిరీస్‌లో వరుసగా 26, 5, 3 రన్స్‌తో నిరాశపరిచాడు. అలాగే రింకూ సింగ్ అందుబాటులో ఉండడంతో ధ్రువ్ జురెల్‌పై వేటు పడవచ్చు. కెప్టెన్ సూర్యకుమార్ క్రీజులో కుదురుకోవాల్సి ఉంది. నేటి కీలక మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. ఒకవేళ నేటి మ్యాచ్‌లో మహ్మద్ షమితో పాటు అర్ష్‌దీప్‌ను కూడా ఆడించాలనుకుంటే సుందర్‌ను తప్పించవచ్చు.

అదే జోరు చూపాలని..

కీలక సమయంలో బ్యాటర్లు ఫామ్‌లోకి రావడంతో మూడో టీ20లో ఇంగ్లండ్ విజయం సాధించగలిగింది. ఓపెనర్ డకెట్, లివింగ్‌స్టోన్ తుఫాన్ ఇన్నింగ్స్ భారత్ ఆశలను వమ్ము చేసింది. బౌలింగ్‌లో స్పిన్నర్ ఆదిల్ రషీద్ భారత బ్యాటర్లకు ముకుతాడు వేయడంలో ముందుంటున్నాడు. ఏదేమైనా రెండు విభాగాల్లోనూ మరోసారి రాణించి పుణెలో గెలిచి తీరాలన్న కసితో ఇంగ్లండ్ ఉంది.

తుది జట్లు (అంచనా):
భారత్: శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్, సుందర్/అర్ష్‌దీప్, బిష్ణోయ్, షమి, వరుణ్ చక్రవర్తి.
ఇంగ్లండ్: సాల్ట్, డకెట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఒవర్టన్, కార్స్, ఆర్చర్, ఉడ్, రషీద్.
పిచ్: ఎంసీఏ స్టేడియం సహజంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంటుంది. అయితే ఆరంభంలో పేసర్లు కూడా ప్రభావం చూపవచ్చు. తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 166గా ఉంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ తీసుకునే అవకాశం ఉంది.

కోహ్లీ.. కోలాహలం

● **పోటెత్తిన ఫ్యాన్స్, గేట్లవద్ద తోపులాట**

● **రైల్వేస్‌తో ఢిల్లీ రంజీ మ్యాచ్**





విరాట్ కాళ్లు మొక్కుతున్న అభిమాని

న్యూఢిల్లీ: ఊహించినట్టే ఢిల్లీ రంజీ మ్యాచ్‌ను కోహ్లీ మేనియా కమ్మేసింది. విరాట్ కోసం ఫ్యాన్స్ భారీగా స్టేడియానికి తరలి రావడంతో.. దేశవాళీ క్రికెట్‌లో అరుదైన దృశ్యం గురువారం ఫిరోజ్ కోట్లా స్టేడియంలో కనిపించింది. మైదానం మొత్తం కింగ్ నామస్మరణతో మార్మోగిపోయింది. గ్రూప్-డిలో ఢిల్లీ-రైల్వేస్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను వీక్షించేందుకు 15 వేల మందికిపైగానే తరలివచ్చారని అంచనా. ఆధార్ కార్డుతో ఉచిత ప్రవేశానికి అవకాశం కల్పించిన ఈ మ్యాచ్‌కు ఉదయం 7 గంటల నుంచే స్టేడియంవద్ద ఫ్యాన్స్ గుమికూడారు. ఆ తర్వాత జనాల రాక భారీగా పెరగడంతో 16వ గేటువద్ద కొద్దిసేపు తోపులాట జరిగింది. దీంతో మరో గేట్‌ను తెరిచి ఫ్యాన్స్‌ను లోపలికి పంపారు. ఈ సందర్భంగా ముగ్గురికి గాయాలయ్యాయి. వీరికి ప్రాథమిక చికిత్స చేశారు. ప్రేక్షకుల్ని నియంత్రించేందుకు పారామిలిటరీ సిబ్బందిని సైతం పిలిపించారు. అయితే, ఆటకు తొలి రోజే కోహ్లీ బ్యాటింగ్ చూడాలనివచ్చిన అభిమానులకు నిరాశే ఎదురైంది. టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బదోని ఫీల్డింగ్ ఎంచుకోవడంతో ఫ్యాన్స్ గేలి చేశారు. కానీ, మ్యాచ్ మొదలైన తర్వాత టపటపా వికెట్లు పడుతుండడంతో అందరూ ఎంజాయ్ చేశారు. కోహ్లీ ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ ఎంతో హుషారుగా కనిపించడంతో.. ప్రేక్షకులు కూడా తమ అభిమాన ప్లేయర్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తూ ఆనందించారు. కాగా, 11వ ఓవర్‌లో ఓ అభిమాని ఫీల్డ్‌లోకి చొరబడి కోహ్లీ వద్దకు వెళ్లడంతో కలకలం రేగింది. విరాట్ కాళ్లకు నమస్కరిస్తున్న అతడిని సెక్యూరిటీ పట్టుకొని బయటకు తీసుకెళ్లింది. ఈ మ్యాచ్‌కు టీవీ కామెంటేటర్‌గా ఉన్న భారత మాజీ ఆటగాడు డబ్ల్యూవీ రామన్.. విరాట్ అభిమానగణాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. రంజీ మ్యాచ్‌కు ఇన్ని వేల మంది రావడం తాను ఎప్పుడు చూశానో కూడా గుర్తులేదన్నాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో రైల్వేస్ 241 పరుగులకు ఆలౌటైంది. ఉపేంద్ర (95), కర్ణ్ శర్మ (50) హాఫ్ సెంచరీలు చేశారు. సైనీ, మాథుర్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఢిల్లీ మొదటి రోజు ఆట ఆఖరికి 41/1 స్కోరు చేసింది. రెండో రోజు విరాట్ బ్యాటింగ్‌కు దిగడం ఖాయం కావడంతో ఫ్యాన్స్ మరింతగా పోటెత్తుతారని అంచనా వేస్తున్నారు.





ఖవాజా 'డబుల్'

ఇన్‌గ్లిస్ మెరుపు శతకం

ఆస్ట్రేలియా 654/6 డిక్లేర్డ్



గాలె : ఓపెనర్ ఖవాజా (232) తొలి ద్విశతకంతో చెలరేగగా..అరంగేట్ర ఆటగాడు జోష్ ఇన్‌గ్లిస్ (94 బంతుల్లో 102) మెరుపు శతకంతో కదం తొక్కడంతో శ్రీలంకతో మొదటి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌ను ఆస్ట్రేలియా 654/6 భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్‌స్కోరు 330/2తో రెండోరోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్ తొలుత స్మిత్ (141) వికెట్‌ను కోల్పోయింది. ఖవాజాతో కలిసి మూడో వికెట్‌కు స్మిత్ 266 పరుగులు జోడించాడు. అనంతరం..ఇన్‌గ్లిస్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 146 పరుగులు జత చేశాడు. ఇక..మొదటి ఇన్నింగ్స్‌లో గురువారం ఆట నిలిపి వేసే సమయానికి శ్రీలంక 44/3 స్కోరుతో ఇక్కట్లలో పడింది.

స్టార్క్ 700 వికెట్లు..: గురువారం తన 35వ జన్మదినం రోజున ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఓపెనర్ కరుణరత్నేను అవుట్ చేసిన అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో 700వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్‌ల్లో స్టార్క్‌కిది 377వ వికెట్‌కాగా, వన్డేలలో 244, టీ20లలో 79 వికెట్లు పడగొట్టాడు. షేన్ వార్న్, మెక్‌గ్రాత్, బ్రెట్ లీ తర్వాత అత్యధిక అంతర్జాతీయ వికెట్లు సాధించిన నాలుగో ఆస్ట్రేలియా బౌలర్‌గా స్టార్క్ రికార్డులకెక్కాడు.

'అమ్మాయిల ఫుట్‌బాల్.. సంప్రదాయాలకు వ్యతిరేకం'

● **మ్యాచ్‌ను నిలిపేసిన ఛాందసులు**



ఢాకా: బంగ్లాదేశ్‌లో మత ఛాందస వాదులు పేట్రేగిపోతున్నారు. సంప్రదాయాల మాటున అఫ్ఘానిస్థాన్ తరహాలో మహిళల హక్కులను హరించే కుట్రలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా బంగ్లాదేశ్‌లో మహిళలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు. అయితే, తాజాగా అంతర్ జిల్లా జట్ల మధ్య జరుగుతున్న అమ్మాయిల మ్యాచ్‌ను ఛాందసవాదులు అడ్డుకొన్నారు. మహిళలు ఫుట్‌బాల్ ఆడడం ఇస్లాంకు వ్యతిరేమని వాదిస్తున్నారు. వందల మంది గుంపులుగా మైదానంలోకి వచ్చి నిరసన తెలియజేశారని నిర్వాహకులు తెలిపారు. పరిస్థితులు హింసాత్మకంగా మారే ప్రమాదం ఉండడంతో మ్యాచ్‌ను నిలిపివేసినట్టు చెప్పారు. అయితే, ఈ చర్యలను బంగ్లాదేశ్ ఫుట్‌బాల్ సమాఖ్య (బీఎఫ్ఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఇలా అమ్మాయిల మ్యాచ్‌ను అడ్డుకోవడం ఇది వరుసగా రెండోసారి.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

థాయ్‌లాండ్ మాస్టర్స్

బ్యాంకాక్ : కిడాంబి శ్రీకాంత్, యువ ఆటగాడు ఎస్.సుబ్రమణియన్ థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-19, 21-15తో గుణవన్ (హాంకాంగ్)ని ఓడించాడు. మరో ప్రీక్వార్టర్స్ పోరులో 21 ఏళ్ల సుబ్రమణియన్ 9-21, 21-10, 21-17తో చికో ఆరా ద్వి (ఇండోనేసియా)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో రక్షిత రామ్‌రాజ్ 21-15, 21-12తో టాంగ్ (థైపీ)పై విజయంతో క్వార్టర్స్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో రుత్వికా శివాని గద్దె/రోహన్ ద్వయం 19-21 15-21తో థాయ్‌లాండ్ జోడీ రచపోల్/లీ సువాన్ చేతిలో ఓటమి పాలైంది.

రాణించిన తన్మయ్

విదర్భ 190 ఆలౌట్ ● హైదరాబాద్ 90/2

నాగ్‌పూర్: తన్మయ్ అగర్వాల్ (53 బ్యాటింగ్) అర్ధ శతకంతోపాటు బౌలర్లు రాణించడంతో.. గ్రూప్-బిలో విదర్భతో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి రోజు పైచేయి సాధించింది. విదర్భ మొదటి ఇన్నింగ్స్‌లో 190 పరుగులకు ఆలౌటైంది. రక్షిత్, అనికేత్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 90/2 స్కోరు చేసింది. తన్మయ్, హిమతేజ (5) క్రీజులో ఉన్నారు.

మనమ్మాయిలే ఫేవరెట్లు

నేడు ఇంగ్లండ్‌తో సెమీఫైనల్

అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్

మ. 12 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..





కౌలాలంపూర్ : డిఫెండింగ్ చాంపియన్ భారత్ అప్రతిహత విజయాలతో అండర్-19 టీ20 ప్రపంచ కప్ టైటిల్ నిలబెట్టుకొనే దిశగా దూసుకుపోతోంది. ఈ క్రమంలో శుక్రవారం జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్ జట్టును ఢీకొనేందుకు సిద్ధమైంది. నికీ ప్రసాద్ సారథ్యంలోని మన అమ్మాయిలు ఈసారి టోర్నీలో అద్భుతంగా రాణిస్తున్నారు. తెలుగు బౌలర్ షబ్నమ్, జోషిత ఆరంభంలోనే వికెట్లు తీస్తుండగా, స్పిన్నర్లు పరునిక, ఆయుషి, వైష్ణవి ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేస్తున్నారు. ఇక బ్యాటింగ్ విభాగంలో..మరో తెలుగమ్మాయి త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్) స్కాట్లాండ్‌తో పోరులో సూపర్ సెంచరీతో చరిత్ర సృష్టించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు భారత స్పిన్నర్లను ఏ విధంగా ఎదుర్కొంటారన్నది ఆసక్తికర అంశం. పైగా ఇంగ్లండ్ మిడిలార్డర్ బ్యాటింగ్‌లో నిలకడలేమి కనిపిస్తోంది. ఏదేమైనా.. ఈ సెమీఫైనల్లో మన అమ్మాయిలనే హాట్‌ఫేవరెట్లుగా క్రికెట్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక..ఉదయం 8 గంటలకు మొదలయ్యే తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా-సౌతాఫ్రికా అమీతుమీ తేల్చుకుంటాయి.

బాక్సింగ్‌కు మనోజ్ గుడ్‌బై



న్యూఢిల్లీ: కామన్వెల్త్ మాజీ చాంపియన్, హరియాణా బాక్సర్ మనోజ్ కుమార్ (39) కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పురుషుల 64 కిలోల విభాగంలో మనోజ్ కొన్నేళ్లపాటు ఆధిపత్యం ప్రదర్శించాడు. కోచ్‌గా కొత్త కెరీర్ ఆరంభిస్తానని అతడు తెలిపాడు. 2010 ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం నెగ్గిన మనోజ్.. 2018 గోల్డ్ కోస్ట్ క్రీడల్లో చివరిసారిగా కాంస్యం సాధించాడు. 2012 లండన్, 2016 రియోలో జరిగిన ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. గాయాలు, జాతీయ సమాఖ్యతో విభేదాల కారణంగా కెరీర్ ఆటంకాల నడుమ సాగింది.

బిజినెస్

సీనియర్ సిటిజన్లకు ఐఆర్‌డీఏఐ ఊరట

ఏటా ప్రీమియం పెంపు 10% మించొద్దు

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్లకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ పెద్ద ఊరట కల్పించింది. బీమా కంపెనీలు వీరికి ఇచ్చే ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియం పెంపు ఏటా 10 శాతం మించకూడదని స్పష్టం చేసింది. అంతకు మించితే ముందుగా తమ అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియాన్ని బీమా కంపెనీలు ఏటా ఎడాపెడా పెంచుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఐఆర్‌డీఏఐ ఈ చర్య తీసుకుంది. ఈ పాలసీల ప్రీమియం కూడా క్లెయిమ్‌ల ద్వారా చెల్లించే మొత్తం, ఖర్చుల ఆధారంగా ఉండాలని స్పష్టం చేసింది.

● ఎయిర్ కూలర్ కంపెనీ సింఫనీ లిమిటెడ్.. వాటర్ హీటింగ్ విభాగంలోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా మూడు గీజర్ మోడళ్లను విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ నైన్-లేయర్ వాటర్ ఫిల్టరేషన్ టెక్నాలజీ అయిన ఫ్యూరోపాడ్ క్యాట్రిడ్జ్‌తో వీటిని తీసుకువచ్చింది.


● కంట్రీ డిలైట్ తాజాగా స్వచ్ఛమైన తేనెను మార్కెట్లోకి విడుదల చేసింది. జర్మనీలోని సర్టిఫైడ్ లేబొరేటరీ ద్వారా న్యూక్లియర్ మాగ్నెటిక్ రిసోనెన్స్ (ఎన్ఎంఆర్) పరీక్షించినట్లు వెల్లడించింది. అంతేకాకుండా ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు లోబడి 36 రకాలుగా పరీక్షించినట్లు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	83,020 ▲	76,100 ▲	1,06,000 ▲
విజయవాడ	84,000 ▲	79,000 ▲	93,800 ▲
విశాఖపట్నం	81,350 ▲	74,570 ▲	93,140 ▲
రాజమండ్రి	83,020 ▲	76,109 ▲	94,400 ▲
ప్రొద్దుటూరు	82,200 ▲	76,120 ▲	93,500 ▲
ముంబై	81,303 ▲	74,474 ▲	92,184 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	114
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	100
కర్నూలు	103	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

బడ్జెట్‌పై మధ్య తరగతి గంపెడాశలు

బడ్జెట్ 2025-26



నిర్మలమ్మ మురిపిస్తారా? మాయ చేస్తారా?

పన్ను పోటు తగ్గితేనే జీడీపీకి ఊతం

కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతోంది. శనివారమే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో సమర్పించబోతున్నారు. ధరల పోటుతో మధ్య తరగతి ఆదాయాలు కుంగిపోతున్నాయి. ధరలు పెరిగినంత వేగంగా ప్రజల ఆదాయాలు పెరగడం లేదు. ఐటీతో సహా అనేక రంగాల్లో ఉద్యోగ నియామకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టే సుమారు రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా ఉండే అవకాశం ఉంది? ఎలా ఉంటే బాగుంటుంది? పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు, వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారుల కోరికల చిట్టాపై ఒక లుక్కేద్దాం.

దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన మధ్య తరగతి చితికిపోతోంది. ఖర్చులు ఎంత తగ్గించుకున్నా, వీరి ఆర్థిక భారం తీరడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసిక జీడీపీ వృద్ధి రేటూ గణనీయంగా తగ్గింది. గత ఏడు త్రైమాసికాల్లో ఎన్నడూ లేని విధంగా 5.4 శాతానికి పడిపోయింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి జీడీపీ వృద్ధి రేటు 6 శాతం మించడం కూడా కష్టంగానే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, ఆమె టీమ్ ప్రవేశపెట్టే రూ.50 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌పై అటు మధ్య తరగతితో పాటు పారిశ్రామిక, వాణిజ్య వర్గాలూ గంపెడాశలు పెట్టుకున్నాయి.

పన్ను మినహాయింపు పరిమితి పెంచాలి

గత ఏడాది ప్రవేశపెట్టిన కొత్త ఆదాయ పన్ను విధానం కింద రూ.3 లక్షల వార్షికాదాయం వరకు పన్ను పోటు లేదు. అదే పాత విధానాన్ని ఎంచుకుంటే ఈ పరిమితి రూ.2.5 లక్షలు మాత్రమే. దీన్ని 2014లో నిర్ణయించారు. గత ఐదేళ్లలో ధరల సెగ ఏటా సగటున 5.7 శాతం చొప్పున పెరిగింది. ఈ లెక్కన చూస్తే ఎప్పుడో 2014లో నిర్ణయించిన రూ.2.5 లక్షల విలువ ప్రస్తుతం రూ.1.4 లక్షలు మాత్రమే. 2014 నాటి జీవన ప్రమాణాలతో నివసించాలంటే వచ్చే బడ్జెట్‌లో అయినా కేంద్ర ఆర్థిక మంత్రి ఈ పరిమితిని రూ.5.7 లక్షలకు పెంచాలి. దీనికితోడు ప్రస్తుతం రూ.15 లక్షలకు మించిన వార్షికాదాయం ఉన్న వారు 30 శాతం పన్ను శ్లాబులోకి వస్తున్నారు. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి ఈ శ్లాబులోకి వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని కోరుతున్నారు.

పొదుపు ఖాతా వడ్డీ పరిమితి పెంచాలి

ప్రస్తుతం బ్యాంకు పొదుపు ఖాతాలోని మొత్తాలపై వచ్చే వార్షిక వడ్డీ రూ.10,000 మించితే పన్ను పోటు తప్పదు. ఈ మొత్తాన్ని 2013లో నిర్ణయించారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం దీని విలువ రూ.5,000 మాత్రమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని కనీసం రూ.20,000కైనా పెంచాలని వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. దీనికి తోడు ప్రజల్లో దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించేందుకు మూడేళ్లకు మించిన కాలపరిమితి ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయాన్ని దీర్ఘకాలిక మూలధన లాభాల కింద పరిగణించి 12.5 శాతం, అంత కంటే తక్కువ కాలపరిమితి ఉండే డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను పోటు ఉండాలని ట్యాక్స్ నిపుణులు సూచిస్తున్నారు.

నేడు ఆర్థిక సర్వే

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం 2024-25 ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఏటా కేంద్ర బడ్జెట్‌కు ముందు రోజు ఆర్థిక మంత్రి ఈ సర్వేను పార్లమెంట్‌కు సమర్పించటం ఆనవాయితీ. ఈ సర్వేను కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలకు సూచికగా భావిస్తారు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పడిపోవటం, జీడీపీ వృద్ధి రేటు, డిమాండ్ మందగించిన నేపథ్యంలో శుక్రవారం ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది.

80 సీ పరిమితి చాలదు

మధ్య తరగతి ప్రజలు, వేతన జీవులకు ప్రధాన ఊరట ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద లభించే మినహాయింపులే. ప్రస్తుతం పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి ఈ సెక్షన్ కింద వివిధ ఖర్చులు, పెట్టుబడులకు రూ.1.5 లక్షల వరకు మినహాయింపు ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా ఎప్పుడో 2015లో సవరించారు. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే ఇది కనీసం రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలైనా ఉండాలని మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. దీనికి తోడు ఈ సెక్షన్ కింద మరో సబ్ సెక్షన్ చేర్చి పిల్లల చదువుల కోసం చెల్లించే ట్యూషన్ ఫీజుపై రూ.50,000 వరకు, గృహ రుణాలపై చెల్లించే అసలుకు రూ.50,000 వరకు ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని మధ్య తరగతి ప్రజానీకం కోరుతోంది.

రియల్టీ పరిశ్రమ

ప్రస్తుతం దేశంలో రియల్టీ పరిశ్రమ పరిస్థితి కూడా ఏమంత బాగోలేదు. రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉండే లగ్జరీ నివాసాలకు తప్ప, మిగతా వాటికి పెద్దగా గిరాకీ లేదు. నిజానికి గత ఏడాది దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో రూ.కోటి కంటే తక్కువ ధర ఉండే నివాస గృహాల అమ్మకాలు 36 శాతం పడిపోయాయి. హైదరాబాద్‌లో అయితే ఈ పతనం మరింత ఎక్కువగా 69 శాతం వరకు ఉంది. ఆదాయాలు పడిపోవటం, ఇళ్ల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అయినా కనీసం బడ్జెట్‌లో తమ గోడు పట్టించుకోవాలని స్థిరాస్తి రంగం కోరుతోంది. ఎప్పటి నుంచో కోరుతున్న మౌలిక పరిశ్రమ హోదా, ఇళ్ల కొనుగోలుదారులకు మరిన్ని పన్ను రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరుతోంది.

బీమా ప్రీమియం

ప్రస్తుతం పాత పన్ను చెల్లింపు విధానాన్ని ఎంచుకునే 60 ఏళ్ల లోపు వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులకు ఏటా ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంపై రూ.25,000 వరకే ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తోంది. సీనియర్ సిటిజన్లు తమ ఆదాయాల నుంచి చెల్లిస్తే రూ.50,000 వరకు, అదే వారి పిల్లలు చెల్లిస్తే రూ.75,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తోంది. ప్రస్తుత ధరల సెగ ప్రకారం చూస్తే ఇది ఏ మాత్రం చాలదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత ఆరోగ్య బీమా ప్రీమియం మినహాయింపు పరిమితిని రూ.50,000కు, సీనియర్ సిటిజన్లు చెల్లించే ప్రీమియం మినహాయింపు పరిమితిని రూ.75,000కు, తల్లిదండ్రులైన సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా కోసం వారి పిల్లలు చెల్లించే ప్రీమియం పరిమితిని రూ.లక్షకు పెంచాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పారిశ్రామిక రంగం కోరికల చిట్టా

ద్రవ్యలోటును కట్టడి చేస్తూనే జీడీపీ వృద్ధి రేటు పెంపు, ఉపాధి కల్పన, డిమాండ్ పెంపు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. ముఖ్యంగా ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచి కీలకమైన మధ్య తరగతి చేతిలో మిగులు ఆదాయం పెంచాలని కోరింది. లేకపోతే వినియోగ ఆధారితమైన మన ఆర్థిక వ్యవస్థ జీడీపీ వృద్ధి రేటు గాడినపడటం కష్టమని స్పష్టం చేసింది. సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7 త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి పడిపోవటానికి వినియోగ డిమాండ్ నీరసించటమే ప్రధాన కారణమనే విషయాన్ని పారిశ్రామిక వర్గాలు గుర్తు చేస్తున్నాయి. మరోవైపు చైనా నుంచి చౌకగా వచ్చిపడుతున్న దిగుమతులను కట్టడి చేయాలని కోరింది.

చాట్‌జీపీటీ, డీప్‌సీక్‌కు భారత్ పోటీ

» **10 నెలల్లో సొంత ఫౌండేషనల్ మోడల్ అభివృద్ధి**

» **కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దిగ్గజాలకు సవాలు విసిరేందుకు భారత్ సన్నద్ధమవుతోంది. ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, చైనా తాజా సంచలనం డీప్‌సీక్ ఆర్1, గూగుల్ జెమినీతో పాటు ఇతర జెనరేటివ్ ఏఐ అప్లికేషన్లకు పోటీగా భారత్ సొంత ఫౌండేషనల్ మోడల్‌ను అభివృద్ధి చేయనుంది. వచ్చే పది నెలల్లో ఇది సిద్ధం కానుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఉత్కర్ష్ ఒడిశా సదస్సులో వెల్లడించారు. కృత్రిమ మేధ సాంకేతికతలో స్వయం సమృద్ధి దిశగా భారత ప్రయాణంలో ఇది కీలక మైలురాయి కానుందన్నారు. సొంత లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి ఇప్పటికే రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ సిద్ధంగా ఉందని.. భారత వినియోగదారుల వినూత్న అవసరాల తీర్చే వ్యవస్థను అభివృద్ధి చేయడంపై భారత్ దృష్టిసారించిందన్నారు. గత వారం విడుదలైన ఓపెన్‌సోర్స్ మోడల్ డీప్‌సీక్ ఆర్1.. ప్రపంచవ్యాప్త సాంకేతిక నిపుణుల దృష్టిని తనవైపుకు తిప్పుకుంది. అంతే కాదు, ఏఐ రంగంలో ఓపెన్‌ఏఐ సహా అమెరికన్ సిలికాన్ కంపెనీల ఆధిపత్యానికి సవాలు విసిరింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఈ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది.

18,693 జీపీయూల సమీకరణ: చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి ఏఐ మోడళ్ల అభివృద్ధికి అత్యాధునిక జీపీయూ (గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్)లు వేల సంఖ్యలో అవసరం. ఎందుకంటే, ఏఐ మోడల్ ట్రైనింగ్‌కు ఈ ఆధునిక జీపీయూలే కీలకం. డీప్‌సీక్ ఏఐ మోడల్‌కు 2,500 జీపీయూలతో సమాచార ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇవ్వగా.. చాట్‌జీపీటీ అభివృద్ధికి ఏకంగా 25,000 జీపీయూలను వినియోగించారు. భారత్ సొంత ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ఇప్పటివరకు 18,693 జీపీయూలను సమకూర్చుకుంది. అందులో 10,000 జీపీయూలు ఇప్పటికే అందుబాటులో ఉండగా.. త్వరలో మరిన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఏఐ మోడల్ అభివృద్ధి కోసం కామన్ కంప్యూటింగ్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసింది.

మూడో రోజూ కొనసాగిన జోరు

ముంబై: తీవ్ర ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో ఈక్విటీ మార్కెట్ మూడో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. ప్రధానంగా కార్పొరేట్ దిగ్గజాలు రిలయన్స్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ కౌంటర్లలో భారీ కొనుగోళ్లు గురువారం మార్కెట్‌కు ఉత్తేజం ఇచ్చాయి. ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 226.85 పాయింట్లు లాభపడి 76,759.81 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 429.92 పాయింట్ల మేరకు లాభపడి 76,962.88 వరకు వెళ్లింది. నిఫ్టీ 86.40 పాయింట్ల లాభంతో 23,249.50 వద్ద క్లోజైంది. కాగా ప్రస్తుతం అందరి దృష్టి శనివారం ప్రతిపాదించనున్న కేంద్ర బడ్జెట్ పైనే ఉంది. ఈ బడ్జెట్ మార్కెట్లో ప్రస్తుత బేరిష్ ట్రెండ్‌కు అడ్డుకట్ట వేయవచ్చన్నది విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.

మంచు కురిసే వేళలో..



శుభోదయం... గురువారం హైదరాబాద్ కాజాగూడ కొండలపై మంచు దుప్పట్లను తొలగించుకుంటూ తొంగిచూస్తున్న సూర్యుడు. ఈ దృశ్యం వీక్షకులను కనువిందు చేసింది.

కన్నుల పండువగా నాగోబా జాతర

ఇంద్రవెల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల ఆరాధ్య దైవమైన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర కన్నుల పండువగా కొనసాగుతోంది. మూడో రోజైన గురువారం నాగోబాను దర్శించుకునేందుకు భక్తులు తండోప తండాలుగా వచ్చారు. మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాల నడుమ నాగోబా ఆలయం వెనుక ఉన్న పెర్సాపేన్, బాన్‌పేన్‌ల దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేటింగ్ అయిన కొత్త కోడళ్లు కోనేరు నుంచి నీటిని తీసుకొచ్చారు. మెస్రం వంశ అల్లుళ్లు బాన్‌పేన్ దేవత ఆలయం ముందున్న పాత పుట్టలను తొలగించి.. వాటి స్థానంలో కొత్త పుట్టలను తయారు చేసి దేవత ప్రతిమలకు నైవేద్యాలు సమర్పించారు.



ఎన్నికల కోడ్ సాకుతో
రైతు భరోసా నిలిపేస్తే సహించం

» బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ సాకుతో ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేస్తే సహించబోమని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. రైతు భరోసాను పూర్తి స్థాయిలో ఎప్పుడిస్తారన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ జిల్లాకేంద్రంలో మీడియా సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర సర్కారు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రేషన్ కార్డుల జారీపైనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మల్ పట్టణ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని గతంలో మునిసిపల్‌లో తీర్మానం చేయించినట్టు ఆయన గుర్తు చేశారు. దీనికి సంబంధించి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పూర్తి నివేదిక సమర్పిస్తామని, మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ నేతలకే ప్రభుత్వ పథకాలు

» అదే యోచనలో రేవంత్ సర్కారు : ఎమ్మెల్సీ కవిత

ధర్పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ నేతలు తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనలో ఉందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. గురువారం నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం రామడుగులో విలేకరులతో కవిత మాట్లాడారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సచివాలయంలోని ఏసీ గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే ఇది తుది జాబితా కాదని మాట మారుస్తున్నారని పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్ కట్టే పరిస్థితి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్‌ది మొత్తం మోసాల చరిత్ర అని, దగా చరిత్ర అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌లు పెంచకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఏమయ్యాయని ఆమె ప్రశ్నించారు.

మావోయిస్టు సోడి పొజ్జ అరెస్టు

ఎటపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోడి పొజ్జ అలియాస్ లలిత్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. పొజ్జది ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా గొండిగూడ గ్రామం. గొత్తికోయ తెగ. 2011లో ఆయన మిలీషియా సభ్యుడిగా చేరాడు. 2014 నుంచి 2019 వరకు మూడు సార్లు భద్రత సిబ్బందితో జరిగిన ఎదురు కాల్పుల్లో పాల్గొన్నారు. 2019లో ఆయనకు బుల్లెట్ గాయమైంది. బుధవారం పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ చెరువుగుంపు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. మందుపాతర పేల్చే ఉద్దేశంతో మావోయిస్టు పార్టీ నాయకులు, మిలీషియా సభ్యులు, సానుభూతిపరులతో కలిసి వెళ్తున్న పొజ్జ పోలీసులకు పట్టుబడ్డాడు. మిగతా వారు తప్పించుకున్నారు. పొజ్జను తనిఖీ చేయగా ఒక గ్రనేడ్, మావోయిస్టులకు చెందిన కరపత్రాలు, రూ.1,000 నగదు దొరికాయి. అరెస్టు అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్టు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.

బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనలు

» హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం
» సీఎం రేవంత్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించు
» గాంధీ విగ్రహాలకు బీఆర్ఎస్ శ్రేణుల వినతిపత్రాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు వినతిపత్రాలు అందజేసి నివాళులు అర్పించారు. 'ఓ మహాత్మా.. సీఎం రేవంత్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించి, హామీలు అమలయ్యేలా చూడు' అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. నల్లగొండ జిల్లా దేవరకొండలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మహబూబ్‌నగర్ గడియారం చౌరస్తాలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు అన్ని జిల్లాల్లోనూ బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించిన నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగబోదని హెచ్చరించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అమలు చేశారని, కానీ ఏడాది గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తి చేయలేకపోతోందని నిరసనల్లో పాల్గొన్న నాయకులు మండి పడ్డారు.



గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుతపులి మృతి

» మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు వద్ద ఘటన

చేగుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ చిరుతపులి మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు అటవీ ప్రాంతంలోని 44వ జాతీయ రహదారిపై జరిగింది. వల్లూరు అటవీ ప్రాంతం నుంచి సుమారు నాలుగేళ్ల వయస్సున్న మగ చిరుతపులి గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. గాయపడిన చిరుత రహదారి వెంట వస్తున్న ద్విచక్ర వాహనదారులపై దాడి చేసేందుకు యత్నించింది. ఈ క్రమంలో మరోవైపు డివైడర్ దాటుతుండగా.. హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందింది. చిరుత పులి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని దాని కళేబరాన్ని వాహనంలో తరలించారు. అధికారులు మరికాస్త ముందు వచ్చి వాహనాలను అదుపు చేసి ఉంటే చిరుత పులి బతికేదని పలువురు పేర్కొంటున్నారు.

స్వర్ణ తాపడం పనులు చకచకా

గుట్ట విమాన గోపురం పనులు 70% పూర్తి.. బ్రహ్మోత్సవాలకు ముందే ముగించేందుకు కృషి

» విరాళాల సేకరణకు ఫిబ్రవరి 5దాకా గడువు
» డిసెంబరు వరకు వచ్చిన చందాలు 25 కోట్లు
» 10.57 కిలోల బంగారాన్ని సమర్పించిన భక్తులు
» బ్రహ్మోత్సవాల్లోగా యాదగిరిగుట్టకు ప్రత్యేక బోర్డు
» విధి, విధానాలపై దేవాదాయశాఖ కసరత్తు



యాదాద్రి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ప్రధానాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 20లోగా పనులను పూర్తి చేసేందుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటిదాకా దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి. స్వర్ణతాపడం పనుల కోసం ఆలయ అధికారులు రెండున్నరేళ్లుగా విరాళాలు సేకరిస్తున్నారు. ఫిబ్రవరి 5తో చందాల స్వీకరణను ఆపేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో భక్తుల నుంచి విరివిగా విరాళాలు సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్వర్ణతాపడం పనులు పూర్తి కాగానే సంప్రోక్షణ పూజలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. గుట్ట విమాన గోపురాన్ని తిరుమల ఆలయ స్థాయిలో తీర్చిదిద్దుతామని మాజీ సీఎం కేసీఆర్ 2021 అక్టోబరు 19న ప్రకటించారు. దాదాపు 125 కిలోల బంగారం అవసరమవుతుందని, ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ కుటుంబం నుంచి తొలి విరాళంగా కిలో 16 తులాల బంగారాన్ని అందజేశారు. భక్తుల నుంచి విరివిగా విరాళాలు సేకరించేందుకు స్వామివారి గర్భగుడితోపాటు ఆలయ ప్రాంగణంలో క్యూఆర్ కోడ్‌లు, హుండీలు పెట్టారు. ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించారు. అయితే చందాల సేకరణ మొదలైనా.. గత ప్రభుత్వం స్వర్ణతాపడం పనులను చేపట్టలేదు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి.. పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. మార్చిలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల లోపు పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

60 కిలోల బంగారం అవసరం..

యాదగిరిగుట్ట విమానగోపురానికి స్వర్ణతాపడం పనుల కోసం భక్తులు విరివిగా విరాళాలు అందజేశారు. 2021 అక్టోబరు నుంచి 2024 డిసెంబరు వరకు రూ.25,07,63,386 చందాలు సమకూరాయి. 10 కిలోల 577.390గ్రాముల వరకు బంగారు వచ్చింది. స్వామివారికి మొక్కుల చెల్లింపులో భాగంగా వచ్చిన బంగారం దాదాపు 12 కిలోలు, వెండి 2,300 కిలోల వరకు ఉంది. ప్రధానాలయ విమాన గోపురం 10,500 చదరపు అడుగుల వరకు ఉంది. దీనికి 60 కిలోలపైగా బంగారం అవసరమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన మొత్తం బంగారం, వెండితో పాటు విరాళాల రూపంలో వచ్చిన నిధులతో 60 కిలోల వరకు బంగారం సమకూరే అవకాశం ఉంది.

స్వర్ణతాపడం అనంతరం మహాకుంభాభిషేకం..

విమాన గోపురానికి బంగారం తాపడం అమర్చే పనులు గతేడాది నవంబరు 15 నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 10వేల చదరపు అడుగుల మేర పని బంగారం తాపడం చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 7వేల చదరపు అడుగులు పూర్తయింది. పని పూర్తయిన తర్వాత దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణగోపురం యాదగిరిగుట్టదే కానుంది. బంగారు తాపడం పనులు పూర్తయ్యాక మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మార్చి 1 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈలోపే విమానగోపురానికి స్వర్ణతాపడం పనులు పూర్తి చేసి.. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా మహాకుంభాభిషేకం నిర్వహించి, బ్రహ్మోత్సవాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 23న ముఖ్యమంత్రి స్వర్ణతాపడం సంప్రోక్షణ పూజల్లో పాల్గొననున్నారు.

గుట్టకు ప్రత్యేక బోర్డు..

యాదగిరిగుట్ట ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మార్చి 1 నుంచి 11 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనుండటంతో ఆలోగానే గుట్టకు ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. మార్గదర్శకాలు, విధివిధానాలకు సంబంధించిన అంశాలపై కసరత్తు చేస్తోంది. కేబినెట్ ఆమోదంతో ప్రత్యేక పాలక మండలి సవరణ చట్టాన్ని వచ్చే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.

అనువంశిక ధర్మకర్త కుటుంబసభ్యులతో చర్చ..

యాదగిరిగుట్ట దేవస్థానానికి ప్రస్తుతం చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి వ్యవహరిస్తున్నారు. ఆయన లేదా ఆయన కుటుంబసభ్యులకు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించాలని దేవాదాయశాఖ భావిస్తున్నట్లు తెలిసింది. ఆలయ పాలక మండలి ఏర్పాటుతో వచ్చే చట్టపర సమస్యలను అధిగమించేందుకు, ప్రస్తుతం ఉన్న వ్యవస్థ మార్పునకు అంగీకరించేందుకు అనువంశిక ధర్మకర్త కుటుంబసభ్యులను ఒప్పించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు వారితో ప్రభుత్వ పెద్దలు చర్చిస్తున్నట్టు సమాచారం. పాలక మండలి ఏర్పాటుకు 1987 నాటి తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, దేవాదాయశాఖ చట్టాన్ని సవరించాల్సి ఉంటుంది. ఈ చట్టంలోని పలు సెక్షన్లను సవరించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దేవాదాయశాఖ మండలికి సంబంధించిన విధి, విధానాలపై ప్రధానంగా దృష్టి సారించింది.

మండలి చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యేల పోటీ..

యాదగిరిగుట్టకు పాలక మండలి చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. బోర్డులో 20 మంది సభ్యులు ఉంటారు. అనువంశిక ధర్మకర్త కుటుంబం నుంచి ఒకరికి అవకాశం కల్పించాలని దేవాదాయ శాఖ భావిస్తోంది. అలాగే ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారిని నియమించే అవకాశం ఉంది. చుట్టు పక్కనున్న జిల్లాల్లో దేవాదాయశాఖకు చెందిన ఆలయాలకు పలు వసతుల కల్పన యాదగిరిగుట్ట కేంద్రంగానే జరిగే అవకాశం ఉంది.

ఏఐతో గందరగోళం?

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఏఐ వాడకం

» అసమగ్ర సమాచారంతో సంక్లిష్టంగా మారిన వ్యవహారం
» పలువురి పేర్లు గల్లంతు

భూపాలపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ)ను వాడుతోందా? గత ఏడాది ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, ఇటీవల నిర్వహించిన కులగణనలో సేకరించిన వివరాల్ని వడపోయటంలో ఏఐనే ఉపయోగించారా?అంటే.. అవుననే వినిపిస్తోంది. ఏఐ కారణంగానే లబ్ధిదారుల జాబితాలో పలువురు అర్హులకు చోటు దక్కలేదని, ఫలితంగా గందరగోళం నెలకొన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కులగణన సందర్భంగా ఇచ్చిన ఫార్మాట్లో వ్యక్తిగత, కుటుంబ వివరాలతో పాటు స్థిర, చరాస్తుల సమాచారం, ఆదాయ వివరాలను కూడా నమోదు చేశారు. రేషన్‌కార్డులు మొదలుకొని ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాలకు ప్రభుత్వం ఈ వివరాలనే ప్రామాణికంగా తీసుకున్నట్లు సమాచారం. అయితే, కులగణనలో భాగంగా సేకరించిన సమాచారం సమగ్రంగా లేకపోవడం వల్ల ప్రస్తుతం సమస్యలు ఉత్పన్నమయ్యాయని అంటున్నారు. సర్వే సందర్భంగా చాలామంది తమ ఆస్తులు, ఆదాయ వివరాలను వెల్లడిస్తే భవిష్యత్తులో సంక్షేమ పథకాలు దక్కకపోవచ్చని భావించి పూర్తి వివరాలను వెల్లడించలేదు. దీనికి తోడు పలువురు రైతులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, సర్వే నెంబర్లు అప్డేట్ కాకపోవడం, కోర్టు వివాదాల్లో ఉన్న భూముల సమాచారం నమోదు చేయకపోవటం, ప్రజా పాలన, కులగణన వివరాలు ఆన్‌లైన్‌లో సమగ్రంగా నిక్షిప్తం చేయకపోవటం వంటి సమస్యలున్నాయి. ఈ అసమగ్ర వివరాలను ఏఐతో వడపోయటం వల్ల సమస్య మరింత పెరిగిందని అధికారవర్గాలే స్వయంగా చెబుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి గ్రామ సభల్లో ప్రకటించిన జాబితాల్లో చాలామంది పేర్లు గల్లంతవడానికి ఇదే కారణమని అంటున్నారు. మరోవైపు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లోనూ సొంత ఇళ్ల స్థలాలు ఉన్నప్పటికీ లేవని నమోదు చేయడం కూడా జాబితాలో పేర్లు రాకపోవడానికి దారితీసి ఉండొచ్చని చెబుతున్నారు. ఏఐ సాఫ్ట్‌వేర్ ద్వారా విశ్లేషించినప్పుడు.. ఇళ్ల మంజూరుకు భూములు ఉన్న వారిని మాత్రమే సాఫ్‌వేర్ పరిగణనలోకి తీసుకుందని అంటున్నారు.

సర్వే జాబితాలో నా పేరు లేదు



నాలుగేళ్ల నుంచి రేషన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్నా. ప్రజాపాలనతోపాటు కులగణన సర్వేలోనూ.. నాకు రేషన్‌కార్డు లేదని చెప్పాను. కొత్త రేషన్‌కార్డు కావాలని దరఖాస్తు చేశాను. అయినప్పటికీ సర్వే జాబితాలో నా పేరు లేదు. అధికారులను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. కనీసం మళ్లీ ఏం చేయాలనే విషయాన్ని కూడా చెప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి నాకు రేషన్ కార్డు ఇప్పించాలి.

-చిట్యాల రాజు, సూరారం, భూపాలపల్లి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

జగదేవ్‌పూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. గొల్లపల్లికి చెందిన దొమ్మాట చిన్నకిష్టయ్య(50)కు భార్య, ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు.. కులవృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఎకరంన్నర పొలంతో పాటు మరో ఏడు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంట సాగుతో పాటు గతేడాది చిన్న కూతురు వివాహం చేయగా రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. అయితే పంటలు ఆశాజనకంగా పండకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనబడక తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఇంటి వెనకాల ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1.45 లక్షల కోట్ల ఆస్తుల అటాచ్

2024 వరకూ 7,403 కేసుల్లో ఈడీ స్వాధీనం

వీటిలో మోదీ హయాంలోనే అత్యధికం

న్యూఢిల్లీ, జనవరి 30: మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటి వరకు రూ.1.45 లక్షల కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. ఇందులో 21,370 కోట్ల ఆస్తులను 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి 9 నెలల్లో స్వాధీనం చేసుకుంది. పీఎంఎల్ఏ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2024 డిసెంబరు 31వ తేదీ వరకూ ఈడీ కేసుల వివరాలను జాతీయ మీడియా వెల్లడించింది. చాలా వరకు అంటే... రూ.1.19 లక్షల కోట్ల ఆస్తులను నరేంద్ర మోదీ ప్రభుత్వ (2014-24) హయాంలోనే ఈడీ అటాచ్ చేసుకుంది. 2002లో మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని తీసుకురాగా, 2005 జూలై 1న అమల్లోకి తీసుకువచ్చారు. పన్నుల ఎగవేత, నల్లధనం, మనీలాండరింగ్ వంటి తీవ్రమైన ఆర్థిక నేరాల కేసులను ఈడీ విచారిస్తోంది. ముఖ్యంగా గత ఐదారేళ్లుగా మనీలాండరింగ్‌పై ఈడీ చర్యలను ముమ్మరం చేసిందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. దేశంలో పలువురు ఉన్నత స్థాయి రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలతో పాటు సైబర్ నేరగాళ్లు, హవాలా ఆపరేటర్లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. 2024 డిసెంబరు 31 వరకు మొత్తం 7,403 కేసులు నమోదు చేసి, 911 మందిని అరెస్ట్ చేసి, రూ.1,45,927 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్టు వివరించారు. కాగా ఈడీ అటాచ్ చేసుకున్న వాటిలో 2024 ఏప్రిల్ వరకు 7,404 కోట్ల ఆస్తులను వెనక్కి ఇచ్చారు.


ట్రంప్‌కు 216 కోట్లు చెల్లించేందుకు మెటా అంగీకారం

వాషింగ్టన్, జనవరి 30: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు 216 కోట్లు (25 మిలియన్ డాలర్లు) చెల్లించి ఆయనతో ఒప్పందం చేసుకునేందుకు ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా అంగీకరించింది. ఈ మేరకు ఇరు వర్గాల మధ్య ఒప్పందం కుదిరినట్టు ఓ ఆంగ్ల మీడియా సంస్థ వెల్లడించింది. అందులో 199 కోట్లు ప్రెసిడెన్షియల్ లైబ్రరీకి, మిగతా 17 కోట్లు కేసు ఖర్చులకు ఉపయోగించనున్నట్లు ట్రంప్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నట్లు తెలిపింది. 2021 జనవరి 6వ తేదీన క్యాపిటల్ భవనంపై దాడి తర్వాత ట్రంప్‌నకు సంబంధించిన ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతాలను మెటా నిలిపేసింది. అప్పట్లో ఆ సంస్థపై ట్రంప్ దావా వేశారు.

డీ వన్ పట్టాల పేరిట భూములు స్వాహా

నిర్వాసితులకు ఇచ్చిన భూములకు నకిలీ పత్రాల సృష్టి.. 100 ఎకరాలకు అక్రమ పట్టాలు.. వాటితో రైతుబంధు, రుణాలు

» జగిత్యాల జిల్లా గాదేపల్లిలో వెలుగులోకి



జగిత్యాల జిల్లా గాదెపల్లి శివారులోని వివాదస్పద భూమి

జగిత్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో డీ వన్ పట్టాల పేరిట రూ.కోట్ల విలువైన భూములను పలువురు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన ముంపు నిర్వాసితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాలకు తెరలేపారు. లబ్ధిదారుల జాగాలో నకిలీలు పాగా వేశారు. ధర్మపురి మండలం గాదేపల్లి గ్రామ శివారులో 2014-18 సంవత్సరాల మధ్య కాలంలో 100 ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ వ్యవహారంలో కొందరు రాజకీయ నేతలు, వారి బంధువుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు గతంలో పని చేసిన పలువురు రెవెన్యూ, సర్వే అధికారులు సహకరించినట్లు వినికిడి. శ్రీరాంసాగర్ నిర్వాసితులకు డీవన్ పట్టాల కేటాయింపు సమయంలో కొంత మంది దళారులు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారు. చాలాకాలం కింద డీ వన్ పట్టాల జారీ, భూముల కేటాయింపు ప్రక్రియ ముగిసినా కొందరు అక్రమార్కులు అధికారులను అడ్డుపెట్టుకొని 2014 నుంచి 2018 వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు సమాచారం. జిల్లాలో భూముల రేట్లు బాగా పెరగడంతో విలువైన సర్కారు భూములపై కన్నేసి నిర్వాసితుల పేరిట తప్పుడు డీ వన్ పట్టాలు పుట్టించి భూములు కేటాయించినట్లు రికార్డులు సృష్టించారు.

ఒకే గ్రామంలో వంద ఎకరాలకు పైగా

గాదేపల్లిలో వంద ఎకరాలకు పైగా అక్రమంగా డీ వన్ పట్టాల పేరిట భూములను కాజేసినట్లు తెలుస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గ్రామాల పునరావాసం, రీ సెటిల్‌మెంట్ విధానం అమలు చేయడంలో భాగంగా 1992 సంవత్సరంలో గెజిట్ నంబరు 34 జారీ చేశారు. గాదేపల్లి గ్రామంలో నిర్వాసితులకు పునరావాసం కోసం 501.16 ఎకరాలకు డీవన్ పట్టాలు ఇచ్చారు. అలాగే ధర్మారం, జైన, దోనూర్ గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్లలో 1102.17 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కాలక్రమేనా కొందరు డీ వన్ పట్టాదారులు సంబంధిత భూములను అమ్ముకొని వెళ్లారు. ఇదే సర్వే నెంబర్‌పై కొందరు ఆక్రమణదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

అక్రమ పట్టాలతో రైతుబంధు, రుణాలు!

అక్రమ పట్టాలతో సంబంధిత వ్యక్తులు ఆరు సంవత్సరాలుగా రైతుబంధు కింద సాయం పొందినట్లు తెలుస్తోంది. మరికొందరు పట్టాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందడం, ఇతర ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నట్లు అనుమానాలున్నాయి. సంబంధిత వ్యక్తులు రైతు బంధు, బ్యాంకు రుణాలను ఏయే సంవత్సరం.. ఎంత మేరకు పొందారనే వివరాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

విచారణ జరిపాం



ధర్మపురి మండలంలోని గాదేపల్లి శివారులో అక్రమంగా డీ వన్ పట్టాలు సృష్టించారని వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపాం. తప్పుడు పట్టాల పత్రాలు పొంది మోఖాపై లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేశాం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అక్రమ పట్టాలను రద్దు చేసే అవకాశాలున్నాయి

- మధుసూదన్, రెవెన్యూ డివిజనల్ అధికారి, జగిత్యాల

క్యూఆర్ స్కాన్‌తో చిటికెలో ట్రైన్ టికెట్.!

» 879 కంప్యూటర్లలో క్యూఆర్‌ను జోడించిన ద.మధ్య రైల్వే

» ఇది పారదర్శకతకు మైలురాయి: జీఎం అరుణ్‌కుమార్ జైన్



హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు రైల్వే టికెట్లను కొనుగోలు చేయడానికి దక్షిణ మధ్య రైల్వే మరింత సులువైన మార్గాలను ప్రవేశపెడుతోంది. ఇకపై రైల్వేస్టేషన్లలో సాధారణ టికెట్లతో పాటు రిజర్వేషన్ కేంద్రాల్లో టికెట్ చార్జీల చెల్లింపునకు మెరుగైన క్యూఆర్ కోడ్ వ్యవస్థను తీసుకువచ్చింది. జోన్ పరిధిలోని 879 కంప్యూటర్లలో ఆధునికీకరించిన క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇక నుంచి చార్జీల చెల్లింపు కోసం ఫోన్ల ద్వారా ఆయా క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి టికెట్లను సులువుగా పొందవచ్చని చెప్పారు. అన్ని వివరాలను సిస్టమ్‌లో నమోదు చేశాక చెల్లింపును అంగీకరించే ముందు, క్యూఆర్ కోడ్ ప్రత్యక్షమవుతుందని వెల్లడించారు. తద్వారా మొబైల్ ఫోన్లో ఉన్న చెల్లింపు యాప్‌ల ద్వారా ప్రయాణికులు దానిని స్కాన్ చేసి టికెట్లను పొందవచ్చని తెలిపారు. ఈ విధానం పారదర్శకతకు మైలు రాయిగా నిలుస్తుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు.

లోకల్ కోటా రద్దుతో రాష్ట్ర విద్యార్థులకు నష్టం

» రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు స్పందించాలి: హరీశ్



హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మెడికల్ పీజీ సీట్లలో 50 శాతం 'లోకల్ రిజర్వేషన్' వర్తించదన్న సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణ విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోతారని పేర్కొన్నారు. తెలంగాణలోని 2,924 పీజీ సీట్లలో 50శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం 1,462 సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు వచ్చేవని, సుప్రీంకోర్టు తీర్పుతో ఆ సీట్లు కూడా ఆలిండియా కోటాలోకి వెళ్లిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, ఏపీ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటారన్నారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ అంశాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించమని కోరాలని, తీర్పుపై స్టే తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ విషయంలో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు చొరవ తీసుకోవాలన్నారు.

ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ ఎవరు?

» నేడు పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత అధికారి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రస్తుత ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) మధుసూధన్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో ఎవరు రానున్నారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ప్రస్తుత అధికారి రిటైర్ అయ్యే సమయానికి ఆ పోస్టులో బాధ్యతలు చేపట్టబోయే తదుపరి అధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయాలి. కానీ ఈ పోస్టులో ఎవరిని నియమించాలన్న దానిపై ప్రభుత్వం ఇంకా ఓ నిర్ణయానికి రాలేదని తెలిసింది. శాఖలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆ ఎవరికి బాధ్యతలు ఇవ్వాలనే విషయంలో సందిగ్ధత ఏర్పడినట్టు తెలిసింది. ప్రస్తుతం చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్‌గా ఉన్న ఎస్. తిరుమల, జయభారతితో పాటు మరో అధికారి ఆ పోస్టుకు పోటీ పడుతున్న వారి జాబితాలో ఉండగా ఎస్.తిరుమల ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా రానున్నట్టు చర్చ జరుగుతోంది. కొత్త ఈఎన్‌సీ ఎవరన్న దానిపై శుక్రవారం స్పష్టత రానుంది.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా:మహిపాల్‌రెడ్డి

హిమాయత్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్ణయం ఏదైనా.. తాను కట్టుబడి ఉంటానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టంచేశారు. హిమాయత్‌నగర్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి నివాసంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో భేటీ అయ్యారు. పటాన్‌చెరులో ఇటీవల కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదంపై ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. దాదాపు గంట పాటు జరిగిన ఈ సమావేశంలో అన్ని అంశాలపై చర్చించామని, నియోజకవర్గంలో పార్టీలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించడానికి అధిష్ఠానం పెద్దలు తీసుకునే చర్యలకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని తెలిపారు. తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని స్పష్టంచేశారు.

అలుగుబెల్లి ,అశోక్ కుమార్‌లకు మద్దతు

» టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ ప్రకటన

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న అశోక్ కుమార్‌లకు టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ మద్దతు ప్రకటించింది. ఇరువురు నాయకులు ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేసి, నిబద్ధతతో వ్యవహరించారని యూటీఎఫ్, టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, సిహెచ్ అనిల్ కుమార్, ఎ వెంకట్, ఎన్ తిరుపతి పాల్గొన్నారు.



'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్-2024' బంపర్ డ్రా

» విజేతల్లో ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కొక్కరికి 50 గ్రాములు

» ఇద్దరికి 10 గ్రాముల బంగారు నాణేల అందజేత

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వంట నూనెల బ్రాండ్ ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్' బంపర్ డ్రా విజేతలను ప్రకటించింది. ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో విజేతకు 50 గ్రాముల బంగారు నాణెం, ఒక్కో రాష్ట్రంలో ఇద్దరు విజేతలకు 10 గ్రాముల బంగారు నాణేలకు ఎంపిక చేశారు. ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి న్యాయనిర్ణేతగా వ్యవహరించి విజేతలకు బంగారు నాణేలు అందించారు. పండగ సీజన్‌లో వినియోగదారులకు చేరువయ్యేందుకు 'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్-2024" ప్రమోషన్ స్కీమ్ ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ స్కీమ్‌ను అమలు చేశారు. ఈ ప్రాంతాల్లోని 100 మంది వినియోగదారులు రోజుకు 1 గ్రాము బంగారం గెలుచుకోవడంతో పాటు బంపర్ డ్రాలో పాల్గొనే అవకాశం పొందారు. ఐదు రాష్ట్రాల నుంచి ఐదుగురు (ఒక్కో రాష్ట్రం నుంచి ఒకరు) 50 గ్రాముల బంగారు నాణెంను, 10 మంది (ఒక్కో రాష్ట్రం నుంచి ఇద్దరు) 10 గ్రాముల బంగారు నాణెం అందుకుంటున్నారు. ప్రత్యేక ప్రమోషనల్ కార్యక్రమాలతో వినియోగదారులకు ఆనందం కలిగించే ప్రయత్నాలు చేస్తుంటామని జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర రెడ్డి తెలిపారు.

ఇంత మంచి పాలన నేనింత వరకు చూడలేదు

» పథకాలపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

» ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూల సిద్ధాంతం!: సంపత్ కుమార్



హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): "నా 30 ఏళ్ల రాజకీయ అనుభవంతో చెబుతున్నా... ఇంత కంటే మంచి పాలన నేనింత వరకు చూడలేదు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు అందరికీ అందేలా చూస్తాం. పథకాలపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. అమల్లో ఉన్న పథకాలేవీ ఆగే ప్రసక్తే లేదని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంతో ఎవరూ ఆందోళన చెందరాదని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. కాగా, ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూల సిద్ధాంతమని, తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కచ్చితంగా చేస్తుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మంద కృష్ణమాదిగ ఎలాంటి ఆందోళన చేయొద్దని సూచించారు. ఈ మేరకు గురువారం సంపత్‌కుమార్ గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కమిటీల పేరుతో బీఆర్ఎస్ చేసే శవ రాజకీయాలకు రైతాంగం మోసపోయే పరిస్థితిలో లేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో దేశ చరిత్రలోనే నిలిచిపోయేలా ఏకకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. తన ప్యాలెస్ నుంచి సీఎం రేవంత్ పాలన చేస్తున్నారనే బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామరామ్మోహన్ రెడ్డి విమర్శించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, సీఎం నివాసం నుంచి సమీక్ష చేస్తే తప్పేమిటని ఓ ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. గతంలో ఉన్న ఐఏఎస్ అధికారుల నివాస సముదాయాలను కూల్చి కేసీఆర్ ప్యాలెస్ కట్టుకున్నారని, ప్యాలెస్ సీఎం ఎవరు? అంటే ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు పిలుపునివ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం ప్రజలకు తెలిసిపోయిందని టీపీసీసీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నేసతీశ్ పేర్కొన్నారు.

50 వేల కోట్ల అప్పు కావాలి!

(మొదటిపేజీ తరువాయి)

తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చింది. నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ద్వారా సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసి, ఈ రుణాన్ని సేకరించింది. మూడు నుంచి పదేళ్ల కాల వ్యవధితో ఈ బాండ్లను విడుదల చేసింది. ఈ రుణ సేకరణలో ఐసీఐసీఐ బ్యాంకు మధ్యవర్తి పాత్రను పోషించగా, 'బీకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్' బాండ్ ఇన్వెస్టర్ల హక్కులకు ట్రస్టీగా నిలిచింది. ఈ అప్పు కోసం టీజీఐఐసీ, ఐసీఐసీఐ బ్యాంకు, బీకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం ప్రభుత్వం మరో రూ.2000 కోట్ల అప్పును హడ్కో నుంచి సేకరించింది. రహదారి ఉత్తర భాగం నిర్మాణం కోసం సేకరించే భూముల పరిహారంలో రాష్ట్రం తన వాటా కింద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు డిపాజిట్ చేయడానికిగాను రూ.2000 కోట్లను హడ్కో నుంచి రుణంగా తీసుకుంది. ఇలా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా బడ్జెట్‌కు ఆవల రూ.12 వేల కోట్ల రుణాలను సేకరించింది.

టీజీఐఐసీ ద్వారా మరో రూ.20 వేల కోట్లు

టీజీఐఐసీ ద్వారా ఇప్పటికే రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చిన ప్రభుత్వం.. అదే సంస్థ ద్వారా మరో రూ.20 వేల కోట్ల అప్పును తేవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఈ రుణం కోసం ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబరు 25లోని 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదలాయించింది. ఎకరాకు రూ.75 కోట్లుగా నిర్ధారించి భూబదలాయింపు జరిపింది. ఈ భూముల్ని వివిధ ఆర్థిక సంస్థలు, బ్యాంకులకు తనఖా పెట్టి మొత్తం రూ.30 వేల కోట్ల రుణాన్ని సేకరించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇప్పటికే రూ.10 వేల కోట్లు సేకరించినందున మరో 20 వేల కోట్లను సేకరించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. టీజీఐఐసీ అధికారులు పలు బ్యాంకులతో చర్చలు జరుపుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మరో 10 వేల కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 24లక్షల ఇళ్లను మంజూరు చేయనుంది. ఈ పథకం అమలుకు రూ.20 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రాథమికంగా తేల్చారు. ఇంత భారీగా నిధులను ప్రభుత్వ ఖజానా నుంచి సమకూర్చడం సాధ్యం కాదు. దీంతో హడ్కో నుంచి రుణం తీసుకోవాలని యోచిస్తోంది. మొత్తం రూ.20 వేల కోట్లను రుణంగా కాకుండా కొంత ఖజానా నుంచి సర్దుబాటు చేసి, దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా అప్పు సేకరించాలని ఆలోచిస్తోంది.

యంగ్ ఇండియా గురుకులాలకూ..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. వీటన్నింటికీ ఒకే చోట హాస్టల్, స్కూల్ భవనాలను సమకూర్చనుంది. యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాల పేరిట నియోజకవర్గానికొకటి చొప్పున మొత్తం 119 భవనాలను నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో గురుకులాన్ని 25 ఎకరాల్లో నిర్మించబోతోంది. వీటి నిర్మాణ బాధ్యతలను తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ)కు అప్పగించింది. ఇప్పటికే కొడంగల్, హుజూర్‌నగర్, మధిర గురుకులాల నిర్మాణానికి టెండర్లు పిలిచింది. ఒక్కో గురుకుల భవనానికి రూ.200 కోట్లు అవసరమని అంచనా వేశారు. మొదటి దశ కింద 54 గురుకులాలను నిర్మించనున్నారు. వీటికి రూ.10,800 కోట్లు అవసరం. ప్రభుత్వం వద్ద ఇంత సొమ్ము లేదు. ఈ నేపథ్యంలో ఒక్కో గురుకులానికి కేటాయించిన 25 ఎకరాలను తనఖా పెట్టి రుణాలు తీసుకోవాలని యోచిస్తోంది. కనీసం రూ.5000 కోట్ల రుణం సేకరించే ఆలోచనలో ఉంది. ఇప్పటికే ఏడీబీ, జైకాలతో సంప్రదింపులు జరుపుతోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కోసం మరో రూ.5000 కోట్ల రుణం తీసుకోవాలని యోచిస్తోంది. ఈ మేరకు ప్రపంచ బ్యాంకుతో వైద్య శాఖ అధికారులు చర్చలు జరుపుతున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు కూడా రుణాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు మొత్తానికి రూ.14,100 కోట్లు అవసరమని పురపాలక శాఖ అంచనా వేసింది. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4,100 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి భూసేకరణ కోసం మరో రూ.3000 కోట్లను రుణంగా తీసుకోవాలని సర్కారు యోచిస్తోంది. ప్రపంచ బ్యాంకు అధికారులతో సమావేశమైన ప్రభుత్వ పెద్దలు.. మూసీ ప్రాజెక్టుతో పాటు ఆర్ఆర్ఆర్‌కు అవసరమైన రూ.3000 కోట్లను రుణంగా ఇవ్వాలని ప్రస్తావించారు. ప్రపంచ బ్యాంకు రుణానికి తక్కువ వడ్డీ ఉండడంతో ఎక్కువ అప్పు తీసుకునే ఆలోచనలో ఉంది. ఇలా రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.50 వేల కోట్ల వరకు రుణాలను సేకరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కూడా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 వేల కోట్ల రుణాలు సేకరించే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ మేరకు రుణాల ప్రతిపాదనలను సిద్ధం చేసి, వాటిని కార్యరూపంలో పెట్టేందుకు అవసరమైన సలహాదారు-బ్యాంకు మర్చెంట్‌ను నియమించేందుకు టెండర్లను ఆహ్వానించింది. ప్రభుత్వ గ్యారెంటీలు ఉన్నా, లేకున్నా రుణాలు ఇప్పించాలని షరతు పెట్టింది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత సర్కారు చేసిన అప్పుల భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. పెనుభారంగా మారిన ఈ రుణాల పునర్వ్యవస్థీకరణకు యత్నిస్తోంది.

సాక్షాత్తూ సచివాలయంలో నకిలీ ఉద్యోగి

» రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్‌గా ప్రచారం

» నకిలీ ఐడీ కార్డుతో చలామణి

» పట్టుకున్న ఎస్పీఎఫ్

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ సచివాలయంలో నకిలీ ఉద్యోగి వ్యవహారం కలకలం రేపింది. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నకిలీ ఐడీ కార్డుతో చలామణి అవుతున్న ఒక వ్యక్తిని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), ఇంటెలిజెన్స్ పోలీసులు శుక్రవారం సచివాలయంలో పట్టుకున్నారు. కొద్దిరోజులుగా ఓ వ్యక్తి సచివాలయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని, పైగా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ అని చెప్పుకుంటున్నాడని సచివాలయ ముఖ్య భద్రతా అధికారికి మంగళవారం ఫిర్యాదు వచ్చింది. స్పందించిన భద్రతా సిబ్బంది ఈ విషయంపై నిఘా ఉంచగా.. ఆ నకిలీ ఉద్యోగి గురువారం సచివాలయానికి వచ్చినట్టు వారికి సమాచారం అందింది. అప్రమత్తమైన పోలీసులు సచివాలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, నేరుగా ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్‌రావుగా గుర్తించిన పోలీసులు.. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నకిలీ ఐడీ కార్డు తయారీకి మైనార్టీ శాఖలో పనిచేసే సెక్షన్ ఆఫీసర్ వాహన డ్రైవర్ రవి అనే వ్యక్తి భాస్కర్‌రావుకు సహకరించినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి, ఇద్దరినీ విచారిస్తున్నారు. నకిలీ ఐడీ కార్డుతో చలామణి అవుతున్న భాస్కర్‌రావు, అతనికి సహకరిస్తున్న రవి ఇద్దరు కలిసి కీలక మంత్రుల పేర్లు చెబుతూ.. దందాలకు తెరలేపినట్టు ఆరోపణలు వినబడుతున్నాయి. ఏదైనా పనులుంటే తమకు చెప్పాలని, ఫైళ్లు క్లియర్ చేయించడంతో పాటు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి దగ్గర డబ్బులు వసూలుచేశారనే ఆరోపణలూ వినబడుతున్నాయి.



హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖును కలిసిన భట్టి

హిమాచల్‌లో తెలంగాణ విద్యుత్ కేంద్రాలు!

» ఆ రాష్ట్ర సీఎంను కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్‌లో 520 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రాలు నిర్మించాలని తెలంగాణ యోచిస్తోంది. ఆ రాష్ట్ర ప్రభుత్వం బీవోవోటీ విధానంలో 22 జల విద్యుత్ కేంద్రాలకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. సెలి, మియార్ వ్యాలీల్లో 400, 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ల నిర్మాణానికి తెలంగాణ ఆసక్తి వ్యక్తీకరించింది. తెలంగాణ జెన్‌కో అధికారులు ఆ రాష్ట్రంలో పర్యటించి, పరిశీలించారు. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖుతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. రెండుచోట్ల ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరిస్తూ లేఖ అందించారు. ఎంవోయూ ముసాయిదా పంపించాలని, దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని సుఖుకు భట్టి తెలిపారు.

వర్సిటీ అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు అయిదేళ్లు పెంపు

» ఇకపై 65 సంవత్సరాలు.. ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)పేస్కేల్ పొందుతున్న అధ్యాపకుల పదవీ విరమణ వయస్సును ప్రభుత్వం పెంచింది. ఇప్పటివరకు 60సంవత్సరాలకు రిటైర్మెంట్ అవుతుండగా.. దీనిని ఐదేళ్ల పొడిగించి 65కి పెంచింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇప్పటివరకు యునివర్సిటీల్లో కొత్త అధ్యాపకుల భర్తీ జరగలేదు. చివరిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో 2013లో నియామకాలు జరిగాయి. ప్రతి ఏటా అధ్యాపకులు రిటైర్ అవుతుండటం, కొత్త భర్తీలు లేకపోవడంతో విశ్వవిద్యాలయాల్లో బోధనపై తీవ్ర ప్రభావం పడుతోంది. శుక్రవారం (జనవరి 31)తో పాటు పాటు రానున్న రెండు మూడు నెలల్లో పదవీ విరమణ పొందే అధ్యాపకుల సంఖ్య ఎక్కువగా ఉంది. కొత్తవారిని భర్తీ చేయడంలో జాప్యం జరుగుతుండటంతో ఇప్పుడున్న సీనియర్ అధ్యాపకుల సేవలను మరింతకాలం ఉపయోగించుకోవాలన్న లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

పంచాయతీ పోరుకు సై!

(మొదటిపేజీ తరువాయి)



జాబితాను సిద్ధంచేసేందుకు షెడ్యూల్ విడుదల చేయడం గమనార్హం. నిరుడు 86 గ్రామ పంచాయతీలను సమీప కార్పొరేషన్‌లలో, మునిసిపాలిటీల్లో విలీనం చేశారు. ఇందులో కొన్నింటిని కొత్త మునిసిపాలిటీలుగా ప్రకటించారు. ఈ మేరకు పంచాయతీ ఓటర్ల జాబితాలో నుంచి ఆయా గ్రామాల ఓటరు లిస్టులను తొలగించనున్నారు. ఆ తర్వాత పంచాయతీ ఓటర్ల తుదిజాబితాను ప్రకటిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీచేశారు. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశాల్లో సూచించారు. అనుబంధ ఓటరు జాబితాను ఫిబ్రవరి 3వ తేదీలోగా ప్రకటించాలని సూచించారు. వీటిపై అభ్యంతరాలను స్వీకరించి, పరిశీలించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 4న ఎంపీడీవో మండల స్థాయిలో రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని, ఫిబ్రవరి 6న అనుబంధ ఓటరు తుదిజాబితాను ప్రకటించాలని సూచించారు. వీటితో పాటుగా గతంలో గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ప్రకటించిన సమయంలో వివిధ కారణాలతో 64 గ్రామ పంచాయతీల్లో రూపొందించలేదు. ఈ నేపథ్యంలో వాటి తుదిఓటరు జాబితాను తయారుచేయాలని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఈనెల 3న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించాలని, దీనికి తాజాగా ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరుజాబితాను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. 4న మండలస్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, 5వ తేదీ కల్లా అభ్యంతరాలను స్వీకరించాని, 6న వాటిని పరిష్కరించాలని, 7న తుది ఓటరుజాబితాను 64 గ్రామాలు సహా అన్ని పంచాయితీలకు 7న ప్రకటించాలని వెల్లడించారు.

నాలుగు రోజుల్లో ఎంపీటీసీల విభజన


ప్రతి మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేవిధంగా ప్రభుత్వం చట్టంలో మార్పులు తీసుకొచ్చింది. ఇందుకు అనుగుణంగా ప్రతి మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండే విధంగా విభజన చేయాలని ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. గురువారమే ఈ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 3వ తేదీ కల్లా ఎంపీటీసీ స్థానాల విభజన ప్రక్రియ పూర్తిచేయాలని సూచించడంతో పంచాయతీ విభాగాలు, మండల అభివృద్ధి అధికారులు తమ పరిధిలోని గ్రామాలకు సంబంధించి ఎంపీటీసీ స్థానాల వివరాలను సిద్ధంచేశారు. శుక్రవారం వరకు అభ్యంతరాలను స్వీకరించాలని, ఫిబ్రవరి 2 వరకు అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలని, 3న తుది ఎంపీటీసీ పరిధి జాబితాను ప్రకటించాలని పీఆర్ కార్యదర్శి ఆదేశించారు.

7న అసెంబ్లీ సమావేశం?

వీలైనంత త్వరగా పంచాయతీల నిర్వహించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులువేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై కార్యాచరణ కొనసాగుతోంది. అందులో భాగంగానే ఫిబ్రవరి 7న అసెంబ్లీ సమావేశం ఏర్పాటుచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానాన్ని ఆమోదించే అవకాశాలున్నాయి. బీసీ రిజర్వేషన్లను పెంచాలంటే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధనలు మార్చాల్సి ఉంటుంది. అది కేంద్రం పరిధిలోనే ఉండటంతో దీనిపై అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేశాక కేంద్ర స్పందన కోసం కొన్నాళ్లు వేచిచూసి.. ఒకవేళ సానుకూల సంకేతాలు రాకుంటే.. పార్టీ పరంగానే బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలుచేసే ఉద్దేశం కూడా అధికార కాంగ్రెస్‌లో కనిపిస్తోంది.

కంటైనర్‌లో 'జూమ్' కార్లు

» జీపీఎస్‌తో గుర్తించి ఏపీలోని బిట్రగుంట వద్ద స్వాధీనం..





పోలీసులు స్వాధీనం చేసుకున్న 3 కార్లు, కంటైనర్; కంటైనర్‌లోని కారును పరిశీలిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జూమ్‌కార్ యాప్ ద్వారా హైదరాబాద్‌లో కారు అద్దెకు తీసుకుని... అపహరించి కంటైనర్‌లో చెన్నై తరలిస్తూ పట్టుబడ్డాడో వ్యక్తి. పోలీసులు జీపీఎస్ సాయంతో ప్రకాశం జిల్లాలో కంటైనర్‌ను, అందులోని మూడు కార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో చిట్టిప్రోలు ఉత్తేజ్ జూమ్ యాప్ ద్వారా కార్లను రోజువారీ అద్దెకు ఇస్తుంటాడు. గులాం మహమ్మద్ రావత్ అనే వ్యక్తి కారును రోజుకు రూ.2 వేల చొప్పున అద్దెకు తీసుకున్నాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అనుమానం రావడంతో ఉత్తేజ్ హైదరాబాద్‌లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కారు ప్రకాశం జిల్లాలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు సమాచారం ఇచ్చారు. జీపీఎస్ ఆధారంగా టంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో కారు ఉన్నట్టు గుర్తించారు. ఆయన సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్యను, హైవే మొబైల్ పోలీసులను అప్రమత్తం చేయడంతో వారు వెంటనే టోల్‌ప్లాజా వద్ద వాహనాలను జల్లెడ పట్టారు. కానీ కారు మాత్రం కనపడలేదు. మరోసారి సాంకేతిక పరిజ్ఞానంతో లొకేషన్ గుర్తించగా అప్పటికే టోల్‌ప్లాజా దాటినట్లు గుర్తించారు. పోలీసులు లొకేషన్‌ను ట్రాక్ చేస్తూ వాహనాల్లో వెంబడించారు. బిట్రగుంట ఫ్లైఓవర్ వద్దకు వెళ్లేసరికి కారు అక్కడే ఉన్నట్టు చూపుతున్నా రహదారిపై మాత్రం కనిపించలేదు. జీపీఎస్ చూపుతున్న లొకేషన్‌లో కంటైనర్ ఉండటంతో పోలీసులు దాన్ని ఆపారు. కంటైనర్ డోర్లు తీసి చూసి ఆశ్చర్యపోయారు. అందులో నంబర్ ప్లేట్లు మార్చిన థార్ వాహనంతో పాటు మరో రెండు కార్లు కూడా ఉన్నాయి. మూడు కార్లను, కంటైనర్‌ను సర్కిల్ కార్యాలయానికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హజరత్తయ్య తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వ చెలగాటం

- వారంలో ఫీజు బకాయిలు ఇవ్వకుంటే సచివాలయం ముట్టడి
- బీసీ విద్యార్థుల సమర శంఖరావంలో నాయకుల హెచ్చరిక
- ప్రభుత్వ ఖజానా ఉన్నది కాంట్రాక్టర్ల కోసమా అని ప్రశ్న

కవాడిగూడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానా ఉన్నది కాంట్రాక్టర్ల కోసమా లేక కాలేజీ విద్యార్థుల కోసమా పలువురు వక్తలు ప్రశ్నించారు. వారం పది రోజుల్లో విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. విద్యార్థుల త్యాగాలతో వచ్చిన తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వారి చదువులను విచ్ఛిన్నం చేస్తోందని, వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, ప్రైవేటు యూనివర్సిటీల్లో సామాజిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరా పార్కు వద్ద బీసీ విద్యార్థుల సమర శంఖారావ మహాసభ నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించకుండా వారి ఉసురు పోసుకుంటోందన్నారు. రూ.4,600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలే కానీ సీఎం జేబు నుంచి ఇస్తున్నట్లు భావించవద్దని సూచించారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఒక మాట వచ్చాక మరోమాట మాట్లాడుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, బీసీ కులాల ఐక్యవేదిక ఛైర్మన్ కుందారం గణేశ్‌చారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, బీసీ విద్యార్థి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ సంఘం నేతలు శ్యామ్ కురుమ, మాదేశి రాజేందర్, గూడురు భాస్కర్, మహిళా సంఘం అధ్యక్షురాలు మణిమంజరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్యుల్లా శ్రీవారి దర్శనానికి!

- వీవీఐపీ బ్రేక్‌లో అవకాశం ఉన్నా సర్వదర్శనం క్యూలో మాజీ గవర్నర్ కుటుంబం


శ్రీవారి ఆలయం ముందు విద్యాసాగర్‌రావు

తిరుమల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మాజీ గవర్నర్‌గా తనతో పాటు కుటుంబ సభ్యులు కూడా ప్రాధాన్య బ్రేక్‌లో శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశం ఉన్నా మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ఆదర్శంగా నిలిచారు. ఆయన గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శనానికి వెళ్లగా, కుటుంబ సభ్యులు మాత్రం శనివారం అర్ధరాత్రి సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. దాదాపు నాలుగు గంటలపాటు వారంతా క్యూలైన్‌లోనే ఉండి సాధారణ భక్తులతో కలిసి స్వామి దర్శనం చేసుకోవడం విశేషం. దర్శనానంతరం విద్యాసాగర్‌రావు మీడియాతో మాట్లాడుతూ, 50, 60 ఏళ్ల క్రితం తిరుమలకు బస్సుల్లో వచ్చి సర్వదర్శనం కోసం ఇబ్బందులు పడేవారమంటూ ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. యువత ప్రత్యేక దర్శనాల కోసం చూడకుండా రెండు మూడు రోజులైనా సరే క్యూలైన్‌లో వేచి ఉండి శ్రీవారిని దర్శించుకుంటే ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుందన్నారు. తిరుమలలో ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమశిక్షణతో కూడిన సిబ్బందిని చూసి చాలా ఆనందం కలిగిందని తెలిపారు.

పోలీసు అధికారుల సంఘానికి ఎన్నికలు నిర్వహించండి

- డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని డీజీపీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఎన్నికలు జరపాలని గతంలో ఇదే కోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడం లేదని పేర్కొంటూ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం...2016లో ఇచ్చిన తీర్పు ప్రకారం అయిదు వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది.

స్థానిక సంస్థల ఉప ఎన్నికలపై కౌంటర్ దాఖలు చేస్తాం

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- పాత పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు ఉపఎన్నికలు నిర్వహించే అంశంపై కౌంటర్ దాఖలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల పదవులకు పంచాయతీరాజ్ శాఖ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ 2023 మార్చి 6న హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. తాజాగా ఈ పిటిషన్ తాత్కాలిక చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కౌంటర్ దాఖలు చేయడానికి పంచాయతీరాజ్ శాఖ తరఫు న్యాయవాది మరో మూడువారాలు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో విచారణ మార్చి 5కు వాయిదా పడింది. మొత్తం స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు తీరిపోవడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉంది.

స్పెషల్ 'బాదుడు'

- మహాకుంభమేళా భక్తుల జేబులకు రైల్వేశాఖ కత్తెర
- ప్రత్యేక రైళ్లకు అదనంగా 25 శాతం వసూళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి30(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాకు తరలి వెళుతున్న భక్తుల జేబులకు రైల్వేశాఖ చిల్లుపెడుతోంది. సాధారణ రైళ్లతో పోల్చితే ప్రత్యేక రైళ్లకు టికెట్ ధర 13నుంచి 20% వరకు అదనంగా వసూలు చేస్తోంది. దేశవ్యాప్తంగా భక్తుల కోసం మొత్తం 3,100 ప్రత్యేక రైళ్లు నడుపుతుండగా, దక్షిణమధ్యరైల్వే పరిధిలో 181 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి వెళ్లే యాత్రికుల సంఖ్య అధికంగా ఉండడంతో ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక రైళ్లు నగరంలోని వివిధ టెర్మినల్స్ నుంచి ప్రారంభమవుతున్నాయి. కుంభమేళాకు రెగ్యులర్ రైళ్లలో వెళుతున్న ప్రయాణీకులు చెల్లించిన టికెట్ ధరతో పోల్చితే ప్రత్యేక రైళ్లలో వెళుతున్న ప్రయాణీకులపై ఎక్కువ భారం పడుతోంది.

13నుంచి 20% వరకు అదనం

సికింద్రాబాద్ నుంచి దానాపూర్‌కు వెళ్లే రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో స్లీపర్ క్లాస్‌కు టికెట్ ధర రూ.745, త్రీటైర్ ఏసీ రూ.1,945, టూటైర్ ఏసీ టికెట్ చార్జీ రూ.2,805లుగా ఉంది. కాగా, ప్రత్యేకరైళ్లలో మాత్రం టికెట్ ధరలు స్లీపర్‌క్లాస్ రూ.885, త్రీటైర్ ఏసీ రూ.2,250, టూటైర్ ఏసీ రూ.3,155గా నిర్ణయించారు. దీంతో ఆయా తరగతుల ప్రయాణీకులకు వరుసగా రూ.140, రూ.305, రూ.350లు అదనపు భారం పడుతోంది. రానుపోను టికెట్ ధరలకు, రిజర్వేషన్ చార్జీలు కూడా కలిపితే.. భారీ వ్యత్యాసం ఉంటోంది. యాత్రికులపై అదనపు భారం మోపకుండా చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల ప్రతినిధులు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

బంగారు పంటలు..
బేజారు ధరలు!

(మొదటిపేజీ తరువాయి)


మహబూబ్‌నగర్‌లో రైల్వే ట్రాక్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులను అడ్డుకున్న పోలీసులు

కందులకు కూడా క్వింటాకు దక్కింది ఎక్కువకు ఎక్కువ రూ..7,470 మాత్రమే. కొన్ని రకాలైతే రూ.6,500 మాత్రమే ఇచ్చారు. మార్కెట్లోకి కందుల రాక పెరిగిన కొద్దీ ధర పడిపోతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కందుల రాక ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్వింటాకు రూ.3,200 వరకు ధర తగ్గిపోయింది. వచ్చే నెలలో మార్కెట్లోకి కందులు మరింతగా వస్తాయని, అప్పుడు ధర మరింతగా పడిపోతుందా? అని నూర్పిడి దశలో పంట ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుడు కందులకు మంచి ధర రావడంతో రాష్ట్రవ్యాప్తంగా కందుల సాగు పెరిగింది. వికారాబాద్ జిల్లాలో గత ఏడాది 1,04,448 ఎకరాల్లో కంది పంట సాగైతే, ఈసారి 1,47,788 ఎకరాల్లో సాగు చేశారు. తాండూరు, కొడంగల్, పరిగి, దౌల్తాబాద్, బషీరాబాద్, దోమ, కుల్కచర్ల, యాలాల్, పెద్దేముల్, బొంరాస్‌పేట్ తదితర మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో కందులు వేశారు. సాధారణంగా ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు కంది పంట పండుతుంది. ఈసారి దిగుబడులు బాగానే వచ్చినా రోజురోజుకూ తగ్గుతున్న ధరలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేరుశనగకు 4వేలలోపే

వేరుశనగ రైతులది మరింత పెద్ద సమస్య! ఈసారి వారికి దిగుబడులు లేవు. ధరా లేదు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో వేరుశనగ పంట ఎక్కువగా సాగుచేస్తారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 2.49 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవగా అత్యధికంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో రైతులు ఈ పంట వేశారు. ఇక్కడ పండే వేరుశనగలో అఫ్లోటాక్సిన్ బ్యాక్టీరియా తక్కువగా ఉండటంతో వేరుశనగలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. దీంతో ఇక్కడి పంటకు డిమాండ్ ఎక్కువ. విదేశాలకూ ఎగుమతి చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని మార్కెట్లలో వేరుశనగకు రికార్డు స్థాయిలో ధరలొచ్చేవి. ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తుఫాన్ల ముప్పును తప్పించుకునేందుకు ముందస్తు యాసంగి సాగు ప్రణాళికలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని రైతులు నవంబరులోనే సాగును ప్రారంభిస్తున్నారు. ఈ ప్రణాళికే రైతులను దెబ్బ తీస్తోంది. పంట వేసిన నాటి నుంచి వానల ప్రభావం ఉండడంతో ఎకరానికి 12-15 క్వింటాళ్ల దాకా రావాల్సిన దిగుబడి కేవలం ఆరు క్వింటాళ్ల ఆలోపునకే పరిమితమైంది. పంటలో నాణ్యత కూడా తగ్గడంతో డిమాండ్ పడిపోయింది. ఈసారి కేంద్ర సర్కారు వేరుశనగకు కనీస మద్దతు ధర రూ.6783గా నిర్ణయించింది. నిరుటితో పోలిస్తే ఇది రూ.406 ఎక్కువే. కానీ, నాణ్యత పడిపోవడంతో జిల్లాలోని మెజారిటీ మార్కెట్లలో ఎమ్మెస్పీ కన్నా రూ.3వేల వరకు తక్కువే ఇస్తున్నారు. దిగుబడులు తగ్గడం, ధరలు లేకపోవడంతో ఎకరానికి రూ.30వేల వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ధరలు పడిపోతుండడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మార్కెట్‌లో ధర తక్కువగా ఇస్తున్నారని మార్కెట్ ఆఫీసుపై దాడి చేసి ఛైర్‌పర్సన్ భర్తను కూడా కొట్టారు. ఇక, అత్యంత తక్కువ ధరలు పలకడంతో మహబూబ్‌నగర్ మార్కెట్‌కు మంగళవారం పంట తెచ్చిన రైతులు రైలు పట్టాల వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. దీంతో కొనుగోలు చేసిన పంటకు క్వింటాకు రూ.200 ఎక్కువ ఇస్తామని వ్యాపారులు చెప్పారు. కానీ, బుధవారం మాట మార్చి కొనుగోలు చేసిన మొత్తం పంటకు కాకుండా కేవలం రూ.3500 నుంచి రూ.4500 ధర వచ్చిన పంటకు మాత్రమే ఆ మేర చెల్లింపులు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మార్కెట్లలో సగటు ధర 5500 వరకే వస్తోంది.

రైతులను పట్టించుకునే వారేరీ?



నేను మూడెకరాల్లో కంది సాగుచేశా. పండిన పంటకు కనీసం గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. వ్యాపారులకు లాభమవుతున్నా రైతులు నష్టపోతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

-ఉప్పరి రాజు, కంది పప్పు, మంబాపూర్, వికారాబాద్ జిల్లా

పత్తికి బోనస్ ఏది?

రెండేళ్లతో పోల్చితే పత్తి, మిర్చి ధరలు భారీగా పడిపోయాయి. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 43,76,043 ఎకరాల్లో పత్తి పంట, సుమారు 8.90 లక్షల ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో అత్యధికంగా పత్తి సాగవుతుంది. పెట్టుబడుల వ్యయం పెరగడం, చీడపీడల బెడద కారణంగా ఎకరాకు రూ.45వేల నుంచి రూ.60వేలకు పైగా రైతులు పెట్టుబడి పెట్టారు. దిగుబడులు మాత్రం 4-6 క్వింటాళ్లకే పరిమితమయ్యాయి. పత్తికి క్వింటాకు రూ.7,521 మద్దతు ధరను కేంద్రం ప్రకటించినా ఆ ధర రావడం లేదు. పత్తి విక్రయాలకు పెద్ద మార్కెట్లుగా ఉన్న వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో గత రెండు మూడు నెలలుగా క్వింటాకు రూ.5,800ల నుంచి రూ.7,200ల వరకు ధర పలుకుతోంది. ఫలితంగా ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేల వరకే వస్తోందని.. ఆ రకంగా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. తాము అధికారంలోకి వస్తే పత్తి రైతులకు రూ.475 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే దీనిపై సర్కారు దృష్టిపెట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 25.33 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి పంట వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం రైతులకు బోనస్ కింద సుమారుగా రూ.1,108కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. కాగా పత్తికి మద్దతు ధర చెల్లించాలంటూ పెద్దపల్లిలో రాజీవ్ రహదారిపై గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మార్కెట్లో పత్తికి క్వింటాకు రూ.6000-6500 వరకే ఇవ్వడంతో మార్కెట్లో అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధరకు కొంటున్నారని ఆరోపించారు.

ఎర్ర బంగారం నేలచూపులు

మిర్చి రైతులకూ నష్టాల ఘాటు తప్పడం లేదు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలు, మంచిర్యాల, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్ తదితర 19జిల్లాల్లో రైతులు సుమారు 8.90లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. 2020-22 మధ్య మిర్చికి మంచి ధరలు రావటంతో చాలా మంది రైతులు పత్తిని కాదని మిర్చి సాగు వైపు మొగ్గారు. నిరుటిలాగే ఈసారి కూడా మిర్చి రైతులకు కన్నీళ్లే మిగిల్చింది. ఖమ్మం సహా చాలాచోట్ల మార్కెట్లలోకి మిర్చి పోటెత్తుతోంది. అయితే రైతులు ఎక్కువ సాగు చేసే తేజ రకం మిర్చికి తొలుత రూ.9వేల నుంచి రూ.12వేల వరకే ధర పలికింది. డిసెంబరు రెండోవారంలో రూ.12వేల నుంచి రూ.16వేల మధ్య ధరలు ఉండగా, తాజాగా రూ.9వేల నుంచి రూ.14వేల వరకు ఇస్తున్నారు. వండర్ హాట్ మిర్చి రూ.11వేల నుంచి రూ.14వేల మధ్య ధరలున్నాయి. ఒకదశలో వండర్ హాట్‌కు గరిష్ఠంగా రూ.28,503 ధర వచ్చింది. తేజ రకం మిర్చికి క్వింటాకు రూ.7వేల వరకు, వండర్ హాట్‌కు రూ.14వేల వరకు ధరలు తగ్గినట్లుగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఖమ్మంలో గురువారం మిర్చి జెండా పాట క్వింటాకు రూ.14వేలు నిర్ణయించగా రూ.10వేల నుంచి రూ.13,600 వరకే కొన్నారు. కాగా ఆశించినట్లుగా ధరల్లేకపోవడంతో మిర్చికి ముందుముందు మంచి ధరలొస్తాయనే ఆశతో రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటున్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోనే సుమారు 15లక్షల బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయగా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 10లక్షల బస్తాలు, కేసముద్రం, మహబూబాబాద్, జగిత్యాల, కోరుట్ల, నిజామాబాద్ తదితర మార్కెట్లలో మరో 25లక్షల బస్తాలను కోల్‌స్టోరేజీల్లో రైతులు నిల్వ చేసినట్టు అంచనా.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా
నరేందర్‌రెడ్డి?

- జీవన్‌రెడ్డి పోటీలో లేరన్న మంత్రి శ్రీధర్‌బాబు
- ఒకటి రెండురోజుల్లో అభ్యర్థిని ప్రకటించే అవకాశం


నరేందర్‌రెడ్డి (ఫైల్)

కరీంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలపాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఒకటి రెండురోజుల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అధికారికంగా అభ్యర్థిని ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది. గురువారం కరీంనగర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పోటీ చేయడంలేదని, అభ్యర్థి ఎవరనేది ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. టీపీసీసీ నుంచి ఈ స్థానానికి జీవన్‌రెడ్డి పేరునే పంపారు. జీవన్‌రెడ్డి తాను పోటీలో ఉండబోనని ఏఐసీసీకి తెలిపారని శ్రీధర్‌బాబు పేర్కొనడంతో నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వానికి లైన్‌క్లియర్ అయినట్లు భావిస్తున్నారు. జీవన్‌రెడ్డిపై ఉన్న గౌరవభావంతోనే ఆయన పేరును టీపీసీసీ... ఏఐసీసీకి పంపింది. అభ్యర్థిత్వం విషయంలో నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పేర్లను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే 42 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ఎంపీల అభిప్రాయాలు తీసుకుని నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3.47 లక్షల ఓట్లు నమోదు కాగా అందులో సగానికిపైగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవే. దీంతో ఈ జిల్లావాసినే అభ్యర్థిగా నిలిపితే గెలుపు సాధించవచ్చని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. నరేందర్‌రెడ్డి అందరికన్నా ఎక్కువ ఓట్లు నమోదు చేయించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని నరేందర్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు కలిశారు. జిల్లాలో పలు సమావేశాల్లో నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి వేదిక పంచుకోవడంతో ఆయన అభ్యర్థిత్వం ఖరారైనట్లేనని భావిస్తున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్?

కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌ను నిలపాలని ఆ పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థి పేరు వెల్లడి కాగానే తమ అభ్యర్థిని ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకత్వం వేచిచూస్తున్నట్టు సమాచారం.

కేరళ లిక్కర్ స్కామ్‌లో.. కవిత!



(మొదటిపేజీ తరువాయి)

సవరించారని, ఆ తర్వాత దుకాణాల కేటాయింపు విషయాలు కూడా ఎవరికీ తెలియదని ప్రతిపక్షాలు మండిపడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఒయాసిస్ కంపెనీకి లైసెన్స్ వచ్చిన విషయం పాలక్కడ్‌లోని డిస్టిలరీలకు కూడా తెలియదన్నారు. 2023 పాలసీని ఆమోదించిన వెంటనే.. ఒయాసిస్ కంపెనీకి మద్యం తయారీ యూనిట్ నిర్వహణకు అనుమతులు లభించాయన్నారు. ఈ వ్యవహారంలో కవిత పాత్ర, ఆమె కేరళలో ఎక్కడ బస చేశారు? అనే వివరాలను పరిశోధించాల్సి ఉందన్నారు.

కంపెనీపై పంజాబ్‌లో కేసులు!

మధ్యప్రదేశ్, పంజాబ్ కేంద్రాలుగా ఒయాసిస్ కంపెనీ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు సతీశన్ తెలిపారు. పంజాబ్‌లో భూగర్భ జలాలను కలుషితం చేస్తోందంటూ ఆ కంపెనీపై కేసులున్నట్లు చెప్పారు. తాను చేస్తున్న ఆరోపణలపై కంపెనీ నుంచి ప్రతిస్పందన లేదని, మంత్రి రాజేశ్ కంపెనీ ప్రతినిధి మాదిరిగా ప్రకటనలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. "నేను ఎంపీగా ఉన్నప్పుడు పాలక్కడ్‌లో నీటి కొరత కారణంగా ఎన్నో ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చింది. అలాంటిది 8 కోట్ల లీటర్ల నీటిని వినియోగించే ఒయాసిస్‌కు ఎలా అనుమతినిచ్చారు?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కాగా.. సతీశన్ చేసిన ఆరోపణలను ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నీచ రాజకీయాలకు ఈ ఆరోపణలు నిదర్శనమని మండిపడ్డారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు.


కందారపు సారవ్వ, అన్నాజీ మమత (ఫైల్)

'ఉపాధి' పనిలో బండరాళ్లు మీద పడి తల్లీకూతురు మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు.. వారిలో ఒకరి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలను ఆదుకుంటామన్న మంత్రి పొన్నం
- కలెక్టర్‌కు కేంద్రమంత్రి సంజయ్ ఫోన్..

అక్కన్నపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండ రాళ్లు మీద పడి ఇద్దరు కూలీలు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో సంజీవరాయుని గుట్ట దగ్గర పలువురు కూలీలు పనులు చేస్తుండగా వారిపై బండరాళ్లతో పాటు మట్టి దిబ్బలు కూలాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు, కూలీలు వారిని బండ రాళ్లు, మట్టి తొలగించారు. కందారపు సారవ్వ (50), ఆమె కూతురు అన్నాజీ మమత (32) అక్కడికక్కడే మృతి చెందారు. ఇంద్రాల స్వరూప పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. మరో నలుగురికి తీవ్ర గాయాలవడంతో హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలు సారవ్వకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. కుమార్తె మమతకు భర్తతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ శ్రీనివాస్ సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ భాస్కర్ తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇటు కేంద్రమంత్రి బండి సంజయ్ జిల్లా కలెక్టర్ మను చౌదరితో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. కాగా, కూలీలు మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు జీవిత బీమా వర్తించేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

టెన్త్ విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం

- ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు అందజేత
- ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 కేటాయింపు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా పంపిణీ

హైదరాబాద్ సిటీ, జనవరి30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారం అందజేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనుండటంతో ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందిస్తారు. పాఠశాలల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు 3 వారాలుగా సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు చేపడుతున్నారు. విద్యార్థుల ఆకలి బాధలను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించాలని నిర్ణయించారు.

11 కోట్ల రూపాయలు కేటాయింపు

ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున మంజూరు చేయబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో దాదాపు 2 లక్షల మంది పదో తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. 38 రోజులకు సంబంధించి ప్రతి విద్యార్థిపై రూ. 570 చొప్పున దాదాపు 11 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

రోజుకో రకం స్నాక్స్

స్పెషల్ క్లాసులు జరిగే 38 రోజుల్లో ఉడకబెట్టిన శనగలు, పెసర్లు, పల్లీలు-బెల్లం, మిల్లెట్ బిస్కెట్లు, ఉల్లిపాయ పకోడిలో రోజుకో రకాన్ని అందించనున్నారు. హైదరాబాద్ జిల్లాలో మన్నన్ ట్రస్టు ద్వారా, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా అల్పాహారం పంపిణీ చేయనున్నారు.

ఉచితాలు దేశాభివృద్ధికి అవరోధమే

ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



- ఉచితాలపై అన్ని పార్టీలదీ ఒకే తీరని విమర్శ
- రంగులు వేరైనా డబుల్ ఇంజన్‌లానే నడవాలి
- రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి
- బీపీఆర్ విఠల్ సంస్మరణ సభలో దువ్వూరి

హైదరాబాద్ సిటీ, జనవరి30(ఆంధ్రజ్యోతి): పేదరికం అధికంగా ఉన్న భారత్‌లో ఉచిత పథకాలు అవసరమేనని, అయితే అవి హద్దుమీరితే దేశాభివృద్ధికి అవరోధంగా మారతాయనడంలో సందేహం లేదని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పారు. విద్య, వైద్యం తదితర సేవలు ఉచితంగా అందించడం ద్వారా మరింత సత్ఫలితాలను సాధించవచ్చని వివరించారు. ఉచితాల విషయంలో అన్ని పార్టీలు ఒకే తీరుగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. కొన్ని రాష్ట్రాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారని, అంతకన్నా అదే ఖర్చుతో వారికి మరింత తోడ్పాటును అందించే మరొక పథకం అందించవచ్చేమో ఆలోచించాలని సూచించారు. ముందుగా అధ్యయనం ద్వారా ఏ పథకంతో ప్రజలు అధిక ప్రయోజనం పొందుతారన్న విషయంపై అవగాహనకు రావాలని ఆయన హితవు పలికారు. ప్రముఖ ఆర్థికవేత్త బీపీఆర్ విఠల్ మూడవ స్మారకోపన్యాసంలో భాగంగా అమీర్‌పేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) వేదికగా 'భారత ఆర్థిక సమాఖ్యవాదం-భవిష్యత్తు' అంశంపై దువ్వూరి కీలకోపన్యాసం చేశారు. కేంద్ర, రాష్ట్రాలలో భిన్న దృక్పథాలు లేదా విభిన్నాభిప్రాయలు కలిగిన పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, వాటి మధ్య సంబంధాలు మాత్రం డబుల్ ఇంజన్ సర్కారులాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఇరు ప్రభుత్వాల దృష్టి దేశాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే వికసిత భారత్-2047 లక్ష్యాన్ని సాధించగలమని నొక్కిచెప్పారు.

రాష్ట్రాల సగటు వాటాలో భారత్ మెరుగు

కేంద్ర, రాష్ట్ర వనరులు, అధికారాలు, పన్నులు, వ్యయ బాధ్యతలు రాజ్యాంగానికి అనుగుణంగా సాగాలని దువ్వూరి సూచించారు. కేంద్రం రాష్ట్రాలకు పంచుతున్న వ్యయం వాటాలో 60:40శాతాన్ని అవలంబిస్తోందన్నారు. వ్యయం పరంగా చూసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు సగటున 63.9 శాతం ఖర్చు చేస్తుండగా మిగిలింది కేంద్రం ఖర్చు చేస్తోందని, ఈ విషయంలో చాలా దేశాలతో పోలిస్తే భారత్ మెరుగ్గా ఉందని దువ్వూరి వెల్లడించారు. బ్రెజిల్‌లో 40.2%, ఇండోనేషియాలో 37.9%, అమెరికా, ఆస్ట్రేలియాలో సుమారు 40% వరకు ఆయా దేశాల్లోని రాష్ట్రాలు వెచ్చిస్తున్నాయన్నారు. వాటితో పోలిస్తే భారత్‌లోని రాష్ట్రాలు ఎక్కువ వ్యయాన్ని ఖర్చుపెడుతున్నాయని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.